మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM

సంపుటి 07, సంచిక: 341 | మంగళవారం | 12-11-2024 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

టిజిపిఎస్‌సి నూతన చైర్మన్ నియామకానికి నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నూతన చైర్మన్ నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. టిజిపిఎస్‌సి ప్రస్తుత ఛైర్మన్ మహేందర్ రెడ్డి పదవీకాలం ఈ డిసెంబర్ 3 వతేదీతో ముగియనుంది.దీంతో నూతన ఛైర్మన్ నియామకానికి సంబంధించి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20న సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించారు.

51వ సిజెఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం

రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రధాని మోదీ, మల్లికార్జున్ ఖర్గే సహా పలువురు ప్రముఖుల శుభాకాంక్షలు

న్యూఢిల్లీ : జస్టిస్ సంజీవ్‌ఖన్నా సోమవారం 51వ భారత ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)గా ప్రమాణస్వీకారం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఇతర ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంజీవ్ ఖన్నాను సిజెఐగా ప్రమాణం చేయించారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడుతున్న సమయంలో సంజీవ్‌ఖన్నా ఆంగ్ల భాష లో దేవుడి పేరిట ప్రమాణం చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 14, 1960న జన్మించారు. అయితే ఆయన ప్రధాన న్యాయమూర్తిగా స్వల్ప కాలం అంటే ఆరునెలలు మాత్రమే తన పదవి లో కొనసాగుతారు. మే 13, 2025న ఆయన వయస్సు 65సంవత్సరాలకు చేరుకుంటుంది. సంజీవ్ ఖన్నా బాధ్యతల స్వీకరణకు ముందు భారత ప్రధాన న్యాయమూర్తిగా తరువాయి 2లో

ఎస్‌సి వర్గీకరణపై నేటి నుంచి అభిప్రాయ సేకరణ

బిఆర్‌కె భవన్‌లో కమిషన్ కార్యాలయం

ప్రజాపక్షం/హైదరాబాద్

షెడ్యూల్ ఉపకులాలను ఎబిసిడి వర్గీకరణ అంశానికి సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధ్యయన కమిషన్‌కు హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో కార్యాలయం కేటాయించారు. గత నెల 11 వతేదీన రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.. సరిగ్గా నెల రోజుల తర్వాత కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ అధ్యయనంలో భాగంగా మంగళవారం నుంచి కమిషన్ కార్యాలయంలో ఎస్‌సి ఉపకులాల వర్గీకరణకు సంబంధించి షెడ్యూల్ కులాల సంఘాలు, వ్యక్తుల నుంచి వినతులను, అభిప్రాయాలను అభ్యర్థనలను స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించి పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు కమిషన్ కార్యాలయానికి వచ్చి వారి వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చని, ఇందుకు సంబంధించిన పత్రాలను జూనియర్ అసిస్టెంట్ సయ్యద్ అబ్దుల్ రఫేకు అందజేయవచ్చని అధ్యయన కమిషన్ అదనపు సంచాలకులు సి. శ్రీధర్ తెలిపారు. అదే

విధంగా వినతులను, అభ్యర్థనలను' oneman commission.scsc@gmail. com'ని మెయిల్ ద్వారా పంపించవచ్చని వెల్లడించారు.

రణరంగంగా లగచర్ల

ఫార్మా కంపెనీకి భూసేకరణపై ప్రజాభిప్రాయ కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత

- వికారాబాద్ కలెక్టర్‌తో సహా అధికారులపై రాళ్ళు, కర్రలతో దాడి
- 'కలెక్టర్ గోబ్యాక్' అంటూ నినాదాలు
- ఫార్మాకంపెనీకి వ్యతిరేకం అని చెప్పినా గ్రామంలోకి రావడమేమిటని రైతులు నిలదీత

ప్రజాపక్షం/కొడంగల్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం, వికారాబాద్ జిల్లా, కొడంగల్‌లోని దుద్యాల మండలం, లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ఉద్దేశించి అధికారులు చేపట్టిన భూసేకరణ ప్రజాభిపాయ కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత, రణరంగంగా మారింది. భూ సేకరణ ప్రజాభిప్రాయ కార్యక్రమానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో సహా పలువురు అధికారులను రైతులు పరుగెత్తించారు. రాళ్ళు, కర్రలతో దాడికి తెగబడ్డారు. ఒక దశలో విచక్షణ కోల్పోయిన రైతులు అధికారులపై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అధికారుల వాహనాలను రాళ్ళు, కర్రలతో ధ్వంసం చేశారు. తామంతా ఫార్మా కంపెనీల నిర్మాణాలకు వ్యతిరేకమని గత కొంత కాలంగా గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా అధికారులు భూసేకరణ పేరుతో గ్రామంలోకి రావడం ఏమిటని వారు అధికారులపై తిరగబడ్డారు. రైతుల మూకుమ్మడి దాడితో అధికారులు ఖంగుతిన్నారు. బతుకుజీవుడా అంటూ అక్కడి నుండి తమ వాహనాలలో తరువాయి 2లో

జార్ఖండ్‌లో తొలివిడత ప్రచారం బంద్

రేపు 43 నియోజకవర్గాల్లో పోలింగ్

రాంచీ : జార్ఖండ్ శాసనసభ ఎన్నికల్లో మొదటి విడత పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే అభ్యర్థులు నిర్వహించిన ప్రచార కార్యక్రమం సోమవారం సాయంత్రానికి ముగిసింది. మంగళవారంనాడు ఎన్నికల ప్రచారానికి పూర్తి విరామం. తొలివిడత పోలింగ్ బుధవారంనాడు జరుగుతుంది. జార్ఖండ్ అసెంబ్లీలో మొత్తం 81 నియోజకవర్గాలు ఉండగా, తొలివిడతగా 43 నియోజకవర్గాలలో పోలింగ్ ఈనెల 13న జరుగుతుంది. తొలి విడత ఎన్నికల్లో 1.37 ఓట్లమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. మొత్తం 683 మంది అభ్యర్థులు తొలివిడత పోటీలో ఉన్నారు. వీరిలో 73 మంది మహిళా అభ్యర్థులు కాగా, 609 మంది పురుషులు ఉన్నారని ఎన్నికల ప్రధాన అధికారి కె.రవికుమార్ చెప్పారు. ఆదివాసీ ఓటర్లే ప్రధాన నిర్ణేతలు. గడచిన ఎన్నికల్లో బిజెపి ఆదివాసీ ఓటర్లను కోల్పోయి తీవ్రంగా నష్టపడింది. 'ఇండి యా' కూటమి పార్టీలు, ఎన్‌డిఎ కూటమి పార్టీలమధ్య హోరాహోరీగా ప్రచార పోరాటం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ జాతీయ తరువాయి 2లో

ఫార్ములా ఇ – కార్ రేసింగ్‌పై విచారణకు గవర్నర్ అనుమతి కోరాం

- చట్ట ప్రకారమే ఇ – కార్ రేసింగ్‌పై ముందుకు
- తనపై వస్తున్న కేసుల నుంచి తప్పించుకోవడానికే కెటిఆర్ ఢిల్లీ టూర్
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఇ – కార్ రేసింగ్‌లో జరిగిన అక్రమాలకు సంబంధించి విచారణ కోసం గవర్నర్ అనుమతి కోరామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గవర్నర్ నుంచి అనుమతి రాగానే విచారణ జరుగుతుందన్నారు. విచారణలో చట్టం ప్రకారం ముందుకు వెళ్లుతున్నామని అన్నారు. తాము ప్రత్యేకంగా ఎవరినీ జైల్లో పెడతామని చెప్పలేదని స్పష్టం చేశారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఇ – కార్ రేసింగ్ వ్యవహారంలో కెటిఆర్ మీద ఆరోపణలు వస్తున్నాయన్నారు. స్వయంగా కెటిఆరే కార్ రేసింగ్‌కు డబ్బులు ఇచ్చామని చెప్తున్నారని అన్నారు. ఢిల్లీకి తరువాయి 2లో

ఢిల్లీ పర్యటన గుట్టు విప్పాలి

కేంద్ర మంత్రితో కెటిఆర్‌కు ఏం పని?

ఎంఎల్ఎలను కాపాడుకునేందుకే అధికార ప్రస్తావన: మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/ ఖమ్మం

బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కెటి.రామారావు ఢిల్లీ పర్యటన గుట్టు విప్పాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో దేని కోసం ఎవరెవరిని కలిశారో తెలియజేయాలన్నారు. సోమవారం పాలేరు నియోజక వర్గం చిన్న వెంకటగిరిలో జరిగిన తరువాయి 2లో

దేశానికి హిందూ, ముస్లింలే బలం



- మోదీ మరింత బలపడితే రాజ్యాంగాన్ని మార్చేస్తారు
- దేశంలో మోదీ, గాంధీ రెండు కుటుంబాలే ఉన్నాయి
- మోదీని ఓడించడం రాహుల్ గాంధీకే సాధ్యం
- మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

మోదీ మరింత బలపడితే రాజ్యాంగాన్ని మారుస్తారని, దేశాన్ని రెండు ముక్కలు చేసి, హిందూ, ముస్లింల మధ్య విభజన గోడను నిర్మిస్తారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో మోదీ, గాంధీ రెండు కుటుంబాలే ఉన్నాయని, ఇందులో మైనారిటీలు ఎవరికి మద్దతుగా నిలుస్తారో నిర్ణయించుకోవాలని సిఎం సూచించారు. గాంధీ కుటుంబానికి మద్దతుగా నిలిస్తే అన్ని వర్గాలనూ కలుపుకుని ముందుకెళ్తారని, తద్వారా మైనారిటీలకు రిజర్వేషన్ దక్కడంతో పాటు ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉంటుందని సిఎం భరోసానిచ్చారు. దేశంలో ప్రధాని మోదీని ఓడించడం రాహుల్ గాంధీతోనే సాధ్యమని, ఆ శక్తి రాహుల్‌కే ఉన్నదని, అందుకే రాహుల్‌ను ప్రధానిని చేసే వరకు విశ్రమించొద్దన్నారు. దేశాన్ని విభజించి హిందూ, ముస్లింల మధ్య విభజన గోడను నిర్మించేందుకు, తద్వారా అధికారంలోకి వచ్చేందుకు మోదీ పరివార్ 70 ఏళ్ల నుంచి తీవ్రంగా ప్రయత్నిస్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశానికి హిందూ, ముస్లింలే బలమని, ఆ బలాన్ని విడదీసేందుకు ప్రయత్నిస్తున్న మోదీ కుటుంబాన్ని మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో ఓడించాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరారు. ''జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవ వేడుకలను'' హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్ధుల్ కలాం

'అమృత్ టెండర్ల' అవినీతిపై విచారణ చేపట్టండి

- సిఎం రేవంత్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోండి
- కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు కెటిఆర్ వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్

'అమృత్ టెండర్ల'లో జరిగిన అవినీతిపైన పారదర్శకంగా విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడిన సిఎం రేవంత్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. టెండర్లలో అక్రమాలు జరిగితే ఆ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే నిబంధనను ఉల్లంఘించి,తన తరువాయి 2లో



రైతులను ఇబ్బందిపెట్టే వారిపై అవసరమైతే 'ఎస్మా'

సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ప్రజాపక్షం / హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇబ్బందులకు గురిచేసే వ్యాపారులపై అవసరమైతే ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్ (ఎస్మా) కింద చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ రైతులను ఇబ్బందులకు తరువాయి 2లో

కాలుష్యాన్ని... ఏ మతమూ ప్రోత్సహించదు

బాణసంచా కాల్చడంపై 'ఏడాది నిషేధం'

ఢిల్లీ ప్రభుత్వానికి 'సుప్రీం' ఆదేశం

15 రోజుల్లో నిషేధం అమలులోకి రావాలని గడువు

న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీలో బాణసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు ఏడాది అంతా నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈ విషయమై 15 రోజులలో నిర్ణయం అమలులోకి రావాల్సిందేనని సోమవారం సుప్రీంకోర్టు ఢిల్లీ ప్రభుత్వానికి గడువు నిర్దేశించింది. కాలుష్యం సృష్టించే కార్యక్రమాలు చేపట్టాలని ఏ మతం కూడా చెప్పదని స్పష్టం చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కాలుష్యరహిత వాతావారణంలో జీవించే హక్కు ప్రతీ పౌరుడి ప్రాథమిక హక్కు అని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఈ హక్కును పరిరక్షిస్తోందని ధర్మాసనం తెలియజేసింది. ప్రాథమికంగా నిర్ధారించుకున్న ప్రకారం ఏ మతం కూడా కాలుష్యం తరువాయి 12లో

ఫోన్ టాపింగ్ కేసులో... విచారణకు చిరుమర్తి గైర్హాజరు

ప్రజా పక్షం/ హైదరాబాద్

సంచలనం సృష్టించిన ఫోన్ టాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ లింగయ్యకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఆయన సోమవారం విచారణకు గైర్హాజరయ్యారు. ఈ నెల 14న విచారణకు హాజరవుతానని పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే ఫోన్ టాపింగ్ కేసులో నలుగురు పోలీసు అధికారులను అరెస్టు చేసిన పోలీసులు, అమెరికాలో ఉన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావును విచారించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన అమెరికా నుంచి రాకపోవడంతో ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు నిలిచిపోయింది. అయితే ఈ కేసులో అరెస్టు అయిన అదనపు ఎస్‌పి తిరుపతన్నకు చెందిన ఫోన్ కాల్ డాటాలో బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ లింగయ్యకు సంబంధాలు ఉన్నాయని తాజాగా ఫోరెన్సిక్ రిపోర్ట్‌లో తేలింది. దీని ఆధారంగానే దర్యాప్తు అధికారులు లింగయ్యకు రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు అందుకున్న లింగయ్య సోమవారం విచారణకు హాజరవుతానని తరువాయి 12లో

బిసి సంక్షేమ శాఖ కార్యదర్శిగా శ్రీధర్

రాష్ట్రంలో 13 మంది ఐఎఎస్‌లు బదిలీ

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో మరోసారి ఐఎఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 13 మంది ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పర్యాటకం, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శిగా స్మితా సబర్వాల్ నియమితులయ్యారు. మరోవైపు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శిగా స్మితా సబర్వాల్ అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. బిసి సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఇ.శ్రీధర్, దేవాదాయ శాఖ కమిషనర్‌గా శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మహిళా, శిశు సంక్షేమం, ఎస్‌సి అభివృద్ధి శాఖ కార్యదర్శిగా అనితా రామచంద్రన్, జిహెచ్ ఎంసి కమిషనర్‌గా ఇలంబర్తి, రవాణా తరువాయి 12లో

ట్రిపుల్ ఐటి వర్సిటీలో మరో విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాపక్షం/ముధోల్(బాసర)

బాసర ట్రిపుల్ ఐటిలో పియుసి2 చదువుతున్న విద్యార్థిని స్వాతి సోమవారం ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు యాజమాన్యానికి తెలియజేశారు. ముందుగా విద్యార్థిని మృతదేహాన్ని ట్రిపుల్ ఐటి ఆసుపత్రికి తరలించారు. అనంతరం అంబులెన్స్ ద్వారా పోస్టుమార్టం నిమిత్తం బైంసా ఏరియా ఆసుపత్రికి విద్యార్థిని మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని విద్యార్థిని కుటుంబ సభ్యులకు తెలియజేసారు. వ్యక్తిగత కారణాలతోనే విద్యార్థి ఆత్మహ త్య చేసుకున్నట్లు రాసివున్న సూసైడ్ నోట్‌ను ఘటన స్థలంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తరువాయి 12లో

ఉక్రేన్ యుద్ధంపై ట్రంప్–పుతిన్ ఫోన్ సంభాషణ కట్టుకథ : రష్యా ఖండన

వాషింగ్టన్ : రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇద్దరూ ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారంపై ఫోన్ సంభాషణ చేశారని 'వాషింగ్టన్ పోస్ట్' ప్రచురించిన కథనాన్ని రష్యా తీవ్రంగా ఖండించింది. రష్యా అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి దీమీత్రి పెస్కోవ్ సోమవారంనాడు మీడియాతో మాట్లాడుతూ, 'వాషింగ్టన్ పోస్ట్'తప్పుడు కథనం ప్రచురించిందనీ, నాయకులు ఇద్దరిమధ్యా అలాంటి ఫోన్ సంభాషణ ఏదీ జరగలేదని అన్నారు. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన రెండో రోజునే పుతిన్‌తో ఫ్లోరిడాలోని తన రిజార్టు నుండి ఫోన్ సంభాషణ చేశారన్న వార్తల్లో అర్థంలేదన్నారు. ఉక్రేన్‌లో యుద్ధాన్ని విస్తరించవద్దని, యూరప్‌లో అమెరికాకు తగినంత సైన్యం ఉందని పుతిన్‌కు ట్రంప్ చెప్పినట్లు ఈ కథనం పేర్కొంది. గెలిచిన తర్వాత ట్రంప్ సుమారు 70 మంది ప్రపంచ నాయకులతో ఫోన్ సంభాషణలు జరిపారు. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ తదితరులు వీరిలో ప్రముఖులుగా ఉన్నారు. ''ట్రంప్–పుతిన్ ఇద్దరూ యూరప్ ఖండంలో శాంతి లక్ష్యంగా ఫోన్ సంభాషణ జరిపారు, ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారానికి తదుపరి చర్చలు కొనసాగించాలని ట్రంప్ ఎంతో ఆసక్తి చూపించారు'' అని వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. నిర్ణీత ప్రకారం ట్రంప్ 2025 జనవరి 20న దేశాధ్యక్షుడుగా పదవీ ప్రమాణం చేయనున్నారు. ''పాశ్చాత్యమీడియా కథనం పూర్తిగా అవాస్తవం, అదంతా కట్టుకథ'' అని ప్రభుత్వ వార్తాసంస్థ 'టాస్'తో పెస్కోవ్ చెప్పారు. అదేసమయంలో ట్రంప్ కమ్యూనికేషన్ల విభాగం డైరెక్టర్ స్టీవెన్ ఛెయుంగ్ పిటిఐ వారాసంస్థతో మాట్లాడుతూ, అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్ చేస్తున్న ప్రైవేటు ఫోన్ కాల్స్ గురించి తాను వ్యాఖ్యానించబోనన్నారు.

వాతావరణ మార్పుల పరిష్కారానికి తక్షణ నిధులు

'బాకు'లో కాప్–29 సదస్సు చర్చలు షురూ

బాకు : అజర్‌బైజాన్ నగరం బాకులో సోమవారంనాడు ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు కాప్ –29 చర్చలు ప్రారంభమయ్యాయి. 2024వ సంవత్సరం అత్యంత దారుణమైన ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా ఈ సదస్సులో ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. వాతావరణ సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపు అత్యవసరమైన విషయమని వక్తలు డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో ఈ చర్చలకు మరింత ప్రాధాన్యం పెరిగింది. ట్రంప్ అధ్యక్షుడయ్యాక పారిస్ ఒప్పందం నుండి అమెరికా అనివార్యంగా వైదొలగుతుందన్న ఉద్దేశాలమధ్య ఈ సదస్సుపై పెద్దగా అంచనాలు కూడా లేవు. ఈ ఏడాది వాతావరణ మార్పులు తీవ్రంగా ఉండటం, ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో పెరగడం వంటి పరిణామాల మధ్య కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్)కు చెందిన వివిధ

దేశాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొనేందుకు బాకు నగరానికి చేరుకున్నారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మంగళవారంనాడు ఈ సదస్సులో పాల్గొంటారు. నవంబరు 11 వ తేదీ నుండి 22వ తేదీ వరకూ 10 రోజులపాటు ఈ సదస్సులు జరుగుతాయి. పునర్వినియోగ ఇంధనానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులను అజర్‌బైజాన్ దేశంలో చురుగ్గా అమలు చేస్తున్నారు. ''ఇన్వెస్ట్ టు డే టూ సేవ్ టుమారో'' అనే ఉద్దేశంతో ఈ సదస్సు జరుగుతోంది. కాప్–29 సదస్సు అధ్యక్షుడు ముఖ్తార్ బాబాయేవ్ తొలిపలుకులు మాట్లాడారు. ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలవల్ల ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీలసెల్సియస్‌కు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల సమస్య పరిష్కారానికి నిధుల సేకరణే తక్షణ లక్ష్యమన్నారు. 2009లో నిర్దేశించిన ఏటా 100 బిలియన్ డాలర్లు సమకూర్చే లక్ష్యాలలో మార్పులు తేవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వాతావరణ మార్పుల ప్రమాదం నుండి బయట పడేందుకు పెట్టుబడులుగాఅభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు అనేక ట్రిలియన్ డాలర్లు అవసరం అవుతాయి. గ్లోబల్ సౌత్ సంప్రదింపుల సందర్భంగా ఏటా ఒక ట్రిలియన్ డాలర్లు అవసరమని ఎల్ఎండిసి పేర్కొంది. అదేవిధంగా అరబ్ గ్రూపు 1.1 ట్రిలియన్ డాలర్లు, ఆఫ్రికన్ గ్రూపు 1.3 ట్రిలియన్లు, భారత్ ఒక ట్రిలియన్ డాలర్లు, పాకిస్థాన్ రెండు ట్రిలియన్ డాలర్లు అవసరమని అంచనావేశాయి. యూనిసెఫ్ స్థాయి సంఘం నివేదిక ప్రకారం, అభివృద్ధి చెందిన దేశాలకు 2030 నాటికి 5.01 ట్రిలియన్ డాలర్ల నుండి 6.85 ట్రిలియన్ డాలర్లు అవసరం అవుతాయని పేర్కొంది. ఐతే ఇది పూర్తి అంచనా కాదు. మొత్తం 142 దేశాలకుగాను 98దేశాలుసమర్పించిన నివేదిక ప్రకారం ఆ అంచనాలు వేశారు. సంప్రదింపులు పురోగతి సాధించాయనీ, కానీ ఇంకా చాలా పనులు మిగిలి ఉండిపోయాయన్నారు. ప్రత్యేక దూత రాల్ఫ్ రెజెన్‌వను మాట్లాడుతూఎట్టిపరిస్థితుల్లోనూవాతావరణ సంరక్షణ లక్ష్యాల నుండి వెనక్కు తగ్గేదిలేదన్నారు.

ఛాడ్‌లో కాల్పులు

17 మంది సైనికులు, 96 మంది తిరుగుబాటుదారులు మృతి

ఎన్‌జెమెనా(ఛాడ్) : పశ్చిమ ఆఫ్రికాదేశం ఛాడ్‌లో 17 మంది సైనికులు, మరో 96 మంది తిరుగుబాటుదారులు మరణించారు. లిబియా, సూడాన్,కామెరూన్, నైజీరియా దేశాలమధ్య ఉన్న ఛాడ్ రిపబ్లిక్‌లో గడచిన శనివారంనాడు జరిగిన కాల్పుల్లో ఈ మరణాలు సంభవించాయని సైనిక అధికార ప్రతినిధి జనరల్ ఇషాక్ అచైఖ్ చెప్పారు. ఐతే ఇతర వివరాలు ఆయన ఇవ్వలేదు. మృతుల్లో బోకో హారమ్ తిరుగుబాటుదారులు కూడా ఉన్నారు. లేక్ ఛాడ్ ప్రాంతంలో ఈ కాల్పులు జరిగాయి. ఇస్లామిక్ స్టేట్‌కు బోకో హారమ్ తిరుగుబాటుదారులకు మధ్య ఏడాదికాలంగా కాల్పుల యుద్ధం జరుగుతోంది. ఒక సైనికస్థావరంపై గతనెలలో జరిగిన దాడుల్లో 40 మంది సైనికులు మరణించారు. దీంతో బోకోహారమ్ తిరుగుబాటుదారులను ఏరివేసేందుకు దేశాధ్యక్షుడు మహమత్ దెబై ఇట్నో గాలింపు చర్యలకు ఆదేశించారు. అప్పటినుండీ ఈ దాడులు, కాల్పుల యుద్ధం తీవ్రరూపం దాల్చింది.

ప్రచారం బంద్

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, తదితరులు ఎన్నికల ప్రచారం చేశారు.ఈ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి తరపున సిపిఐ 15 స్థానాల్లో పోటీ చేస్తున్నది. మొదటి విడత పోలింగ్‌కు వెళ్ళే నియోజకవర్గాలలో సరైకెలా కూడా ఉంది. ఈ నియోజకవర్గంలో మా జీ ముఖ్యమంత్రి చంపా సోరెన్ బిజెపి తరపున పోటీ చేస్తున్నారు. ఆయన పార్టీ ఫిరాయించాక బిజెపి తరపున ఎన్నికలబరిలోకి దిగడం ఇదే మొదటిసారి. జమ్‌షెడ్‌పూర్ వెస్ట్ నియోజకవర్గం లో జెడి(యు) అభ్యర్థి సార్యూ రాయ్ పోటీలో ఉన్నారు. జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి, ఒడిశా గవర్నర్ రఘుబార్‌దాస్ కోడలు పూర్ణిమా దాస్ సాహూ పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఐదుసార్లు శాసనసభ్యుడుగా పనిచేసిన సి.పి.సింగ్ ఝార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీ నియోజకవర్గం నుండి ఆరోసారి పోటీ చేస్తున్నారు. అధికార జెఎంఎం రాజ్యసభ సభ్యురాలు మహుయా మాజీ కూడా రాంచీ నుండి ఎన్నికల బరిలోకి దిగారు. బంగ్లాదేశీయుల చొరబాట్ల సమస్యతోపాటు అవినీతి, జెఎంఎం –బిజెపి మధ్య నెలవారీ నగదుబదిలీ పథకాలకు సంబంధించిన వివాదాలు ఎన్నికల ప్రచారంలో ప్రముఖంగా చోటుచేసుకున్నాయి.

రాష్ట్రంలో మొత్తం 2.59 కోట్లమంది ఓటర్లు ఉన్నారు.29,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఝార్ఖండ్ ముక్తిమోర్చా, కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, సిపిఐ (మార్క్సిస్ట్–లెనినిస్ట్) లిబరేషన్ పార్టీలు ఒకవైపు, బిజెపి, ఆసు (అఖిల ఝార్ఖండ్ విద్యార్థి సంఘం), లోక్‌జనశక్తిపార్టీ (రామ్‌విలాస్) మరోవైపు రెండు కూటముల అభ్యర్థులూ ఝార్ఖండ్ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. కాగా మొదటి విడత పోలింగ్ నిమిత్తం 15,344 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో 12,716 పోలింగ్ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. మరో 2,628 పోలింగ్ కేంద్రాలను పట్టణ ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. దివ్యాంగులకోసం ప్రత్యేకంగా 24 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 1,152 పోలింగ్ కేంద్రాలను పూర్తిగా మహిళలే నిర్వహిస్తున్నారు. బుధవారంనాడు ఉదయం ఏడు గంటల నుండీ సాయంత్రం ఐదు గంటలవరకూ పోలింగ్ జరుగుతుంది. ఐతే 950 కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియ నాలుగు గంటలకే పూర్తిచేస్తారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకూ జరిపిన దాడుల్లో రూ.179.14 కోట్లు విలువైన అక్రమ సామాగ్రి, నగదు స్వాధీనం చేసుకున్నారు. నియమావళి ఉల్లంఘించినవారిపై మొత్తం 54 కేసులు పెట్టారు.

సంజీవ్‌ఖన్నా 'ప్రమాణస్వీకారం'

(మొదటి పేజీ తరువాయి)

పదవీ బాధ్యత లు నిర్వర్తించిన డివై.చంద్రచూడ్ పదవీకాలం నవంబరు 10తో ముగిసింది. జస్టిస్ సంజీవ్‌ఖన్నా ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరయ్యారు. అనంతరం ఆయన తన 'ఎక్స్' పోస్ట్‌లో సిజెఐ సంజీవ్‌ఖన్నా పదవీకాలానికి తన 'బెస్ట్ విషెస్' తెలియజేశారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూడా భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాకు తన శుభాకాంక్షలు తెలిపారు. నూతన సిజెఐగా సంజీవ్‌ఖన్నా భుజస్కంధాలపై గొప్ప భారమే మోపినప్పటికీ ఆయన దానిని సమర్థవంతంగా నిర్వహించగలరనే విస్తృత పరిశీలనలు, అంచనాలు ఆయనపై ఉన్నాయని మల్లికార్జున్ ఖర్గే తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'సంజీవ్‌ఖన్నాకు ఉన్నటువంటి సుదీర్ఘ అనుభవం, విశిష్ట అనుభవంతో విశిష్ట న్యాయవ్యవస్థ బాధ్యతల బరువును అవలీలగా మోయగలిగే సామర్థ్యం కలిగి ఉన్నారు' అనే అభిప్రాయాన్ని ఖర్గే వ్యక్తీకరించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి డివై.చంద్రచూడ్, వైస్ ప్రసిడెంట్ జగ్‌దీప్ ధన్‌ఖర్, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, మాజీ సిజెఐ జెఎస్.ఖేహర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిజెఐ సంజీవ్‌ఖన్నా హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ సహా ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు అందరిని ఉద్దేశించి 'కృతజ్ఞతలు' తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది మరియు మాజీ అటార్నీజనరల్ ముకుల్ రోహత్గీ మాట్లాడుతూ 'సిజెఐగా మీరు మీ పదవీకాలాన్ని విజయవంతంగా నిర్వర్తించాలి' అని శుభాకాంక్షలు తెలియజేశారు.

అనుమతి కోరాం

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లి అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేస్తానని కెటిఆర్ చెబుతున్నారని, కానీ కార్ రేసీకు సంబంధించిన విచారణకు గవర్నర్ అనుమతిని తాము కోరడంతోనే ఆయన ఢిల్లీకి వెళుతున్నారన్నారు. కార్ రేసింగ్ అక్రమాల నుండి తప్పించుకునేందుకు అమృత్ పథకంలో అక్రమాలంటూ కెటిఆర్ ఢిల్లీ వెళ్తున్నారన్నారు. కెటిఆర్ విచారణకు సహకరించి, చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఇప్పటికైనా కెటిఆర్ తప్పు ఒప్పుకుంటే మంచిందన్నారు. కార్ రేసింగ్ కేసు నుండి బయటపడేందుకు ఢిల్లీలో బిజెపితో దోస్తీ చేసేందుకు వెళ్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తనను తాను రక్షించుకునేందుకు కేంద్రం వద్ద మోకరిల్లేందుకు వెళ్తూ ప్రజల దృష్టిని మరల్చుతున్నారని విమర్శించారు. అమృత్ పథకంలో అవినీతి జరిగితే కేంద్రానికి ఫిర్యాదు చేయవచ్చుని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ కార్ రేసింగ్ అంశంలో తనమీద జరిగే విచారణను నిలిపేసేందుకు వెళ్తున్నట్లు తెలుస్తోందని మంత్రి అనుమానం వ్యక్తం చేశారు.

ఈపుల 14 నుంచి ఏడాది పాలన విజయోత్సవాలు..

ఈనెల 14 నుంచి ఏడాది పాలన విజయోత్సవాలు జరుపుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రతి మంచి పనిని ప్రజలకు వివరిస్తామన్నారు. రవాణాశాఖకు మరింత గౌరవం పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తర్వలోనే తెలంగాణ రవాణాశాఖ లోగోను విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు. రవాణాశాఖకు యూనిఫాం తరహాలో ఒకేరకమైన వాహనాలను సమకురుస్తామని తెలిపారు.

ప్రజా తీర్పులో ఓడి పార్లమెంటులో గెలిచి.. మళ్లీ జపాన్ ప్రధానిగా ఇషిబా

టోక్యో : ఎన్నికల్లో ఓడిపోయిన జపాన్ ప్రధాన మంత్రి షిగెరూ ఇషిబా (67) అత్యంత శక్తిమంతమైన పార్లమెంటు దిగువసభలో సోమవారంనాడు జరిగిన రనాఫ్ ఓటింగ్‌లో మళ్ళీ విజయం సాధించారు. ప్రధానమంత్రి పదవిని తిరిగి సొంతం చేసుకున్నారు. పార్లమెంటు రనాఫ్ ఓటింగ్‌లో ఇషిబాకు 221 ఓట్లు రాగా, ఆయనపై పోటీ పడిన సిడిపి (కాన్స్టిట్యూషనల్ డెమోక్రటిక్‌పార్టీ)కి చెందిన ప్రతిపక్ష నాయకుడు యోషిహికో నోడాకు 160 ఓట్లు లభించాయి. 84 మంది వివిధ కీలక సమస్యలపై విభేదించిన ప్రతిపక్షాలు ఐక్యంగా లేకపోవడం ఇషిబాకు కలిసి వచ్చింది. ఇషిబా తన పాతమంత్రివర్గంలో ఉన్న ఎక్కువమంది సభ్యులనే తిరిగి కొత్త మంత్రివర్గంలో నియమించారు. త్వరలో డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశానికి ఆయన ఏర్పాట్లు చేసుకున్నారు. ఇషిబాకు ముందు ప్రధానమంత్రిగా పనిచేసిన ఫుమియో కిషిదా తీవ్ర అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయి పదవికి రాజీనామా చేశారు. రక్షణమంత్రిగా ఉన్న ఇషిబా ఆరు వారాల క్రితం ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రజాభిప్రాయం అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశంతో అక్టోబరు 27వ తేదీన పార్లమెంటుకు ఆకస్మికంగా ఎన్నికలు జరిపారు. ఈ ఎన్నికల్లో ఇషిబాతోపాటు ఆయన జూనియర్ భాగస్వామి కొమైటో కూడా ఓటమిపాలయ్యారు. వీరిద్దరూ అధికార లిబరేషన్ డెమోక్రటిక్ పార్టీకి చెందినవారే.గడచిన 15 సంవత్సరాలలో ఎన్నడూలేని స్థాయిలో అధికార కన్జర్వేటివ్ లిబరేషన్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) ఘోర పరాజయం పొందింది. జపాన్ దిగువసభలో మొత్తం 465 స్థానాలు ఉన్నాయ. ఈ పార్లమెంటుకు గలనెలా ఖరున ఎన్నికలు జరిగాయి. ఆర్థిక అక్రమాలు జరిగాయన్న ఆగ్రహంతో ఓటర్లు ఆయనను ఓడించారు. 30 రోజుల్లో కొత్త ప్రధానమంత్రిని ఎన్నుకోవాలన్న నిబంధన మేరకు పార్లమెంటు నాలుగురోజులపాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించింది. సోమవారంనాడు ఇషిబాను తిరిగి ప్రధానిగా ఎన్నుకున్నారు. రాబోయే రోజుల్లో ఇషిబా మరిన్ని సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. బడ్జెట్‌తో సహా అనేక కీలక అంశాలను ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ ఫర్ పీపుల్స్ (డిపిపి) ఆమోదించాల్సి ఉంది.

అయోధ్య సహా హిందూ ఆలయాలపై దాడులు చేస్తాం : పన్నన్ వీడియో

బ్రాంప్టన్ : అయోధ్యలో రామాలయంతోపాటు హిందూ ఆలయాలపై దాడులు చేస్తామని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్‌సింగ్ పన్నన్ తాజాగా మరో హెచ్చరిక చేశారు. ఇటీవల విమానాలకు హెచ్చరిక చేసిన పన్నన్ తాజాగా అయోధ్య రామాలయం పునాదులు కదిలించేస్తామని హెచ్చరించారు. ఈనెల 16,17 తేదీలలో తాము దాడులు చేస్తామని ఆయన తేదీలు ప్రకటించారు. ఈ మేరకు ఒక వీడియో విడుదల చేశారు. ఈ వీడియోను బ్రాంప్టన్‌లో తయారు చేసినట్లుగా తెలుస్తున్నది. అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రార్థనలు చేస్తున్న దృశ్యాలను కూడా పన్నన్ ఈ వీడియోలో జత కలిపి విడుదల చేశాడు. ఈనెల 19న ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో ఎవరూ ప్రయాణించవద్దని ఇంతకుముందు పన్నన్ ఒక హెచ్చరిక చేశాడు. ఈ మేరకు ఇండియా కంపెనీలకు చెందిన 100 విమానాలకు బెదిరింపు ఫోన్లు వెళ్ళాయి. దీనివల్ల విమానాలను రద్దుచేయడంతో ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. 1984లో నవంబరు 19వ తేదీన ఢిల్లీలో సిక్కులకు వ్యతిరేకంగా అల్లర్లు జరిగాయి. ఈ ఘటన జరిగిన 40 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా దాడులు చేస్తామని పన్నన్ తొలుత హెచ్చరిక చేశాడు. తర్వాత తాజాగా ఈ హెచ్చరిక వీడియో విడుదల చేశాడు. ఉపా చట్టం కింద 2020 జులైలో భారత ప్రభుత్వం పన్నన్‌ను ఉగ్రవాదిగా ప్రకటించింది. ఖలిస్థాన్ వేర్పాటువాదాన్ని రెచ్చగొడుతున్నాడని పేర్కొంది.

హిందూ, ముస్లింలే బలం

(మొదటి పేజీ తరువాయి)

ఆజాద్ జయంతి సందర్భం గా ఆయన చిత్రపటానికి సిఎం రేవంత్‌రెడ్డి నివాళు లు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షే మ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, మాజీ ఎంపి వి.హ నుమంతరావు, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, ఎం ఎల్‌సి అమీర్ అలీ ఖాన్, టిజిఎంఆర్ఇఐఎస్ అధ్యక్షుడు ఫహీముద్దీన్ ఖురేషి, తెలంగాణ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ అహ్మద్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అనే క మంది ఐఎఎస్, ఐపిఎస్, ఉన్నతాధికారులయ్యేందుకు ఉపయోగడిన విద్యా పాలసీని మౌలా నా అబుల్ కలాం రూపొందించారని సిఎం కొనియాడారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా కాంగ్రెస్ పార్టీకి ఒరిగేదేమీ లేదని, 70 ఏళ్ల కాలం లో కాంగ్రెస్ అనేక పదవులను అనుభవించిందని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం అవసరమని, లేదంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే ప్రమాదం పొంచి ఉన్నదని సిం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'నఫ్రత్ బజార్‌లో మొహబ్బత్ దుకాణ్'ను తెరిచేందుకు రాహుల్‌గాంధీ ప్రయత్నిస్తున్నారన్నారు.

కాంగ్రెస్‌తో అప్పుడప్పుడు అలుగుతుంటారు

ముస్లిం, మైనారిటీలు కాంగ్రెస్‌తో అప్పుడప్పుడు అలుగుతుంటారని, చిన్న చిన్న విషయాలకే అసంతృప్తితో కాంగ్రెస్ నుంచి దూరమవుతారని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అవసరమైనప్పుడు మైనారిటీలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తారని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి, దేశానికి ఒక సందేశాన్ని పంపించారని సిఎం అన్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన ఒక మైనారిటీ అభ్యర్థిని కూడా గెలిపించుకోకపోవడం తనను అసంతృప్తికి గురిచేసిందని సిఎం పేర్కొన్నారు. మైనారిటీ ఎంఎల్ఎ లేకపోవడంతో తమ మంత్రివర్గంలో ఒక్క మైనారిటీ కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ షబ్బీర్‌అలీకి సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారునిగా, మరో 8 మందిని వివిధ సంస్థలకు చైర్మన్లుగా నియమించి, మైనారిటీలకు చెందాల్సిన వాటాను రంజాన్ బహుమతిగా అందజేశామని సిఎం వివరించారు. రాహుల్, మల్లికార్జున్ ఆదేశాల మేరకు ఒక ఎంఎల్‌సి పదవిని మైనార్టీకి ఇచ్చామన్నారు. 70 ఏళ్ల కాలంలో మొదటిసారి తాము ఒక మైనారిటీని అదనపు అడ్వకేట్ జనరల్‌గా నియమించామని, టిజిపిఎస్‌సి సభ్యునిగా, ఒక విశ్వవిద్యాలయానికి విసిగా నియమించామని సిఎం వివరించారు.

ప్రాంతీయ పార్టీలకు ఓటు వేస్తే నష్టమే

ప్రాంతీయ పార్టీకి చెందిన నాయకులకు వేసే ఓటుతో మైనారిటీలకు నష్టం జరుగుతుందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాంతీయ పార్టీ సర్కస్ చేస్తుంటుందని, ఇక్కడ ఓటు తీసుకుని ఆ ఓటుతో ఢిల్లీలో ఎవరికి మద్దతుగా నిలుస్తున్నారో ఒకసారి గమనించాలని రేవంత్ రెడ్డి సూచించారు. రంజాన్ మాసంలో షేర్వానీ వేసుకుని, కుర్బాణి తిని, ఉర్దూలో రెండు పదాలు చెప్పగానే సెంటిమెంట్‌తో మైనారిటీలు వారి వెంట వెళ్లారన్నారు. మైనారిటీలను వారు ఒక ఓటు వేసే యంత్రాలుగా చూస్తారని, కానీ కాంగ్రెస్ మాత్రం మైనారిటీలను సోదరులుగా భావిస్తుందని, ప్రభుత్వంలో భాగస్వాములను చేస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

భర్తీ కానీ ఎన్‌సి, ఎన్‌టి, బిసి ఉర్దూటీచర్ల పోస్టులను ఓపెన్ కేటగిరీగా మార్చండి

ఉర్దూ టీచర్ పోస్టులలో భర్తీకాని ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్ పోస్టులను ఓపెన్ కేటగిరీగా మార్చి, రెండవ జాబితాను విడుదల చేయాలని 2024 డిఎస్‌సి ఉర్దూ అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు వారు రవీంధ్ర భారతిలో సిఎం పాల్గొన్న కార్యక్రమంలో ప్లకార్డులను ప్రదర్శించారు. కాగా ఉర్దూ టీచర్ పోస్టులకు ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు ఉర్దూ టీచర్ పరీక్ష రాయకపోవడంతో వారికి కేటాయించిన పోస్టులు ఖాళీగానే ఉన్నాయని, దీంతో ఆ పోస్టులను ఓపెన్ కేటగిరి కింద మార్చి, రెండవ జాబితాను విడుదల చేయాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరారు. 2012 , 2017, 2024 మూడు డిఎస్‌సిలలో ఇదే పరిస్థితి నెలకొన్నదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

రణరంగంగా లగచర్ల

(మొదటి పేజీ తరువాయి)

పరుగులు తీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని దుద్యాల మండలం, లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీలను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అందులో భాగంగా హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో 1,354 ఎకరాల్లో ఫార్మా విలేజ్ నిర్మాణానికి భూవివరాలను సేకరించింది. పోలేపల్లిలో 35 మంది రైతులు, హకీంపేట్‌లో 405 మంది రైతులు, లగచర్లలో 564 మంది రైతులు భూమిని కోల్పోతున్నట్లుగా అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా సోమవారం లగచర్ల గ్రామ పరిధిలోని 677 ఎకరాల్లో ఉన్న 564 మంది రైతుల నుండి భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా దుద్యాల, లగచర్ల గ్రామాల మధ్యలో దాదాపుగా 250 మంది పోలీసుల పర్యవేక్షణలో భూసేకరణ కార్యక్రమం నిర్వహించడానికి అధికారులు సిద్ధం చేశారు. కానీ కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్కడికి చేరుకున్నా రైతులు ఎవరూ ఆ ప్రాంతానికి రాలేదు. కొంత సమయం తరువాత గ్రామానికి చెందిన కొందరు అక్కడికి చేరుకొని భూసేకరణ కార్యక్రమాన్ని గ్రామంలో భూములు కోల్పోతున్న రైతుల సమక్షంలో నిర్వహించాలని, ఇక్కడ నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. అధికారులు గ్రామంలోకి రావాలని వారు పేర్కొన్నారు. ఆ మాటలను విన్న కలెక్టర్ వారి మాటలను విశ్వసించి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గ్రామంలోనే నిర్వహిద్దామని అధికారులను తీసుకుని గ్రామంలోకి చేరుకున్నారు. కానీ అధికారులు గ్రామంలోకి చేరుకునేసరికి అక్కడ ఉన్న పలువురు స్థానికులు కలెక్టర్ గోబ్యాక్

ఆర్‌టిసి కార్మికులపై తీవ్ర పనిభారం

మల్లం వెంకటేశ్

వెల్ఫేర్ కమిటీ'లతో కార్మికుల ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు

కార్యరూపం దాల్చని యూనియన్ల పునరుద్ధరణ హామీ

ఆర్‌టిసిలో యూనియన్లను పునరుద్ధరిస్తానని

'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, టిజిఎస్ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న

''ఆర్‌టిసి కార్మికులు పనిభారంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ యూనియన్లపై విధించిన ఆంక్షలను ఆర్‌టిసి యాజమాన్యం ఇంకా కొనసాగిస్తూ కార్మికులను అణచివేస్తోంది. గత ప్రభుత్వం ఆర్‌టిసిలో ఏర్పాటు చేసిన 'వెల్ఫేర్ కమిటీ'లతో కార్మికులు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. ఈ కమిటీలు అధికారుల అడుగులకు మడుగులోత్తుతూ ఊడిగం చేయడానికి మాత్రమే పనిచేస్తున్నాయి. ఆర్‌టిసిలో యూనియన్‌లను పునరుద్ధరిస్తానని స్వయంగా సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి మూడు నెలలు కావస్తున్నప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చకపోవడం విచారకరం. ఇప్పటికైనా యూనియన్‌ల పునరుద్ధరణపై సిఎం వెంటనే ప్రకటన చేయాలి. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీన పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే మాదిరిగా ఉంది. ఆర్‌టిసి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. కొత్త బస్సులు కొనుగోలు చేయాలి. వేతన సవరణ చేపట్టాలి. కార్మిక సంఘాలను పునరుద్ధరించాలి. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపర్చాలి'' అని టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, టిజిఎస్ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న చెప్పారు. ఆర్‌టిసిలో పరిస్థితి, ఉద్యోగుల సమస్యలపై 'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో ఈదురు వెంకన్న పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటి ?

జవాబు : ఆర్‌టిసి ఉద్యోగులు నిత్యం పనిభారంతో చస్తున్నారు. గత పదేళ్ల నుండి 16 వేల మందికి పైగా ఉద్యోగులు పదవీ విరమణ పొందినప్పటికీ, ఆ ఖాళీ ఉద్యోగాలను నేటికీ భర్తీ చేయలేదు. దీనితో ఉన్న ఉద్యోగులపై అధిక పనిభారం మోపుతూ 14 నుంచి 16 గంటల పాటు పనిచేయిస్తున్నారు. సిబ్బందికి సరైన విశ్రాంతి కల్పించకుండా, పనిభారాలు మోపుతుండటంతో వివిధ వ్యాధులతో అనారోగ్యానికి గురై ఏటా వందకుపైగా ఉద్యోగులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారు. కొంతమంది పని ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్‌టిసి ఉద్యోగులకు మెరుగైన జీతభత్యాలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం పిఆర్‌సి ఇచ్చి, ఆర్‌టిసి కార్మికులకు 21 శాతం ఇచ్చి ప్రభుత్వం వివక్ష చూపింది. అలాగే 2017 సంబంధించి అలవెన్స్‌లే నేటికీ కొనసాగుతున్నాయి. 2021 వేతన సవరణ చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం హామీనిచ్చింది. నాలుగేళ్ల గడువు దాటిపోయినా 2021 వేతన సవరణ అమలుచేయకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ప్రశ్న : ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం ప్రక్రియ పరిస్థితి ఏమిటి?

వెంకన్న : గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసిని విలీనం చేయడానికి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించగా, 2023 సెప్టెంబర్ 15న గెజిట్ విడుదలైంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీన ప్రక్రియను పూర్తిచేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ ఆర్‌టిసి విలీనంపై ఎలాంటి పురోగతి లేదు.

ప్రశ్న : కార్మిక సంఘాల స్థానంలో ఏర్పాటు చేసిన వెల్ఫేర్ కమిటీలు ఎలా పని చేస్తున్నాయి?

వెంకన్న : 2019లో 53 రోజుల సమ్మె తరువాత అప్పటి ప్రభుత్వం రెండేళ్ల పాటు గుర్తింపు సంఘం ఎన్నికలు జరపబోమని మాత్రమే చెప్పింది. యూనియన్‌లను రద్దు చేస్తున్నామని ఎక్కడా చెప్పలేదు. ఎలాంటి లిఖితపూర్వక ఉత్తర్వులు జారీ చేయలేదు. అయినా నాలుగేళ్లుగా అవే ఆంక్షలను ఆర్‌టిసి యాజమాన్యం కొనసాగిస్తూ కార్మికులను అణచివేస్తోంది. వెల్ఫేర్ కమిటీలను నియమించాలని పారిశ్రామిక వివాదాల చట్టంలో ఎక్కడా చెప్పలేదు. అయినప్పటికీ ఆర్‌టిసి అధికారులు చట్ట విరుద్ధంగా తమకు నచ్చిన వారిని ఎంపిక చేసుకుని వెల్ఫేర్ కమిటీలను నియమిస్తున్నారు. ఈ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో కార్మికులు ఎదుర్కుంటున్న ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. ఆగస్టు 28న సిపిఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు సమక్షంలో జరిగిన ట్రేడ్ యూనియన్‌ల సమావేశంలో సిఎం స్వయంగా ఆర్‌టిసిలో యూనియన్‌లను పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చి మూడు నెలలు కావస్తున్నప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చకపోవడం పట్ల ఉద్యోగులందరూ నిరాశతో ఉన్నారు. ఇప్పటికైనా సిఎం యూనియన్‌ల పునరుద్ధరణపై వెంటనే ప్రకటన చేయాలి.

ప్రశ్న : కార్మికుల బాండ్ చెల్లింపు, ఆర్‌పిఎస్, పిఎఫ్ తదితర ఆర్థికపరమైన చెల్లింపులు ఎక్కడి వరకు వచ్చాయి?

వెంకన్న: కార్మికులు దాచుకున్న పిఎఫ్ రూ.1350కోట్లు, సిసిఎస్ సొసైటీకి చెందిన రూ.900కోట్లు, ఎస్ఆర్‌బిఎస్, ఎస్‌బిటికి చెందిన సుమారు రూ.550కోట్లు, మొత్తం రూ.2800కోట్లు, రిటైర్ అయిన వారికి సెటిల్‌మెంట్ కింద ఇవ్వాల్సిన రూ.300కోట్లు ఇవ్వాల్సి ఉండగా, యాజమాన్యం, ప్రభుత్వం చెల్లించడంలేదు. దీనితో సిసిఎస్‌లో పిఎఫ్ రుణాలు రాకపోవడంతో చాలీచాలని వేతనాలు సరిపోక ప్రతినెలా ఉద్యోగులు అప్పులు చేసి, కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. భారతదేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా కార్మికులు దాచుకున్న సొమ్ము ద్వారా సంస్థను నడపడం తెలంగాణ ఆర్‌టిసికే చెల్లింది.

ప్రశ్న : గత బిఆర్ఎస్ ప్రభుత్వంతో పోల్చితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసికి, కార్మికులకు ఏమైనా మేలు జరిగిందా ?

వెంకన్న : 2013 బాండ్ డబ్బులు ఇచ్చారు. 2017 వేతన సవరణ మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగింది. ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన ప్రధాన హామీలు మాత్రం నెరవేరలేదు. ప్రభుత్వం మారినప్పటికీ గత ప్రభుత్వ విధానాలు, ఆంక్షలు అలాగే కొనసాగుతున్నాయి. సిసిఎస్ ప్రస్తుత పాలకమండలి పదవీ కాలపరిమితి 2021తో ముగిసింది. మూడేళ్లుగా పాలకమండలి ఎన్నికలు నిర్వహించకుండా పొడిగిస్తున్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలి.

ప్రశ్న : మహాలక్ష్మి పథకం పట్ల ఆర్‌టిసి, కార్మికుల అనుభవాలు ఏమిటి?

వెంకన్న : 'మహాలక్ష్మి పథకం' అమల్లోకి వచ్చి సంవత్సరం కావస్తుంది. ఈ పథకం ప్రవేశపెట్టే ముందు, జరగబోవు స్థితిగతులపై క్షుణంగా అధ్యయనం చేసి, అమలు చేస్తే బాగుండేది. ప్రస్తుతం ఈ పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరగడంతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఏమాత్రం సరిపోవడంలేదు. ఒక్కో బస్సులో 100 నుండి 150 మంది ప్రయాణించడం వల్ల జీరో టికెట్, పేయర్ టికెట్‌లు ఇచ్చే సమయంలో టికెట్‌లు తారుమారై ఉద్యోగులు కేసులకు గురవుతున్నారు. వందలాది మంది కండక్టర్లు ఉద్యోగాలు కోల్పోతున్నారు. మహాలక్ష్మి ప్రయాణికులకు జీరో టికెట్‌కు బదులుగా ఉచిత బస్‌పాస్ కార్డులు జారీ చేయాలి. అలాగే రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను, సిబ్బంది సంఖ్యను వెంటనే పెంచాలి.

ప్రశ్న : అద్దె బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తున్నారు కదా ?

వెంకన్న : ఇప్పటికే ఆర్‌టిసిలో అద్దె బస్సుల సంఖ్య విపరీతంగా పెరిగి, సంస్థ నిర్వీర్యం అవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసిని అభివృద్ధి చేసి, ఆధునీకరిస్తామని హామీ ఇచ్చింది. కానీ గత ప్రభుత్వం కంటే ప్రమాదకరంగా ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో వేలాదిగా ప్రైవేట్ బస్సులను ప్రవేశపెట్టి సంస్థను 60శాతానికి పైగా కుదించేందుకు యాజమాన్యం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నది. ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులలో ఆర్‌టిసి సిబ్బంది ఎవరూ ఉండరు. ఒక బస్సుపై ఐదుగురు సిబ్బందిని తగ్గిస్తారు. ఫలితంగా ప్రస్తుతం ఉన్న 39,752 మంది ఉద్యోగులు భవిష్యత్‌లో 20వేలకు తగ్గిపోయే ప్రమాదం ఉంది. క్రమంగా ప్రైవేట్ బస్ ఆపరేటర్ల గుప్పిట్లోకి ఆర్‌టిసిని నెడుతున్నారు. ఆర్‌టిసి ప్రైవేటీకరణకు చాపకింద నీరులా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నిరుపేదల ఇండ్ల స్థలాల కోసం.. ప్రభుత్వస్థలాల్లో గుడిసెలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పట్టణంలో అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. జహీరాబాద్ పట్టణంలో భూదాన్ భూమి 70 ఎకరాలు ఉందని, ఆ భూమిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు మంజూరు చేయాలన్నారు. అలాగే స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హాయాంలో 55 ఎకరాల భూమి నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం మంజూరు చేసిందని, కొంతమంది నాయకులు ఆ భూమిపై కోర్టుకు వెళ్లగా కోర్టు వారు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చారని, ఆ భూమిని కూడా నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో జహీరాబాద్ పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో నాలుగు వేల ఇళ్ల పట్టాలు నిరుపేదలకు పంచిన ఘనత సిపిఐ కే దక్కిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వ అధికారుల్లో ఉలుకు,పలుకు లేనందున ప్రభుత్వ భూమి ఎక్కడ ఉంటే అక్కడ ఎర్ర జెండాలు పాతి గుడిసెలు వేస్తామని స్పష్టం చేశారు.

ఒకే కుటుంబంలో నలుగురు అన్నతమ్ముళ్లు నివాసం ఉంటున్న వారికి ఉండడం కష్టంగా ఉంటుందని అందుకని ప్రభుత్వ స్థలాల్లో నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం ఉద్యమిస్తామని ఆయన అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యవసరల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, సామాన్యులు బతకడం కష్టంగా ఉందన్నారు. బిజెపి, టిఆర్ఎస్‌లు ఒక్కటై కాంగ్రెస్ ప్రభుత్వంపై దాడి చేస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇ.టి. నర్సింహ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీర్ల ప్రకాశ్ రావు, జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దీన్, డివిజన్ కార్యదర్శి కె.నర్సింలు, నాయకులు అజార్, ఆనంద్, చిరంజీవి, అశోక్, రుబీనా , గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరం ఎస్‌సి, ఎస్‌టి కేసుల పరిష్కారం

రాష్ట్ర ఎస్‌సి ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : ఎస్‌సి, ఎస్‌టి కేసుల పరిష్కారంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, 15 రోజుల్లో పరిష్కరించి వాటి నివేదిక అందజేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో భూ, అట్రాసిటీ సమస్యలపై రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి పురోగతి వివరాలను డిసిపిలు రవీందర్, సలీమా, ఎసిపిలు తిరుమల్, దేవేందర్ రెడ్డి, తిరుపతి, కిషోర్ కుమార్, కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్‌సి,ఎస్‌టిలకు సంబంధించిన పలు భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల గురించిన వివరాలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు చైర్మన్‌ను కోరారు. ఈ సందర్భంగా భూ వివాదాలకు సంబంధించిన కేసులు, అట్రాసిటీ కేసుల పరిష్కారం ఎన్ని రోజుల్లో జరుగుతుందని హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, పోలీస్ అధికారులను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో ఎంతమంది బాధితులకు పరిహారం అందిందని వివరాలను జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీలతను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కేసుల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలన్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. హసన్‌పర్తి మండలం మునిపల్లిలో దళితుల భూమి సమస్యకు సంబంధించి వారం రోజుల్లో నివేదికను తమకు అందజేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈనెల 18వ తేదీన ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి ఎస్‌సి, ఎస్‌టి కేసుల విషయంపై మాట్లాడనున్నట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ రాజ్యాంగబద్ధ కమిషన్ అని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ జిల్లాలో నమోదైన మొత్తం 21కేసులపై తహసీల్దారుల నుండి ప్రాథమిక నివేదికలు అందాయని, వాటిపై 15 రోజులలో సమగ్ర నివేదికను కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నునావత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్ కుమార్, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, జవహర్ లాల్ నాయక్, చుంచు రాజేందర్, రడపాక పరంజ్యోతి, సింగారపు రవిప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫీజులు చెల్లించే వరకూ ఉద్యమం

ఆర్.కృష్ణయ్య పిలుపు

ప్రజాపక్షం / ఖైరతాబాద్ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ఫీజులు చెల్లించేంత వరకు విద్యార్థులు ఉద్యమాన్ని విరమించొద్దని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బకాయిపడ్డ ఫీజులు చెల్లించాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బిసి విద్యార్థి సంఘం ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులంతా ఈనెల 16న తరగతులు బహిష్కరించి, కలెక్టరేట్‌లు, ఆర్‌డిఒ, ఎంఆర్ఒ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని తెలిపారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ 14లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి రూ.4వేల కోట్ల బడ్జెట్ కేటాయించని ఆర్థిక శాఖ కొంతమంది కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు ఎలా మంజూరు చేస్తున్నదని ప్రశ్నించారు. బిసి సంఘం ఉపాధ్యక్షులు లాల్‌కృష్ణ, బిసి యువజన సంఘం అధ్యక్షుడు అంజి, బిసి విద్యార్థి సంఘం ప్రధానకార్యదర్శి రవి యాదవ్, రాష్ట్ర నేతలు దామోదర్, అనంతయ్య, నందగోపాల్ పాల్గొన్నారు.

పొలిటికల్ వార్‌లో.. పొంగులేటి

కెటిఆర్‌పై దూకుడు

అదే రీతిలో కెటిఆర్ జవాబు

ప్రజాపక్షం / ఖమ్మం : రాష్ట్రంలో బిఆర్ఎస్‌తో ముఖ్యంగా ఆ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కెటిఆర్‌తో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఢీ అంటే ఢీ అంటున్నారు. రాజకీయ విమర్శల కంటే వ్యక్తిగతంగా ఒకరిపై ఒకరు పదునైన విమర్శలు, ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ వేడిని రగిలిస్తున్నారు. ఇదే సందర్భంలో రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన ఈకార్ రేసుకు సంబంధించి సోమవారం మంత్రి పొంగులేటి కేటిఆర్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి తర్వాత కేటిఆర్‌పై విమర్శలు, ఆరోపణలు పొంగులేటి మాత్రమే చేస్తుండగా మిగిలిన మంత్రులు అంతగా స్పందించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. 2013లో రాజకీయ ఆరంగేట్రం చేసిన పొంగులేటి 2014లో ఖమ్మం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఎంపిగా గెలిచారు. ఆ తర్వాత ఆయన అప్పటి టిఆర్ఎస్‌లో చేరారు. 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ సీటు ఇవ్వకుండా నిరాకరించింది. అయినా 2023 జనవరి వరకు ఆయన బిఆర్ఎస్‌లోనే కొనసాగారు. కేసిఆర్ పొంగులేటి మధ్య అంతగా సంబంధాలు లేకున్నా కేటిఆర్‌తో మంచి సంబంధాలు ఉన్నాయని, అందుకే పొంగులేటి బిఆర్ఎస్‌లో కొనసాగుతున్నారని అప్పట్లో వినికిడి. ఆ తర్వాత 2023 జూన్ మాసంలో పొంగులేటి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాలేరు నుంచి పోటీ చేయడం ఆ తర్వాత రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం చకచకా జరిగిపోయాయి. మంత్రి పదవి పొందిన తర్వాత పొంగులేటి బిఆర్ఎస్‌పై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. మొత్తం బిఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేస్తూ మాట్లాడే పొంగులేటి ఇటీవల కాలంలో కేటిఆర్‌ను టార్గెట్ చేస్తున్నారు.

మూసీ ప్రక్షాళనకు సంబంధించి విదేశీ పర్యటనకు వెళ్లిన పొంగులేటి అక్కడి నుంచి దీపావళికి బాంబులు పేలనున్నాయంటూ ఓ పొలిటికల్ బాంబ్ వేశారు. దీపావళి తర్వాత కెటిఆర్ పొంగులేటి బాంబు తుస్‌మన్నదంటూ కౌంటర్ విసిరారు. ఇలా ఇద్దరి మధ్య వ్యక్తిగత వ్యవహారంగా మారిన నేపథ్యంలో పొంగులేటిపై ఆదాయపన్ను అధికారుల దాడుల తర్వాత కేటిఆర్ పొంగులేటిపై విమర్శలు చేస్తూ బిజెపితో మంతనాలు ఆడారని పెద్ద మొత్తంలో నగదు దొరికిందని ఒక పెద్ద స్టార్ హోటల్‌లో ఎవరినో కలిశారని ఎందుకు కలిశారంటూ పలు ఆరోపణలు చేశారు. కొడంగల్‌లో ఎత్తిపోతల పథకానికి సంబంధించి మెగా కృష్ణారెడ్డి పొంగులేటి సంస్థలు పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడ్డాయని కేటిఆర్ పదునైన విమర్శలు చేశారు. దానిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆయన ప్రతి మీడియా సమావేశంతో పాటు సోషల్ మీడియాలోను ఇదే ప్రస్తావనను తీసుకురావడం చేస్తున్నారు. ఇద్దరి మధ్య ఇలా వ్యక్తిగతంగా విమర్శలు, ప్రతి విమర్శలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం పొంగులేటి ఓ అడుగు ముందు కేసి కెటిఆర్ కేసు నుంచి బయటపడేందుకు ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసి ప్రాధేయపడ్డారంటూ పలు విమర్శలు చేశారు. త్వరలో తాను పేల్చబోయే బాంబు సంగతి కేటిఆర్‌కు తెలుసంటూ పొంగులేటి వ్యాఖ్యానించడం రాజకీయ చర్చకు దారితీసింది. మొత్తంగా మాజీ మంత్రి కెటిఆర్ ప్రస్తుత మంత్రి పొంగులేటి మధ్య రాజకీయ వివాద స్థానే వ్యక్తిగత విమర్శలు,ప్రతి విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

బిఆర్ఎస్‌పై పొంగులేటి రాజకీయ యుద్ధం చేస్తున్నారన్న భావన కలుగుతుంది. ఈ వ్యక్తిగత విమర్శలు ఈకార్ రేస్ వ్యవహారం మున్ముందు ఏ పరిస్థితికి దారితీస్తుందో ఎటువంటి రాజకీయ అంశాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.

కార్మిక వర్గంలో బిజెపి చిచ్చు

''ప్రజా సమస్యలు – పరిష్కార మార్గాలు'' అనే అంశంపై జరిగిన సదస్సులో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: మతోన్మాదంతో కార్మిక వర్గాన్ని బిజెపి విడదీస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ''ప్రజా సమస్యలు – పరిష్కార మార్గాలు'' అనే అంశంపై సోమవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సదస్సుకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న వ్యవసాయ కార్మికులను ఉద్దేశించి బాలమల్లేష్ మాట్లాడుతూ ప్రజలు ఉపాధి లేక ఆకలితో అలమటిస్తుంటే నరేంద్రమోదీ ఉపాధి హామీకి కేటాయించే నిధులను తగ్గించడంతోపాటు ఉపాధి హామీ చట్టాన్ని నీరుకారుస్తున్నారని విమర్శించారు. మతం పేరుతో దేశ ప్రజలను విడదీస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. దేశంలో సోడో మతవాదుల ప్రాబల్యం పెరుగుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టకోకుంటే పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ల్యాండ్ ఆక్విజేషన్ చట్టం పేరుతో ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీ, ఏవియేషన్‌లకు రైతుల భూములను గుంజుకొని వ్యవసాయ కార్మికులను రోడ్డున పడేస్తున్నారని అన్నారు.

ప్రభుత్వం బలవంతపు భూ సేకరణ చేస్తే ప్రజల తరఫున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, పరిశ్రమల పేరుతో వ్యవసాయం తగ్గిపోయి ప్రజలకు ఉపాధి లేకుండా పోయిందని ఆయన వాపోయారు. అంతే కాకుండా రంగారెడ్డి జిల్లాలో నెలకొల్పుతున్న పరిశ్రమలలో స్థానిక ప్రజలకు అర్హతకు తగినట్లు ఉద్యోగ అవకాశాలను కల్పించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి ఉద్యోగ, ఉపాధి హామీ అవకాశాలు దక్కించుకునేందుకు వెనకాడబోమని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వాల విధానాల వలన జిల్లా ప్రజలకు ఉపాధి లేకుండా పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, జిల్లా అధ్యక్షులు బుద్దుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నరసింహ, ఓరుగంటి యాదయ్య, ముత్యాల యాదిరెడ్డి, స్థానిక నాయకులు నీలమ్మ, మూలుగు నరసింహ, శ్రీశైలం, రాజు నాయక్, గాలయ్య, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం

సిఎం, మంత్రులను కల్లాలకు పంపించి కొనుగోల్లు వేగవంతం చేయాలి

డాక్టర్ లక్ష్మణ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు చేయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటని బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి ప్రతి పైసా కేం

ఫోకస్

యువత ఉపాధి

జోరుగా జెఇఇ మెయిన్స్

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

దేశవ్యాప్తంగా ఎన్ఐటిలు, ట్రిపుల్ఐటిలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక విద్యా సంస్థల్లో బిటెక్, బిఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ మెయిన్ 2025 తొలి విడత పరీక్షల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి గాను రెండు సెషన్ల (జనవరి, ఏప్రిల్) చొప్పున జెఇఇ మెయిన్స్ నిర్వహించనుంది. ఇందులో మొదటి సెషన్ పరీక్షలు జనవరి 22వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ఆరంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు వేగాన్ని పుంజుకున్నాయి. ఈనెల 22వ తేదీ రాత్రి 11.50 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అప్పటిలోగా నిర్ణీత ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవాలి. జనవరి మొదటి వారంలో పరీక్ష కేంద్రాలను ప్రకటిస్తుంది. పరీక్షకు 3 రోజులు ముందుగా ఎన్‌టిఎ అధికారిక వెబ్‌సైట్‌లో అడ్మిట్ కార్డులు విడుదలవుతాయి. కాగా, జెఇఇ మెయిన్ సిలబస్ ఎలాంటి మార్పు లేదు. యథావిధంగా ఉంటుందని వెల్లడించింది. జనవరి 22 నుంచి 31వరకు జెఇఇ మెయిన్ సెషన్ 1 పరీక్షలు జరుగుతాయి. ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటలకు, మధ్యాహ్నం 3 గం టల నుంచి సాయం త్రం 6 గంటల వరకు రోజుకు రెండు షిఫ్టుల చొప్పున ఆన్లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయి. ఇక ఫిబ్రవరి 12న తుదీ ఫలితాలు వెల్లడిస్తారు. జెఇఇ మెయిన్స్‌ను 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇక రెండో విడత పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి జరగనున్నాయి. ఈ మేరకు మెయిన్ ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) షెడ్యూల్లో తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఈసారి 40 రోజులు ఆలస్యంగా షెడ్యూల్ విడుదలైందని చెప్పవచ్చు. గతేడాది జనవరి 24వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవగా, ఈసారి 2 రోజులు ముందుకు జరిపారు. జెఇఇ మెయి న్ పేపర్ 1, 2లకు కలిపి గత ఏడాది 12.30 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు లక్షన్నర మంది దరఖాస్తు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 31 ఎన్ఐటిల్లో 24 వేలకుపైగా, ట్రిపుల్ఐటిల్లో 8,500లకుపైగా బీటెక్ సీట్లున్నాయి. వీటిల్లో ఎన్ఐటిల్లో 50 శాతం సీట్లు సొంత రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు. జెఇఇ మెయిన్లో కనీస అర్హత మార్కులు సాధించిన తొలి 2.50 లక్షల మందికి మాత్రమే అడ్వాన్స్డ్ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా ఎన్ఐటిలు, ట్రిపుల్ఐటిల్లో బీటెక్ సీట్లను జెఇఇ మెయిన్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేస్తారు. ఐఐటిల్లో బీటెక్లో చేరాలంటే మెయిన్లో ఉత్తీర్ణులైన వారు జెఇఇ అడ్వాన్స్డ్ తప్పనిసరిగా రాయాల్సి ఉంటుంది.

జెఇఇ మెయిన్ 2025 సెషన్ 1 షెడ్యూల్
ఆన్లైన్ దరఖాస్తులు: నవంబరు 22 వరకు కొనసాగుతాయి
హాల్టికెట్లు విడుదల తేదీ: పరీక్షకు 3 రోజుల ముందు
పరీక్ష తేదీ: జనవరి 22 నుంచి జనవరి 31 వరకు
ఫలితాల ప్రకటన తేదీ: ఫిబ్రవరి 12
జెఇఇ మెయిన్ 2025 సెషన్ 2 షెడ్యూల్
ఆన్లైన్ దరఖాస్తులు: జనవరి 31 నుంచి ఫిబ్రవరి 24 వరకు కొనసాగుతాయి
హాల్టికెట్లు విడుదల తేదీ: పరీక్ష తేదీకి 3 రోజుల ముందు
పరీక్ష తేదీ: ఏప్రిల్ 1 నుంచి 8 వరకు
ఫలితాల ప్రకటన తేదీ: ఏప్రిల్ 17.

ఆస్ట్రేలియానే ఆదర్శం..

సోషల్ మీడియా వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో అంతకు మించి నష్టాలు కూడా ఉన్నాయి. ముఖ్యం గా విద్యార్థులపై దీని ప్రతికూల ప్రభావం అధికంగా కనిపిస్తున్నది. మానసికంగా ఎదిగీఎదగని కౌమార్య దశలో ఉన్న పిల్లలకు సోషల్ మీడియాను దూరంగా ఉంచాలన్న ఆస్ట్రేలియా నిర్ణయాన్ని అన్ని దేశాలు ఆదర్శంగా తీసుకోవాలి. అనుసరించాలి. యుక్తవయస్కులను రక్షించడానికి సోషల్ మీడియాలో వయో పరిమితులను విధించడం వల్ల మెరుగైన ఫలితాలే ఉంటాయని మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సోషల్ మీడియా వల్ల లాభాలను పరిశీలిస్తే సాంఘిక నైపుణ్యాల అభివృద్ధిలో సహకరిస్తూ, తోటివారి పరస్పర అవగాహన, సమాజ నిర్మాణాన్ని సులభతరం చేస్తుంది. ఉదాహరణకు ప్యూ రీసెర్చ్ (2023) ప్రకారం 71శాతం మంది టీనేజర్లు సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుంటున్నారు. యువత తమకు నచ్చిన అంశాలను అన్వేషించడానికి, స్వీయ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కూడా సోషల్ మీడియా ఉపయోగపడుతున్నది.డిజిటల్ అక్షరాస్యత,నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా విస్తారమైన విద్యా వనరులకు ప్రాప్యత సాధ్యమవుతుంది. లింక్డ్ఇన్, ఫేస్‌బుక్ వంటి ప్లాట్‌ఫామ్స్‌ను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. అట్టడుగు వర్గాలకు మద్దతు, అవగాహన కోసంసురక్షిత ఖాళీలను సృష్టిస్తుంది. ఈ విషయాన్ని ఎన్‌సిఇఆర్‌టి 2023 అధ్యయనం కూడా ప్రస్తావించింది.అయితే, ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. మరో వైపు ఎన్నో నష్టాలు పొంచివున్నాయి. విద్యాభ్యాసాన్ని, భవిష్యత్తును పట్టించుకోకుండా నిత్యంత సోషల్ మీడియాకే అంకితమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎంతోమంది పిల్లలు ఆటపాటలకు స్వస్తిచెప్పి, సెల్‌ఫోన్లకు, కంప్యూటర్లకు అతుక్కుపోవడాన్ని చూస్తునే ఉన్నాం. ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వచ్చిపడే సమాచారంతో గందగోళం పెరుగుతుంది. ఏది నిజమో, ఏది అబద్ధమో పెద్దవారే నిర్ధారించుకోలేకపోతున్నారు. పిల్లల పరిస్తితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇటీవల కాలంలో యువత తీవ్రమైన ఆందోళన, నిరాశ, మానసిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. సోషల్ మీడియా వల్ల తీవ్రమైన మానసిక, శారీరక అనారోగ్యాలను ఎదుర్కొంటున్న వారిలో 20 శాతం మంది దానికిదూరమైన తర్వాత తిరిగి మామూలు స్థితికి వచ్చారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) అధ్యయనం పేర్కొంది. ఇక ప్రమాదకరమైన కంటెంట్ వల్ల దుష్ప్రభావాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియా వినియోగం వల్ల సైబర్ బెదిరింపులకు గురికావడాన్ని 30 శాతం పెరుగుతాయని అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ నివేదిక పేర్కొంది. సోషల్ మీడియా కారణంగా యువతకు సంబంధించిన ఆన్‌లైన్ మోసం కేసులు 15 శాతం పెరిగాయని నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ నివేదిక చెప్తున్నది. యువతలో స్క్రీన్ సమయాన్ని నియంత్రించడానికి దక్షిణ కొరియా 2021లోనే కొన్ని పరిమితులు, నిబంధనలు విధించింది. ఆ ప్రయోగం సత్ఫలితాన్నిచ్చింది. మైనర్లలో స్క్రీన్ టైమ్ గణనీయంగా తగ్గింది. అందుకే, 16 సంవత్సరాల లోపు వయసుగల వారు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఆస్ట్రేలియా నిర్ణయాన్ని స్వాగతించి తీరాలి. అయితే, అలాంటి నిర్ణయాన్ని ఆచరణలో పెట్టడం అనుకున్నంత సులభం కాదు. వయస్సు తనిఖీ చేయడం దాదాపు అసాధ్యం. వయసు ఆధారిత నిషేధాలు డిజిటల్ లెర్నింగ్ అవకాశాలను పరిమితం చేస్తాయనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. కాబట్టి, ఎన్ని చట్టాలు వచ్చినా, తల్లిదండ్రులు మారకపోతే, సోషల్ మీడియా నుంచి టీనేజర్లను రక్షించడం అసాధ్యం. సోషల్ మీడియా వల్ల ఎదురయ్యే మానసిక, శారీరక రుగ్మతలపై తల్లిదండ్రులకు తప్పక అవగాహన ఉండాలి. వారి సమక్షంలోనే విద్యార్థులు ఆన్‌లైన్ లేదా డిజిటల్ లెర్నింగ్‌కు సమయాన్ని వెచ్చించేలా చూడాలి. జూదం, హింస వంటి కంటెంట్‌పై పూర్తి నిషేధం అవసరం. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే, సోషల్ మీడియా వల్ల ఏర్పడే దుష్ట ప్రభావాల నుంచి యువతను కాపాడుకోవచ్చు. వారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గాలు సిద్ధం చేయవచ్చు.

నాటి ఆటోడ్రైవర్... నేటి విమాన పైలట్



మనసు ఉండాలేగానీ మార్గం తప్పక ఉంటుందంటారు పెద్దలు. ఆ నానుడిని నిజం చేశాడు నాగపూర్‌కు చెందిన శ్రీ కాంత్ పంత్వానే. ఆ టోడ్రైవర్ స్థాయి నుంచి విమానం నడి పే పైలట్ స్థాయికి ఎదిగాడు. అందరికీ ఆదర్శంగా నిలిచాడు. మురికివాడలో, పేద కుటుంబంలో జన్మించిన శ్రీకాంత్ తండ్రి వాచ్‌మన్‌గా పని చేసేవాడు. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. తీవ్రమైన ఆర్థిక ఇ బ్బందుల కారణంగా శ్రీకాంత్ 12వ తరగతితోనే చదువు మానుకోవాల్సి వచ్చింది. ఒక కొరియర్ సంస్థలో డెలివరీ బాయ్‌గా చేరి, కు టుంబానికి అండగా నిలిచాడు. తర్వాత కొ న్నాళ్లకు ఓఆటో కొనుక్కొని, దానిని నడిపించడం మొదలుపెట్టాడు. ఒక సంఘటన అతని జీవితాన్ని మార్చేసింది. ఒక పార్సిల్ డెలివరీ కోసం అతను ఎయిర్‌పోర్ట్ వెళ్లాల్సి వచ్చింది. అక్కడ శిక్షణ పొందుతున్న కెడెట్స్‌తో మాట్లాడినప్పుడు, ఎయిర్‌ఫోర్స్‌తో సంబంధం లేకుండానే పైలట్ కావచ్చనే విషయం తెలిసింది. అ ప్పటి వరకూ ఎయిర్‌ఫోర్స్‌లో చేరిన వారే పైల ట్లు అవుతారన్న అభిప్రాయంఅతనిలో బలంగా ఉండేది. అలాంటి దేమీ లేదని తెలుసుకున్న తర్వాత, పైలట్ కోర్సుపై ఆసక్తి పెరిగింది. ఎయిర్‌పోర్ట్ వెలుపల టీ దుకాణం నడిపే వ్యక్తి ద్వారా పైలట్ శిక్షణా కోర్స్‌కు స్కాలర్‌షిప్ ఉంటుందనే విష యం తెలియడంతో, మరింత ఉత్సాహం పొం దాడు. నిలిచిపోయిన చదువును మళ్లీ మొ దలు పెట్టాడు. ప్లస్ టూలో స్కాలర్‌షిప్ కో సం అవసరమైన అర్హతా మార్కులపై దృష్టి కేంద్రీకరించాడు. కష్టపడి అనుకున్న ది సాధించా డు. పైలట్ శిక్షణ పొందడానికి అ ర్హత సంపాదించి, కోర్సులో చేరాడు. అయితే, అప్పటి వరకూ మాతృభాష మ రాఠీలో చదివిన శ్రీకాంత్‌కు ఇంగ్లీషు పెద్ద అడ్డ ంకిగా మారింది. శిక్షకు లు చెప్పే విషయాలను అర్థం చేసుకోవడం కష్టమయ్యేది. కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ పైలట్ కోర్సు పూర్తి చేయాలన్న పట్టుదలతో ఇంగ్లీషు నేర్చుకోవడం మొదలుపెట్టాడు.సహచరుల సాయం తీసుకున్నాడు. రాత్రింబవళ్లు ప్రాక్టీస్ చేశాడు. ఇంగ్లీషు భాష మీద పట్టు సంపాదించాడు. తనకు ఎదురైన సమస్యను తా నే పరిష్కరించుకున్నాడు. ఫ్లయింగ్ కలర్స్ అకాడెమీ నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందాడు. కానీ, సర్టిఫికెట్‌తో బయటకు వచ్చిన శ్రీకాంత్‌కు, తీవ్రమైన ఆర్థిక మాంద్యం కారణంగా ఉద్యో గం దొరకలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒక కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా చేరి, కుటుంబానికి ఆసరాగా నిలిచాడు.పైలట్‌గా ఎగరాలని, జీవితంలో ఎదగాలనే తన కలలను మాత్రం మానుకోలేదు. నిరంతర ప్రయత్నాలు కొనసాగించి, చివరికి ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో పైలట్ ప్యాక్‌లో ఫస్ట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ఒకప్పటి ఆటో డ్రైవర్ ఇప్పుడు పైలట్‌గా మారాడు.కృషి ,పట్టుదల బలంగా ఉండడం వల్లే ఇది సాధ్యమైంది. కలలుకనడం సులభమేగానీ, వాటిని సా కారం చేసుకోవడం కష్టం. ఎంతో ఇ ష్టంగా ఆకష్టాలను ఎదుర్కొన్నాడు శ్రీకాంత్ అనుకున్నది సాధించాడు. ఎంతో మందికి ఐకాన్‌గా నిలిచాడు.

యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

విద్యార్థులను రక్షించుకోవాలి..

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రమాణాలను పెంచుకోవడం... పోటీ ప్రపంచంలో అందరి కంటే ముందు ఉండడానికి నిరంతరం శ్రమించడం అత్యవసరంగా మారిన నేపథ్యంలో, సహజంగానే నేటి యువతీ యువకులు తీవ్రమైన మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారు. ప్రత్యేకించి విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని పెరుగుతున్న ఆత్మహత్యలే స్పష్టం చేస్తున్నాయి. ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు వారు ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులకు అద్దం పడుతుండగా, నివారణ చర్యలు యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. క్యాంపస్ ఆత్మహత్యలపై విచారణ జరిపేందుకు ఒక ప్యానెల్‌ను నియమించాలని అహమ్మదాబాద్ ఐఐఎం విద్యార్థుల సంఘం డిమాండ్ చేయడంతో, ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడానికి కారణమవుతున్న అంశాలను గుర్తించడానికి, సమస్యలను పరిష్కరించడానికి సమర్థమైన చర్యలను చించడానికి స్వతంత్ర ప్యానెల్ అవసరమని విద్యార్థి సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఉన్నత విద్యా సంస్థల్లో ఆత్మహత్య రేటు ఎక్కువగా ఉండడానికి, వారిపై పెరుగుతున్న ఒత్తిడే ప్రధాన కారణమన్నది బహిరంగ రహస్యం. అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు మెరుగైన ప్రదర్శన కోసం విద్యార్థులపై ఒత్తిడి పెంచడం సాధారణమైంది. విద్యార్థులను మానసిక, విద్యాపరమైన ఒత్తిడి నుంచి తప్పించడానికి ప్రయత్నాలు జరగడం లేదు. ఫలితంగా వారి మానసిక ఆరోగ్యం దెబ్బతింటున్నది. ఆ పరిస్థితుల ప్రభావం సాధారణ ఆరోగ్యంపైనే కనిపిస్తుంది. ఈ దుస్థితి నుంచి విద్యార్థులను బయటకు తెచ్చేందుకు కృషి జరగాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆలోచనా విధానం మారాలి. మార్కులు.. ర్యాంకులే జీవితం అనుకునే మూస ధోరణికి స్వస్తిచెప్పి, ప్రగతిశీల ఆలోచనా విధానాన్ని అలవరచుకుంటే విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించినవారవుతారు. వారి ఆత్మహత్యలు తగ్గుతాయి.

వంద వసంతాల సిపిఐని ఆదరించండి

పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

ప్రజాపక్షం/సత్తుపల్లి : ఎందరో త్యాగధనులు, ఎందరో అమరవీరుల స్ఫూర్తితో వంద సంవత్సరాల వారోత్సవాలు జరుపుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీని ఆదరించాలని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక జెవిఆర్ ఒసిలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం సిపిఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఎందరో అమరవీరుల త్యాగఫలంతో భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహించి భారతదేశంలో కార్మిక వర్గానికి, కార్మికులు సమస్యల సాధన కోసం తెగించి పోరాడిందని వివరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు మాట్లాడుతూ డిసెంబర్ 26న పార్టీ పుట్టి వంద సంవత్సరాల అయిన సందర్భంగా సిపిఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, సింగరేణి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, దారా బీమయ్య, నరసారావు, కిషోర్, భరణి, చారి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే పరిష్కార మార్గాలు

మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జంగమ్మ

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినప్పటికీ మహిళలకు దక్కాల్సిన గౌరవం దక్కడంలేదని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మహిళా సమాఖ్య మండల కార్యదర్శి ఆర్య పుష్ప అధ్యక్షతన యాదగిరిగుట్టలో మహిళా సమాఖ్య జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో జంగమ్మ మాట్లాడుతూ మహిళల హక్కుల సాధనకు పోరాటాలే పరిష్కార మార్గాలన్నారు. పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాలు అవలంబిస్తూ అరకొర సంక్షేమ పథకాలతో మహిళల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా ప్రభుత్వ ప్రైవేటు రంగంలో సమాన భాగస్వామ్యాన్ని అందజేయాల్సిన పాలకవర్గాలు మహిళలపై వివక్షతతో అసమానతలను నెలకొల్పుతున్నారన్నారు. సామాజిక అసమానతలు, రుగ్మతల్ని చేధించడానికి బలమైన మహిళా సమాక్య ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కులను, సాధికారతని సాధించడానికి పోరాడాలన్నారు. డిగ్రీ స్థాయి వరకు ఉచిత విద్యను అందించి స్థానికంగా ప్రకృతి వనరుల వినియోగంతో పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానిక మహిళకు ఉపాధి కల్పించినప్పుడే ఆర్థిక స్వాతంత్రాలు వర్ధిల్లుతుంటాయన్నారు. సమావేశంలో మునుకుంట్ల నరసమ్మ, రాగుల విజయలక్ష్మి పద్మ, నందలక్ష్మి , నాగమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

ప్రజాపక్షం/మిర్యాలగూడ : పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలు, మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడి పెరుగుతుందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్ అన్నారు. శ్రమ దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా శిక్షణ తరగతులు సోమవారం మిర్యాలగూడలోని కరీం ఫంక్షన్‌హాల్‌లో ప్రారంభమయ్యాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయిద్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. శిక్షణ తరగతుల్లో యూసుఫ్ మాట్లాడుతూ 1920లో ఆవిర్భవించిన ఎఐటియుసి స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరుగని పాత్ర పోషించిందని, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరింది మొదట ఎఐటియుసి అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ముందు ఆ తరువాత దేశంలోనూ అలుపెరుగని పోరాటాలతో హక్కులను సాధించిన ఘనత ఎఐటియుసికి దక్కుతుందన్నారు. ఎన్డిఏ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాలు కింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. మోదీకి కార్పోరేట్ల రక్షణ తప్పా, కార్మిక సంక్షేమం పట్టదన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచీకరణ, మతోన్మాదం, కార్మిక చట్టాల సవరణ ఇప్పుడు అత్యంత వేగం గా మోదీ ప్రభుత్వం అమలు చేస్తుందని దీన్ని ప్రతిఘటించేందుకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలకులు అవలంభిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్మిక వర్గం నిర్వహించే పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, ధరలు పెరగడంతో కార్మిక, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఉద్యమ నేపథ్యం కార్మికుల సమస్యలు పోరాట మార్గాలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, కెఎస్.రెడ్డి, పానం వెంకట్రావు, సహాయ కార్యదర్శులు నూనె వెంకటేశ్వర్లు, దోటి వెంకన్న, జిల్లా కోశాధికారి దోనకొండ వెంకటేశ్వర్లు, జిల్లా యాదయ్య, డి.లింగానాయక్, వలపట్ల వెంకన్న, శాంతాబాయి, డి.రాణి, సుజిత, వనజ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమలులో నిర్లక్ష్యం

చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ చట్టం -2023 సవరించాలి

ఎన్ఎఫ్ఐడబ్లు రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి : కేంద్రంలోని ఎన్డిఏ ప్రభుత్వం మహిళా చట్టాల అమలులో నిర్లక్ష్యం వహిస్తుందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. కేంద్రం ప్రభుత్వం పార్లమెంట్ చర్చలకు అనుమతి లేకుండా నారీ శక్తివందన్ అభినియం పేరుతో రాజ్యాంగంలోని 128 సవరణ ద్వారా ఈ బిల్లును ఆమోదింప చేసిందని, దీంతో మహిళ చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలంటే షరతులు వర్తిస్తున్నాయని, ఈ చట్టంతో మహిళలకు ఏలాంటి ఉపయోగం లేదని, చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ చట్టం 2023 తక్షణమే సవరించాలని సృజన డిమాండ్ చేశారు. సోమవారం జాతీయ మహిళ సమాఖ్య సిద్దిపేట జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగాయి. మహిళ సమాఖ్య జెండాను సృజన ఆవిష్కరించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ అధ్యక్షత వహించారు. సమావేశంలో సృజన మాట్లాడుతూ దేశం స్వతంత్రంగా ఆవిర్భవించిన తర్వాత 1954లో భారత జాతీయ మహిళ సమాఖ్య ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి నుండి సామాజిక, అర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు సమానత్వం, సాధికారతల సాధన కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. దేశ వ్యాప్తంగా మహిళలకు సంబంధించిన అనేక సమస్యల పరిష్కారం కోసం కృషిచేసిన ఏకైక సంఘం ఎఫ్ఐడబ్లు అన్నారు. వరకట్న నిషేధ చట్టం కోసం సమాన వేతనం కోసం పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు నుండి రక్షణ చట్టం, గృహహింస వ్యతిరేక చట్టం, మరెన్నో చట్టాలు అమలు పాలక ప్రభుత్వాలపై పాలక ప్రభుత్వం నిరంతరం ఎన్ఎఫ్ఐడబ్లు దేశ వ్యాప్తంగా పోరాటాలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఎన్ఎఫ్ఐడబ్లు జిల్లా కార్యదర్శి రజని, మహిళా సమాఖ్య నిర్మాణ బాధ్యులు కనుకుంటంల శంకర్, ఎన్ఎఫ్ఐడబ్లు జిల్లా నాయకురాలు కందుకూరి సావిత్రి, సులోచన, రజిత, మల్లవ్వ, పరమేశ్వరి, సమత, లలిత, రాజవ్వ, లక్ష్మి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పేదల హక్కుల కోసం పోరాటం

సాబీర్‌పాషా, అయోధ్య

ప్రజాపక్షం/మణుగూరు : పేదల హక్కుల సాధనకు సిపిఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. సోమవారం కరకగూడెం మండల సిపి జనరల్ బాడీ సమావేశం వంగరి సతీష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సాబీర్‌పాషా, మాట్లాడుతూ కమ్యూనిస్టు ఆవిర్భవించి వంద సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ప్రతి గ్రామంలో సిపిఐ జెండా ఎగురవేయాలని, పార్టీ ప్రజాసంఘాల నిర్మాణం మహిళలు విద్యార్

దేశాన్ని విడగొట్టేందుకు

జాతి వ్యతిరేకులు యత్నం

ఐక్యమత్యంగా వారి ఆలోచనలను తిప్పికొట్టాలి : మోదీ

అహ్మదాబాద్ : స్వార్థ ప్రయోజనాల కోసం కొంత మంది జాతివ్యతిరేకులు సమాజాన్ని విడగొట్టేందుకు ప్రయతిస్తున్నారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వారి ఉద్దేశాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని, అందరు ఐక్యమై వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. 2027నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తయారు చేసేందుకు ఐక్యత, సమగ్రత అతి ముఖ్యమని మోదీ చెప్పారు. అహ్మదాబాద్ పట్టణంలోని శ్రీ స్వామినారాయణ ఆలయం 200వ వార్షికోత్సవం సందర్భంగా ఖేడా జిల్లాలోని వడ్తాల్‌లో భక్తులనుద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. భారత్ అభివృద్ధి చెందేందుకు పౌరుల్లో ఐక్యమత్యం, దేశంలో సమగ్రత అవసరమని మోదీ ఉద్ఘాటించారు. అయితే కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దేశాన్ని కులం, మతం, భాష, లింగ ప్రాతిపదికన విడగొట్టాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వారి ఆలోచనలను ప్రజలు గుర్తించి వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. భారత్‌ను అభివృద్ధి దేశంగా మార్చేందుకు 'ఆత్మనిర్భర్ భారత్' మొదటి కీలక అడుగు అని అన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రతిజ్ఞలో దేశంలోని ప్రతి పౌరుడు పాల్గొనాలని స్వామినారాయణ శాఖలోని సాధువులందరినీ అభ్యర్థించారు. వడ్తాల్ స్వామినారాయణ దేవాలయంతో తనకున్న అనుబంధం గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల నాటిదని మోదీ భక్తులకు తెలియజేశారు. వడ్తాల్‌లోని స్వామినారాయణ ఆలయానికి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రం ఇటీవల నాణేన్ని విడుదల చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన భారతీయ యువతకు డిమాండ్ అనేక రెట్లు పెరుగుతుందని ప్రధాని అ న్నారు. తాను కలిసే ప్రపంచ నాయకులలో ఎక్కువ మంది భారతీయ యువత తమ దేశాలకు వచ్చి పనిచేయాలని ఆకాంక్షించారని చెప్పారు. మన యువత భారతదేశంతో పాటు ప్రపంచ అవసరాలను తీ ర్చగల సామర్థ్యం కలిగి ఉన్నారని ప్రశంసించారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని పేర్కొన్న మోదీ... తమ ప్రభుత్వం 'వికాస్ భీ విరాసత్ భీ' (వారసత్వ పరిరక్షణతోపాటు అభివృద్ధి) మంత్రాన్ని విశ్వసిస్తుందని అన్నారు. కొన్నేళ్ల క్రితం యునెస్కో చేత గుర్తించబడని సాంస్కృతిక వారసత్వంగా ప్రకటించిన కుంభమేళాను ప్రస్తావిస్తూ, ఇతర దేశాల ప్రజలకు మతపరమైన సమాజం ప్రాముఖ్యతను, దాని ని ఎందుకు జరుపుకుంటారో అర్థం చేసుకోవాలని స్వామినారాయణ వర్గాన్ని మోదీ కోరారు. వచ్చే ఏడాది జనవరి–ఫిబ్రవరి మధ్య ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న కుంభమేళా 'పూర్ణ కుంభం'అని,ఇది 12సంవత్సరాల విరామంతర్వాత జరుపుకోనుందని ఆయన అన్నారు.

ఎమ్మెల్యేలను గొర్రెల మాదిరి

కొనాలని చూస్తున్న మోదీ

ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాలను పడగొడుతున్నారు : ఖర్గే

రాంచి : ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ విమర్శనాస్త్రాలను కొనసాగిస్తూనే ఉంది. తాజాగా ప్రతిపక్షాలను అణచివేస్తున్నారని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. మేకలకు దాణ వేసిన మాదిరిగా శాసనసభ్యులను కొనుగోలు చేస్తూ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ తరువాత ఆ ఎమ్మెల్యేలకు విందు ఇస్తారని ఆరోపించారు. అదానీ, అంబానీతో కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నారని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు 'ముఖ్ మే రామ్, బ గల్‌మే చూరీ' (గొర్రె ముసుగులో ఉన్న తోడేలు)పై నమ్మకం ఉందని ఖర్గే ఆరోపించారు. 'ప్రభుత్వాలను పడగొట్టాలని మోదీజీ నమ్ముతున్నారు. ఎమ్మెల్యేను కొంటారు. ఎమ్మెల్యేలను మేకల లాగా ఉంచి, వారికి ఆహారం పెట్టి, తర్వాత వారికి విందులు చేస్తారు' మోదీ అని ఖర్గే ఆరోపించారు. మోడీ, షా ప్రతిపక్ష నాయకులపై ఇడి, సిబిఐ ఇ తర కేంద్ర ఏజెన్సీలను ఉసిగొల్పుతున్నారని, కానీ తాము మేము భయపడమని స్పష్టం చేశారుత తాము స్వాతంత్ర్యం కోసం పోరాడామని, తమ ప్రాణాలను త్యాగం చేశామని ఖర్గే పేర్కొన్నారు. భారత దేశాన్ని కేవలం నలుగురు వ్యక్తులే నడుపుతున్నారని ఆరోపించారు. మోదీ, షా, అదానీ, అంబానీ దేశాన్ని నడుపుతున్నారని, రాహుల్ గాంధీ, తానూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన ఆరోపించారు. తాను నాన్‌బయోలాజికల్ వ్యక్తి ని కాదని మోదీ విశ్వసిస్తున్నారన్నారు. అత ను చేసిన వాగ్దానాలను ఎప్పుడూ నెరవేర్చని అబద్ధాల కోరు అని, గుజరాత్‌లో ఏదై నా స్వర్ణ యుగం వచ్చిందా? అని ప్రశ్నించారు. 25 ఏళ్లుగా మోదీని సిఎంగా, ప్రధానిగా సహిస్తున్నాం. వెనుకబడిన ప్రజలను, మహిళలను దోపిడీ చేసే వారికి ఆయన మద్దతిస్తున్నారని... మణిపూర్‌లో పర్యటించేందుకు ప్రధాని మోదీ భయపడుతున్నార ని, అక్కడికి వెళ్లేందుకు ధైర్యం ఉందా అని సవాల్ చేస్తున్నానన్నారు. యుపి సిఎంపై ఖర్గే మండిపడ్డారు. నిజమైన యోగి 'బాటేంగే తో కటేంగే' (విభజిస్తే, మనం తుడిచిపెట్టుకుపోతాము) వంటి భాష ఉపయోగించలేరన్నారు. ఈ భాషను ఉగ్రవాదులు ఉపయోగిస్తున్నారని, యోగి మఠానికి అధిపతి, కాషాయ వస్త్రాలు ధరించాడు కానీ 'ముఖ్ మే రామ్ బగల్ మే చూరీ'ని నమ్ముతారని ఆరోపించారు. రాజీవ్‌గాంధీ హంతకుల్లో ఒకరిని సోనియాగాంధీ క్షమించారని, అయితే ప్రియాంక గాంధీ హంతకుడిని కౌగిలించుకున్నారని, ఇదే కరుణ అని అన్నారు.

11 మంది మిలిటెంట్లు హతం!

మణిపూర్‌లో మళ్లీ హింస..

ఇంఫాల్: మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. ఈ క్రమంలో జిరిబామ్ జిల్లాలో మిలిటెంట్లు, భద్రత బలగాల మధ్య కాల్పుల్లో 11 మంది సాయుధులు మృతిచెందారు. స్థానిక పోలీస్ స్టేషన్‌పై దాడులకు తెగబడిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. వీరంతా కుకీ తిరుగుబాటుదారులుగా అనుమానిస్తున్నారు. మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లా బోరోబెక్రా పోలీస్ స్టేషన్‌పై సోమవారం మధ్యాహ్నం కొందరు సాయుధులు దాడులకు పాల్పడ్డారు. అనంతరం సమీపంలో ఉన్న జకురాడోర్ కరోంగ్ గ్రామం వైపు దూసుకెళ్లి బీభత్సం సృష్టించారు. అనేక దుకాణాలకు నిప్పుపెట్టారు. ఈ క్రమంలో భద్రతా దళాలుమిలిటెంట్ల మధ్య భారీ స్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలోనే 11 మంది మిలిటెంట్లు హతమైనట్లు అధికారులు వెల్లడించారు. అటు కొంతమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు కూడా గాయాలైనట్లు సమాచారం. ఇదిలాఉంటే, బిష్ణుపుర్ జిల్లాలో ఇటీవల మిలిటెంట్ల దాడిలో ఓ మహిళ మృతి చెందడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇంఫాల్ లోయలోని సైటాన్ ప్రాంతంలో నవంబర్ 9న ఈ ఘటన చోటుచేసుకుంది. పొలంలో పని చేస్తున్న రైతులను లక్ష్యంగా చేసుకుని సాయుధులు జరిపిన కాల్పుల్లో మహిళ మృతిచెందడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

మహారాష్ట్రలో ప్రభుత్వ మార్పు అనివార్యం

జలగాం జిల్లా పరోలా వద్ద ఎన్నికల ర్యాలీలో శరద్‌పవార్ పిలుపు

జలగాం : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో అధికారపక్షం, విపక్షాల ప్రచారం పతాకస్థాయిలో జరుగుతోంది. విమర్శల జోరు మరింత పెరిగింది. ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడాలంటే మహారాష్ట్రలో ప్రభుత్వం మార్పు అనివార్యమని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపిఎస్‌పి)అధినేత శరద్‌పవార్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు ఆయన నార్త్ మహారాష్ట్రలోని జలగాం జిల్లాలోని పరోలా వద్ద మహా వికాస్ అఘాడి(ఎంవిఎ)కి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. మహారాష్ట్రలో రైతులు, మహిళలు, యువత జీవనపరిస్థితులు బాగా మెరుగవ్వాలి అంటే 'మార్పు చాలా అవసరం' అని శరద్‌పవార్ నొక్కిచెప్పారు. మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు, ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత ఆక్రందనలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడాలంటే ప్రభుత్వం మార్పు అనేది తప్పనిసరి అని ప్రజలకు సూచించారు. పాఠశాలకు వెళ్లే చిన్నారులపై బద్లాపూర్ అత్యాచారాల సంఘటనలే కాకుండా మరెన్నో ఉదాహరణలు మహిళలపై అత్యాచారాల గురించి తాను చెప్పగలుగుతానన్నారు. మహిళలకు భద్రత కల్పించడం బదులుగా వారు సోదరీమణుల(లడ్‌కీ బహిన్)కు మేము డబ్బు ఇస్తామంటూ ప్రకటనలు చేయడం ఎంతవరకు సమంజసమని రాజ్యసభ సభ్యుడైన శరద్‌పవార్ ప్రశ్నించారు. పేద మహిళలకు డబ్బు ఇస్తామంటే తాము వ్యతిరేకించబోమని, కానీ మీ సోదరీమణుల పరిస్థితి ఏవిధంగా ఉన్నదనే విషయాన్ని మీరు ఆలోచించరా అని మహాయుతి ప్రభుత్వాన్ని శరద్‌పవార్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారమే మహారాష్ట్రలో 9,000మంది బాలికలు అదృశ్యం అయ్యారని మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) స్టార్ క్యాంపెయినర్ శరద్ పవార్ వెల్లడించారు. మొత్తం వ్యవసాయం మీదే పూర్తిగా ఆధారపడే రైతు కుటుంబాలకు రెగ్యులర్ ఆదాయం ఉండాలంటే ఉద్యోగాలు తీసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ప్రతిపక్ష మహావికాస్ అఘాడితో ఎన్‌సిపిఎస్‌పి కీలక భాగస్వామిగా ఉందని, ఏది ఏమైనప్పటికీ మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని మార్చే బాధ్యతను తీసుకోవాలని నిర్ణయించిందన్నారు. అందుకోసం మహారాష్ట్రలోని వీథివీథికీ, సందుగొందుకూ తిరిగి ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందని ప్రజలకు వివరిస్తున్నామని శరద్‌పవార్ చెప్పారు. మహారాష్ట్రలో ప్రతిపక్ష ఇండియా కూటమికి 48స్థానాలలో 31లోక్‌సభ స్థానాలను ఇచ్చారని, అందువల్లే ప్రధానమంత్రి మోదీ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే పాపానికి ఒడిగట్టలేకపోయారని వివరించారు. మోదీ టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జెడి(యు)అధినేత నితీష్‌కుమార్ సహాయంతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, వారంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో మహా వికాస్ అఘాడి అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని శరద్‌పవార్ పిలుపునిచ్చారు.288స్థానాలు కలిగి ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబరు 20న ఎన్నికలు జరుగనున్నాయి. నవంబరు 23తర్వాత ఫలితాలు ప్రకటించబడతాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో 4,410మంది అభ్యర్థులు పోటీచేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగ జరుగబోతున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో వారంతా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఉత్తమ పర్యాటక కేంద్రంగా వయనాడ్

తీర్చిదిద్దాలని యుడిఎఫ్ అభ్యర్థి ప్రియాంకకు ప్రతిపక్షనేత రాహుల్ సవాల్

వయనాడ్: వయనాడ్ ఉప ఎన్నికకు సమయం సమీపిస్తోంది. మరోసారి ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఈ స్థానం నుంచి బరిలోకి దిగిన పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తరుపునరాహుల్ గాంధీ ప్రచారం చేస్తున్నారు. తాజాగా ఇక్కడి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. తన సోదరికి ఓ సవాల్ విసిరారు. వయనాడ్‌ను ఉత్తమ పర్యటక ప్రదేశంగా మార్చాలని రాహుల్ ఆమెకు ఛాలెంజ్ చేశారు. 'రాజకీయాలకు అతీతంగా వయనాడ్‌కు నా హృదయంలో గొప్ప స్థానం ఉంది. ఇక్కడున్న ప్రతి ఒక్కరికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నా. ఈ ప్రాంత అందాలను ప్రపంచానికి చూపించాలి. ఉత్తమ పర్యటక ప్రదేశంగా మార్చాడానికి ప్రియాంక కృషి చేయాలి. ఎవరైనా కేరళ వస్తే మొదట ఈ ప్రాంతమే గుర్తుకు రావాలి. కాబోయే ఎంపీ ఇది ఛాలెంజ్‌గా తీసుకోవాలి. ఈ ప్రాంతానికి మంచి జరిగితే.. అది నాకెంతో సంతోషానిస్తుంది'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కాగా.. సార్వత్రిక ఎన్నికల్లో వయనాడ్, రాయ్‌బరేలీ సీట్లలో రాహుల్ గాంధీ గెలుపొందిన సంగతి తెలిసిందే. వయనాడ్‌ను వదులుకోవడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ తొలిసారి అడుగు పెట్టారు. విజయం సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నవంబరు 13న పోలింగ్ జరగనుంది.

'గృహలక్ష్మి' పథకాన్ని త్వరలోనే నిలిపేస్తుంది

జెడి(ఎస్)అగ్రనేత హెచ్‌డి.దేవగౌడ ఆరోపణాస్త్రం

రామనగర (కర్నాటక) : దివాలా తీసిన కర్నాటక ప్రభుత్వం త్వరలోనే గృహలక్ష్మి పథకాన్ని నిలివేస్తుందని జెడి(ఎస్) పితామహుడు. మాజీ ప్రధానమంత్రి హెచ్‌డి.దేవగౌడ ఆరోపించారు. బిజెపి, జెడి(ఎస్) పార్టీలు రెండూ కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని గ్యారెంటీలు ఆగిపోవాలని కోరుకుంటున్నాయని కర్నాటక ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై ఆయన వెంటనే ప్రతిస్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఐదు గ్యారెంటీలలో గృహలక్ష్మి పథకం ఒకటి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న(బిపిఎల్)కుటుంబాలకు చెందిన మహిళలకు రూ.2,000 మొత్తం అందజేసేందుకు ఉద్దేశించిన పథకమే గృహలక్ష్మి పథకం అనే విషయం తెలిసిందే. ఆదివారంనాడు జరిగిన ఒక ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి హెచ్‌డి.దేవగౌడ ప్రసంగిస్తూ 'కాంగ్రెస్ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు గృహలక్ష్మి పథకం కింద నగదును బ్యాంక్ అకౌంట్లలో వేసేందుకు ప్రభుత్వం వద్ద నిధులు ఏమీ లేవు. కానీ ఎన్నికలపై కన్నేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చెన్నపట్న అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళల అకౌంట్లలో మాత్రం డబ్బు వేసింది' అని దేవగౌడ అన్నారు. జెడి(ఎస్) తరపున పోటీలో నిలిచిన తన మనవడు, అభ్యర్థి నిఖిల్ కుమారస్వామి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. నిఖిల్ కుమారస్వామికి ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను దేవగౌడ అభ్యర్థించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దివాలా తీసిందని, ఎన్నికల తర్వాత వారు డిపాజిట్లలో డబ్బుజమచేయడం మళ్లీ ఆపివేస్తారని జోస్యం చెప్పారు.

ప్రధాని మోదీ, అమిత్ షా బ్యాగులను చెక్ చేశారా? : ఉద్ధవ్

యావత్మాల్: ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు యావత్మాల్‌కు రాగా అధికారులు తన బ్యాగ్ తనిఖీ చేశారని శివసేన (యూబీటీ) చీఫ్, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర సీనియర్ నేతల బ్యాగులనూ ఎన్నికల అధికారులు చెక్ చేయాలన్నారు. తనకు ఎదురైన ఈ అనుభవాన్ని యావత్మాల్‌లోని వనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో షేర్ చేసుకున్నారు. హెలికాప్టర్‌లో వనీకి చేరుకోగా.. కొందరు ఎన్నికల అధికారులు వచ్చి తన బ్యాగ్‌ను తనిఖీ చేశారని ఉద్ధవ్ తెలిపారు. బ్యాగ్‌ను తనిఖీ చేయడంపై మండిపడ్డారు. ఎన్నికల అధికారులమీద తనకు కోపం లేదన్న ఆయన.. ''మీరు మీ బాధ్యతలను అనుసరిస్తున్నారు. నేను నా బాధ్యతను నిర్వర్తిస్తున్నా. నా బ్యాగును తనిఖీ చేసినట్లే.. ప్రధాని మోదీ, అమిత్ షా బ్యాగులను చెక్ చేశారా? సిఎం ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సిఎంలు అజిత్ పవార్, దేవేంద్ర ఫడణవీస్ బ్యాగుల్ని తనిఖీ చేశారా? అని ప్రశ్నించారు.అధికారులు తనిఖీ చేస్తున్న వీడియోను శివసేన (యూబీటీ) తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసింది.

అవినీతిలో కూరుకుపోయిన బిజెపి, దాని మిత్రపక్షాలు

చరిత్రను వక్రీకరించి ప్రచారం చేస్తున్నాయ్ : సుప్రియ సూలే

పుణె : మహారాష్ట్రలో అధికార బిజెపి, దాని మిత్రపక్షాలు అవినీతిలో కూరుకుపోయాయని ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియ సూలే విమర్శించారు. మహారాష్ట్రలో ప్రజాదరణ పొందిన వారిని అవమానపరుస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సూలే పుణెలో మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో బిజెపి,దాని భాగస్వామ్యపక్షాలు ప్రతిపక్షాల గురించే మాట్లాడుకునేందుగా ఏమీ లేవన్నారు. గత ఎన్నికల్లో అవినీతి వంటి అంశాలైనా ఉండేవని, కానీ ఈ సారి ఏమీలేవని, ఎందుకంటే స్వతహాగా వారే అవినీతిలో కూరుకుపోయారని విమర్శించారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడుకునేందుకు బిజెపి, దాని మిత్రపక్షాలకు ఏమీ దొరకడం లేదని చెప్పారు. ప్రతిపక్ష ఎంవిఎ లడ్కీ బెహిన్ వంటి అధికార కూటమి పథకాలను కాపీ చేసి ప్రతిపక్షాల మేనిఫెస్టోలో చేర్చుస్తుందని 'మహాయుతి'కూటమి పేర్కొనడంపై సూలే స్పందించారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్, ఎన్‌సిపి రైతులకు పెద్ద ఎత్తున రుణాలు మాఫీ చేసిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించింది ఈ రెండు పార్టీలేనన్నారు. ఎంవిఎ ప్రత్యర్థులు లేవనెత్తుతున్న 'అర్బన్ నక్సల్స్', రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తున్న 'రెడ్‌బుక్'పై సూలే మాట్లాడుతూ బిజెపిది మహిళా వ్యతిరేక మనస్థత్వం అని చురకలంటించారు. కాగా, ఛత్రపతి శివాజీ మహారాజ్, సాహు మహారాజ్, మహాత్మా ఫూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వంటి యోధులను కూడా అవమానపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి చరితను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారన్నారు. కొల్హాపూర్‌లో మహిళలను బిజెపి ఎంపిలు బెదిరిస్తున్నారని, దీనిపై ప్రతిపక్షాలు కోర్టుకు వెళ్తాయని, ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తాయని సూలే స్పష్టం చేశారు.

రూ.2,94,427కోట్లతో ఎపి బడ్జెట్

రెవెన్యూ వ్యయం అంచనా 2,35,916 కోట్లు
మూలధన వ్యయం అంచనా 32,712 కోట్లు
ద్రవ్యలోటు 68,742కోట్లు
తొలిసారి మొదటిరోజే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి కేశవ్

అమరావతి: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా చెపుతున్న రాష్ట్ర ప్రభుత్వం సమతూకాన్ని పాటిస్తూ 20242025 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,94,427.25 కోట్లతో అసెంబ్లీలో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. శాసన సభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిసారి అసెంబ్లీ సమావేశాల ప్రారంభరోజునే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దాదాపు ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలల పాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మీదే పాలన కొనసాగించిన కూటమి సర్కార్ నెలాఖరుకుగడువు ముగుస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు పూర్తిస్థాయి బడ్జెట్‌ను రూ.2,94,427కోట్లతో మంత్రి పయ్యావుల సభలో ప్రతిపాదించారు.ఇందులో రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,35,916.00 కోట్లుగా, మూలధన వ్యయం అంచనా రూ.32,712.84కోట్లుగా, ద్రవ్యలోటు రూ.68,742.65కోట్లుగా ప్రతిపాదించారు. రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రెవెన్యూ లోటు 4.19శాతంగా, ద్రవ్యలోటు 2.12 శాతంగా ఉండవచ్చునని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని కాపాడాలని అపూర్వమైన తీర్పును ఇచ్చిన ప్రజల సంకల్పానికి ఈ బడ్జెట్ ప్రతిబింబమని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ దుష్పరిపాలన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయడం నైతిక కర్తవ్యంగా భావించి ఏడు శ్వేతపత్రాల ద్వారా వెల్లడించామని తెలిపారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల దుర్వినియోగం, వనరుల మళ్ళింపు, లోపభూయిష్టమైన ఇసుక, ఎక్సైజ్ విధానాలు, పరిమితికి మించి అధిక వడ్డీరేట్లకు రుణాలు తీసుకోవడం, స్థానిక సంస్థలు, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు మళ్లింపు, ఇంధనరంగం విధ్వంసం, కొత్తగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఏర్పాటు ద్వారా కార్పొరేషన్‌ల నిధులు దుర్వినియోగం, ఉద్యోగులకు, కాంట్రాక్టర్లకు పెద్దఎత్తున బిల్లుల బకాయిలు వంటివి తమ ప్రభుత్వానికి సవాళ్లుగా మారాయని మంత్రి వివరించారు. ఈ కారణాల వల్ల తొలిసారి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర అస్తవ్యస్తమైందని, దీనిని గాడిన పెట్టి రాష్ట్ర ప్రగతిని పున:నిర్మించడం ఇప్పుడు తమపై పడిందన్నారు. 'ప్రతి సంక్షోభాన్ని అంకితభావంతో, సృజనాత్మకతతో నిబద్ధత, కృషితో అవకాశంగా మార్చుకోవాలని' ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే మాటలే ప్రేరణగా అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎన్ని ఆర్థిక సవాళ్లు ఎదురైనా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకానికి నిధులు కేటాయించి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 112వ తరగతి విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. శాసనసభ ప్రారంభం కాగానే ఉదయం 10గంటలకు సభ ప్రారంభం కాగానే బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన మంత్రి పయ్యావుల...'సరళమైన ప్రభుత్వంప్రభావవంతమైన పాలన' అనే సూత్రంతో పాలనను క్రమబద్ధీకరించడమే తమ ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొంటూ స్వామి వివేకానందుని స్ఫూర్తిదాయకమైన మాటలతో మంత్రి తన బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు.

లోటు భర్తీ ఎలా చేస్తారు?

సిపిఐఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాష్ట్ర బడ్జెట్‌లో ద్రవ్య లోటు రూ.68,742.65 కోట్లుగా, రెవెన్యూ లోటు రూ.34,712.84 కోట్లుగా చూపారని, ఈ లోటును ఏ రకంగా భర్తీ చేస్తారో చెప్పలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. 2024 25 ఆర్థిక సంవత్సరానికి 2,94,427.25 కోట్లతో నేడు అసెంబ్లీలో ఆర్థిక మంత్రి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని, కేవలం నాలుగు నెలలకు మాత్రమే ప్రవేశపెడుతున్న బడ్జెట్ అని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగం మొదట్లోనే ఆర్థిక మంత్రి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని చెప్పారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదని చెబుతూనే ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ కంటే ఈ బడ్జెట్ మొత్తాన్ని అధికంగా చూపారన్నారు. విద్యుత్ రంగం విషయంలో ప్రజల పైన భారాలు పడుతున్నాయని, ప్రజలపై విద్యుత్ భారాలు మోపకుండా పరిష్కారం చూపలేకపోయారని వివరించారు. ఇరిగేషన్ రంగానికి మాత్రం సమగ్ర ప్రాధాన్యత ఇచ్చారని, లోటు పూడ్చడానికి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునేందుకు ప్రయత్నించాలని, ఉన్నత విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. తిరుపతి, అమరావతి, విశాఖపట్నం విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారని, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, సిబ్బంది కొరత ఉందని, విశ్వవిద్యాలయాల అభివద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోస్తా ప్రాంతంలో వ్యవసాయాన్ని చక్కబెడుతున్న కౌలుదార్ల సమస్యలను ప్రభుత్వం ప్రధాన దృష్టి పెట్టలేదన్నారు. కౌలుదారులకు కొత్త చట్టం తెస్తున్నామనే పేరుతో క

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
మంగళవారం, నవంబరు 12

ఝార్ఖండ్‌లో ఆదివాసీలే కీలకం

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిదశ పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. అసెంబ్లీలోని 81సీట్లలో 43కు 13వ తేదీ పోలింగ్ జరుగుతుంది. మిగిలిన 38కి మరో వారంలో – నవంబర్ 20వ తేదీన పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 20వ తేదీ పోలింగ్ జరిగే మహారాష్ట్రతోపాటు 23వ తేదీన ఫలితాలు వెలువడతాయి. రెండు రాష్ట్రాల్లోనూ బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ, ఇండియా కూటమి మధ్య హోరాహోరీ పోరాటం జరుగుతోంది. ఝార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీలోని 81 సీట్లలో 28 షెడ్యూల్డు తెగలకు, 9 షెడ్యూల్డు కులాలకు రిజర్వు చేయబడినాయి. ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) – కాంగ్రెస్ – ఆర్‌జెడి – సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఎన్‌డిఎ కూటమి భాగస్వాములుగా పోటీ చేస్తున్నాయి. సిపిఐ, సిపిఐ(ఎం) ఎవరికి వారు పోటీ చేస్తున్నారు.

జెఎంఎం–కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంనుండి రాష్ట్రాన్ని తమ ఖాతాలో వేసుకోవటానికి బిజెపి తీవ్రంగా శ్రమిస్తోంది. ముఖ్యంగా ఆదివాసీల్లో చీలికతేవటం ద్వారా అసెంబ్లీలో ఆధిక్యత సంపాదించాలని యత్నిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్ తదితర బిజెపి నాయకులు ముమ్మర ప్రచారం చేశారు. వారి అభిమాన ఆరోపణలు – బంగ్లాదేశీయుల వలసలు, ప్రభుత్వ అవినీతి, నిరుద్యోగం వగైరా. బంగ్లా చొరబాటుదారులకు ఆశ్రయం ఇవ్వటంవల్ల ఆదివాసీ ప్రాంతాల్లో ముఖ్యంగా సంతాల్ పరగణాల్లో జనాభాలో వారి సంఖ్య పెరిగిపోయింది. ఇది ఆదివాసీలకు నష్టం చేస్తుందంటున్నారు. అయితే ఝార్ఖండ్ బంగ్లాదేశ్‌తో అంతర్జాతీయ సరిహద్దు ఉన్న అస్సామో, పశ్చిమ బెంగాల్‌లో కాదు. పైగా విదేశీ వలసల ను నిరోధించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదైనందున ఈ విషయంలో ప్రధాని వగైరాలు గొంతుచించుకోవటం వారి అసమర్థతనే బయట పెడుతుంది. అయితే ముస్లింల పేరెత్తకుండా ముస్లిం వ్యతిరేకతను నూరిపోసే దుర్బుద్ధి ఇందులో లేకపోలేదు. ఝార్ఖండ్ జనాభాలో ముస్లిం లు దాదాపు 15 శాతం ఉంటారు. మరోవైపున, హిందువుల ఐక్యత కోసం బిజెపి నాయకులు విజ్ఞప్తులు చేస్తున్నారు.

ఆదివాసీ ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు బిజెపి జెఎంఎం నేత చంపై సోరెన్‌ను తమ గూటికి రాబట్టుకోవటమేగాక, వారికి మరో రాయితీ ప్రకటించింది. దేశం మొత్తానికి, పౌరులందరికీ వర్తింపజేసే ఉమ్మడి పౌరస్మృతి తెస్తానంటున్న బిజెపి, అందులో నుంచి ఆదివాసీలకు మినహాయింపు యిస్తానని ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించింది. ఆవు మాంసం భక్షణపై నిషేధం సందర్భంలోనూ అది ఈశాన్య ప్రాంతంలోని క్రైస్తవులకు మినహాయింపు ఇచ్చింది. ఇదే వారి పచ్చి అవకాశవాదం. ఓట్లకోసం ఎక్కడపాట అక్కడ పాడతారు. బిజెపి మద్దతుదారులుగా ఉన్న ఝార్ఖండ్ యేతరులే 'బంగ్లాదేశ్ ముస్లిం చొరబాటుదారులను' బాచిగా ప్రచారం చేస్తున్నారని జెఎంఎం నేతలు కొట్టిపారేస్తున్నారు. ఎందుకంటే ఇక్కడి ఖనిజ సంపదను నిరాఘాటంగా దోచుకోవటానికి వారు బిజెపి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

ఒబిసి మహతో సముదాయాలది ఈ రాష్ట్రంలో పెద్ద సమస్య. వారు ఝార్ఖండీయులు, ఆదివాసీయేతర ప్రజల్లో అతిపెద్దభాగం; జనాభాలో 25 శాతం. వారు ఎస్‌టి ప్రతిపత్తి డిమాండ్ చేస్తున్నారు. సాంప్రదాయకంగా బిజెపి మద్దతుదారులు. వారికి ఆ హోదా ఇస్తే తమ రిజర్వేషన్ వాటా కోతపడుతుందని ఆదివాసులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రప్రభుత్వం ఇంతవరకు మహతోల డిమాండ్‌ను అంగీకరించలేదు. బిజెపి నాయకుడు, మాజీ కేంద్రమంత్రి అర్జున్ ముండా తమ ఎస్‌టి ప్రతిపత్తి డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్నందున వారిలో చాలామంది బిజెపి పట్ల ఆగ్రహంతో ఉన్నారు.

కాంగ్రెస్ కులగణన డిమాండ్ అత్యంత వెనుకబడిన తరగతుల్లోకి వెళుతున్నది. దీన్నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రధానమంత్రి, దాన్ని నేరుగా వ్యతిరేకించలేక, ఒబిసిలు, ఎస్‌టిలు, ఎస్‌సిల ఐక్యతను భగ్నం చేయటానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, వారి రిజర్వేషన్‌లు లాక్కొని ముస్లింలకు ఇవ్వజూస్తున్నదని నిందారోపణకు దిగారు.

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నట్లుగా, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా ఇప్పటికే బిజెపి అధీనంలోకి వచ్చాయి. ఇప్పుడు ఝార్ఖండ్ స్వాధీనానికి యత్నిస్తున్నది. ఈ మూడు ఖనిజ సంపదకు పేరొందిన రాష్ట్రాలు. బిజెపి అధికారంలోకి వస్తే వారి అభిమాన ఎగ్రూపునకు ఆ సంపద కట్టబెడతారు. కాబట్టి ఇతర ప్రగతికాములతోపాటు ఆదివాసీలు అప్రమత్తులై బిజెపిని ఓడించకపోతే వారు తమ భవిష్యత్‌ను కోల్పోతారు.

ట్రంప్ ఆసియా వ్యూహంలో భారత్‌కు ప్రాధాన్యత

ఎం.ఎ.హొస్సైన్

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత నుండీ బ్రిటన్ (యునైటెడ్ కింగ్‌డమ్)ను అమెరికా తమ చిట్టి తమ్ముడుగా పరిణిస్తూ వచ్చింది. ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో, ఆ తర్వాత కూడా ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలో రాజకీయంగా, సైనికంగా ఈ రెండు దేశాలమధ్య సన్నిహిత మిత్రత్వం, పరస్పర ప్రయోజనాలు కొనసాగాయి. ప్రపంచంలో సరికొత్త భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడంతో ఆర్థికశక్తి ఇప్పుడు ఆసియావైపు మళ్ళింది. ఈ నూతన ముఖచిత్రం నేపథ్యంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు భారతదేశం ఒక కీలక మిత్రదేశంగా రూపుదిద్దుకుంటున్నది. ప్రత్యేకించి చైనా ప్రభావాన్ని ప్రతిఘటించేందుకు, ఆసియాలో సైనిక బలగాల సమతుల్యం సాధించే ప్రయత్నంలో ఈ పరిణామం సంభవించింది. దీని ఫలితంగా అమెరికా అనుసరిస్తున్న విదేశాంగవిధానంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అగ్రభాగాన కనిపిస్తున్నారు. ప్రపంచంలో అతికీలకమైన ఆసియా ప్రాంతంలో పెరుగుతున్న అమెరికా ప్రయోజనాలను కాపాడుకునేందుకు పావులు కదుపుతున్న ట్రంప్ పాలనాయంత్రాంగం నరేంద్రమోదీకి ఇస్తున్న మద్దతుకు ఎంతో ప్రాముఖ్యంగా ఉంది. 2017లో తన మొదటి విడత పరిపాలనాకాలం ప్రారంభమైనప్పుడు సముద్ర మార్గాల భద్రత, ఉగ్రవాద ప్రతిఘటన, ఆయుధ పోటీ, ఇతర సైబర్ నేరాల నియంత్రణకు డోనాల్డ్ ట్రంప్ తన ఇండో – పసిఫిక్ ప్రాంత వ్యూహాన్ని, అమెరికా ప్రయోజనాలను మరింత బలంగా నొక్కిచెప్పారు.నాటో మిత్రులతో సముద్రాంతర సంబంధాలు కొనసాగిస్తూనే, యూరోపియన్ దేశాలే కేంద్రంగా అప్పటివరకూ అనుసరించిన వైఖరికి భిన్నంగా ఆనాడు ట్రంప్ ఆసియాలో విభజనలు సృష్టించే కూటముల నిర్మాణానికి ఈ కొత్త వ్యూహం ముందుకు తెచ్చారు. ముఖ్యంగా చైనా ఆర్థిక విస్తరణవాదాన్ని, భౌగోళిక ప్రభావాన్ని అడ్డుకునేందుకు ట్రంప్ ఎనిమిదేళ్ళక్రితమే దృష్టి సారించారు. చైనా కేవలం తన ప్రధాన పోటీదారుమాత్రమే కాదనీ, అమెరికా అధిపత్యానికి ఒక పెద్ద బెదరగా తయారైందని భావించిన ట్రంప్ అంతవరకూ అమెరికాను పాలించిన నాయకుల తరహాలో కాకుండా చాలా భిన్నమైన, స్పష్టమైన వైఖరి అనుసరించారు.

ట్రంప్ అనుసరిస్తు ఈ స్పష్టమైన విధానంలో కొత్త ప్రధాన కారకం ఏమిటంటే భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఆయన వ్యక్తిగత అనుబంధం. సైద్ధాంతికంగా కూడా ఈ ఇద్దరి నాయకుల మధ్య పోలికల ఆకర్షణశక్తి ఉంది. ప్రత్యేకించి జాతీయవాదం, ఆర్థిక స్వావలంబన విషయంలో వారిద్దరి వైఖరులూ ఒక్కటే. ట్రంప్ పాలనాయంత్రాంగంలో భారతీయ సంతతికి మరిన్ని ప్రభావవంతమైన ఆధిపత్యస్థానాలను కట్టబెట్టడం ద్వారా దక్షిణాసియా మిత్రత్వం మరింతగా భవిష్యత్‌లో బలపడే అవకాశం ఉంది. భారత భౌగోళిక, ఆర్థిక ప్రాధాన్యతంతా బంగాళాఖాతంలో ఉన్న విస్తారమైన ఖనిజ సంపదతో ముడిపడి ఉంది. ఇది ఈ ప్రాంతంలో తన ప్రభావాన్ని విస్తరించడానికి అమెరికాకు వ్యూహాత్మకంగా ఎంతో ప్రయోజనకరమైనది. భారతదేశంతో మరింత సన్నిహితంగా కలసిమెలసి ఉంటే హిందూమహాసముద్రంలో, దాని పరిధిని మించిపోయి కూడా చైనాతో సమానంగా శక్తిమంతమైన సమతౌల్యాన్ని సాధించవచ్చునని ట్రంప్ కోరుకుంటున్నారు. దేశీయ ఆర్థిక ప్రయోజనాలను పునరుద్ధాటించే విధంగా ఆమెరికా విదేశాంగ విధానాన్ని పునర్నిర్మించడమే మౌలికంగా డోనాల్డ్ ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానం. ఇండో – పసిఫిక్ ప్రాంతం ద్వారా 70 శాతం ప్రపంచ వాణిజ్యం కొనసాగుతూ ఉంటుంది. అందువల్ల ఈ ప్రాంతం ట్రంప్ ఎజెండాలో అత్యంత కీలకమైనది. హిందూ మహాసముద్రంలో శక్తిమంతమైన నావికాదళ ఉనికిగల భారత్, అంతర్జాతీయ సముద్ర మార్గాల పరిరక్షణలో కీలకపాత్రధారిగా ఉన్న అమెరికాకు ఒక అత్యంత విలువైన మిత్రదేశంగా రూపుదిద్దుకుంది. దక్షిణ చైనా సముద్రంలో, హిందూ మహాసముద్రంలో చైనా సామూహిక సైనిక ఉనికిని ప్రతిఘటించేందుకు అమెరికాకు ఈ ప్రాంతంలో భారత్ ఒక ప్రభావశీలమైన భాగస్వామిగా ఉండగలదు. ట్రంప్ పరిపాలనాకాలంలో ఈ విధమైన భాగస్వామ్యం రెండు దేశాలమధ్య మరింతబలంగా వేళ్ళూనుకోగలదని అమెరికా అంచనావేస్తున్నది. ఆసియాలో భద్రతకు, స్థిరత్వ సాధనకు ఇది చెక్కుచెదరని ఒక బలమైన పునాదిగా ఉపయోగపడుతుందని అమెరికా అంచనావేస్తున్నది. అందువల్ల ట్రంప్ రెండో విడత పరిపాలనాకాలంలో సైనిక–వ్యూహాత్మక రంగాలలో గతంకంటే మించిన స్థాయిలో భారత్‌పై అమెరికా సానుకూలవైఖరి పొంగిపొర్లిపోయే అవకాశం ఉంది. చైనా భౌగోళిక రాజకీయ ఆశయాలను గణనీయమైనస్థాయిలో అడ్డుకునే చర్యలకోసం రెండు దేశాలకూ బలమైనశక్తిసామర్థ్యాలు సమకూరుతాయి. తద్వారా భారత్–అమెరికా మధ్య సంబంధాలు గట్టిపడేందుకు ఇండో–పసిఫిక్ వ్యూహం ఒకమూలస్తంభంగా నిలుస్తుంది.

బంగ్లాదేశ్‌పై ట్రంప్ ప్రభావం... మహ్మద్ యూనుస్‌కు మొండిచేయి!

అమెరికా అధ్యక్ష భవనంలోకి ట్రంప్ పునరాగమనం దక్షిణాసియా రాజకీయ ముఖచిత్రంలో ప్రత్యేకించి బంగ్లాదేశ్ రాజకీయాల

లో చిరు కంపనలు సృష్టిస్తుంది. కొంతమంది విశ్లేషకుల ప్రకారం ఢాకా–వాషింగ్టన్ సంబంధాల్లో ట్రంప్ రెండోవిడత పాలన ప్రభావం చాలా పరిమితమే. ఐతే ఇలాంటివన్నీ పూర్తిగా తప్పుడు అంచనాలేనని ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. 2016లో కొంతమంది బంగ్లాదేశ్ సంతతికి చెందిన అమెరికన్లతో ట్రంప్ జరిపిన సమావేశంలో, సునిశితమైన జ్ఞాపకశక్తితో బంగ్లాదేశ్ రాజకీయ ముఖచిత్రంపై ట్రంప్ తనదైన ముద్రవేసి ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం షేక్ హసీనాస్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న మహ్మద్ యూనుస్‌కు అమెరికాలో తన రాజకీయ ప్రత్యర్థి క్లింటన్ ఫౌండేషన్‌కు చెందిన హిల్లరీ కుటుంబ సంస్థ ప్రధాన దాతలుగా ఉన్నారని ట్రంప్‌కు బాగా తెలుసు. క్లింటన్, ఒబామా, జార్జ్ సోరోస్‌లతో ట్రంప్‌కు దీర్ఘకాలంగా రాజకీయ విభేదాలున్నాయి. వారితో ఉండే ఎలాంటి అనుబంధాన్నైనాగానీ ట్రంప్ శత్రుత్వంతోనూ, అనుమానాస్పదంగానే చూస్తారు. మీడియాలో వచ్చిన కొన్ని వార్తల ప్రకారం, హిల్లరీ క్లింటన్, ఆమె భర్త బిల్ క్లింటన్ కూడా మహ్మద్ యూనుస్‌కు సంబంధించిన 'గ్రామీణ అమెరికా' వంటి బిజినెస్ వెంచర్లలో భాగస్వాములుగా ఉన్నారు. ప్రత్యేకించి ఒకవేళ ట్రంప్ గనుక ఆర్థికపరమైన జరిమానాలు విధించాలని నిర్ణయించుకుంటే యూనుస్ అనుసరిస్తున్న ఈ విధమైన సైద్ధాంతిక వైఖరి బంగ్లాదేశ్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపించవచ్చు. 2017లో ట్రంప్ అనేక దేశాలపై వాణిజ్య ఆంక్షలు విధించారు. అదేతరహాలో బంగ్లాదేశ్ చేసే ఎగుమతులపై కూడా ట్రంప్ దండనాత్మక సుంకాలు విధించే అవకాశం ఉంది. దీనివల్ల బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రత్యేకించి రెడీ మేడ్ గార్మెంట్స్ (ఆర్ఎంజి) రంగంపై ఈ ప్రభావం పడుతుంది. ఎందుకంటే బంగ్లాదేశ్ ఆర్థిక స్థిరత్వానికి ఈ రెడీ మేడ్ గార్మెంట్స్ రంగం ద్వారా జరిగే ఎగుమతులే ప్రధానమైన వనరు. అందువల్ల బంగ్లాదేశ్‌లో తనకు అనుకూలమైన ప్రభుత్వం ఉండాలని ట్రంప్‌కు బలమైన ఉద్దేశాలుండే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ రాజకీయ భవిష్యత్తును ట్రంప్ అనుకూల ఆకృతిలో తీర్చిదిద్దేందుకు నరేంద్రమోదీ పాత్ర వహించాలని కూడా ట్రంప్ కోరుకునే అవకాశాలుంటాయి. దీనివల్ల బంగ్లాదేశ్‌లో భారత్–అమెరికా సంయుక్త వాణిజ్య వెంచర్లకు ద్వారాలు తెరచుకోవచ్చుకూడా. భారత్ నుండి బంగ్లాదేశ్‌కు నేపాలీ జలవిద్యుత్ వనరులను అనుసంధానం చేసే ఎనర్జీ ప్రాజెక్టులను అమెరికా కంపెనీలు చేపట్టవచ్చుకూడా. జో బైడెన్ పరిపాలనాకాలంలో బంగ్లాదేశ్‌కు స్థిరమైన మానవతాసహాయాన్ని అమెరికా చేసింది. ప్రత్యేకించి రోహింగ్యా సంక్షోభం విషయంలో అమెరికా మద్దతు ఇచ్చింది. మరోవైపు ట్రంప్ ఇందుకు భిన్నంగా మానవతాసహాయం కంటే ఆర్థిక లక్ష్యాలకే ప్రాధాన్యం ఇచ్చే వైఖరి చేపట్టే అవకాశం ఉంది. వలసలపైన ట్రంప్ కఠిన వైఖరి, అంతర్జాతీయ మానవతాసహాయ కృషిపై సంశయ, సందేహాత్మక వైఖరి కూడా రోహింగ్యాల సంక్షోభ భవితవ్యంపై ప్రభావం చూపిస్తాయి. ఈ శరణార్థులను తృతీయ ప్రపంచ దేశాలలోకి పంపి పునరావాసం పొందేవిధంగా చేయాలన్న మహ్మద్ యూనుస్ ఆలోచనలకు ట్రంప్ పాలనాయంత్రాంగం నుండి ఎలాంటి మద్దతు లభించే అవకాశం ఉండకపోవచ్చు. దీనితోపాటే బంగ్లాదేశ్ రాజకీయ, మతదృశ్యాన్ని ట్రంప్ ఆలోచనలకు అనుగుణంగా మలిచేందుకు జాతీయ హిందూ దళారీ గ్రూపులు ప్రయత్నం చేస్తున్నాయి. ఈ విషయాల్లో గనుక ట్రంప్ ప్రభావితుడైతే ఆయన పాలనాయంత్రాంగం కూడా మతస్వేచ్ఛ విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వంపట్ల కీలక, కఠిన వైఖరి అనుసరించగలదు. ఈ దక్షిణాసియా ప్రాంతంలో ఒక క్రైస్తవ రాజ్యాన్ని సృష్టించేందుకు బలమైన ప్రయత్నాలు చేస్తున్న మయన్మార్‌కు చెందిన ప్రభుత్వేతర సంస్థ అరకన్ ఆర్మీ వంటి వాటితో కూడా ట్రంప్ పాలనాయంత్రాంగం కుమ్మక్కై వారికి మద్దతు ఇచ్చే అవకాశాలు లేకపోలేదు. ఈ విధమైన పరిణామాలు బంగ్లాదేశ్‌ను మరింత బలహీనపడేట్టు చేస్తాయి. అమెరికా తన వ్యూహాత్మక ప్రయోజనాలకోసం సంక్లిష్టమైన రాజకీయాలకు పాల్పడవచ్చు. ప్రపంచ భౌగోళిక రాజకీయ దృశ్యం ఒకవైపు నుండి మరోవైపు మళ్ళడంతో అమెరికా విదేశాంగ విధానంలో ఇండో–పసిఫిక్ ప్రాంతానికి సరికొత్త ప్రాధాన్యత ఏర్పడింది. యూరప్ కేంద్రంగా ఉన్న వైఖరి దక్షిణాసియా వైపు ప్రత్యేకించి కీలక భాగస్వామి భారత్ వైపు మళ్ళే స్పష్టమైను పునఃపొందికలు ట్రంప్ అధ్యక్షపదవీకాలంలో సంభవిస్తాయి. అదేసమయంలో దీర్ఘకాలంగా అమెరికా ''చిట్టి తమ్ముడు''గా ఉన్న బ్రిటన్ పోషించిన కీలకపాత్రను ఆసియాలో భారత్‌కు ట్రంప్ అప్పగించే సంకేతాలు కనిపిస్తున్నాయి. మోదీ నాయకత్వం ట్రంప్ జాతీయవాద ప్రాధాన్యతలకు సన్నిహితంగా ఉంటుంది. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక సంబంధాలు అనే ప్రాతిపదికపై ఈ అనుబంధం వృద్ధిచెందుతుంది.

భారత్–అమెరికా మధ్య సంబంధాలు, సైనిక, ఆర్థిక సహాయం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆశయాలకు దీటైన శక్తిగా ఉండే దిశగా తీర్చిదిద్దుకుంటాయి. ఒక మిత్రదేశంగానే కాకుండా దక్షిణాసియా ప్రాంతం అంతటా పరస్పర ప్రగతిని ప్రోత్సహించి, స్థిరత్వాన్ని రక్షించే భాగస్వామిగా భారత్–అమెరికా సంబంధాలలో ఒక నూతన అధ్యాయానికి తెరలేపేందుకు ట్రంప్ విధానాలు రంగం సిద్ధం చేస్తున్నాయి. ఈ కారణాలవల్ల అమెరికాకు బ్రిటన్ స్థానంలో భారత్ ఒక అత్యంత ఇష్టమైన మిత్రుడుగా రూపుదిద్దుకుంటున్నట్లు కనిపిస్తున్నది. ఇందుకు ప్రముఖంగా చెప్పుకోవాల్సిన కారణం ఇండో – పసిఫిక్ ప్రాంతంలో ఈనాడు ఉన్న భౌగోళిక రాజకీయ పరిణామాలే.

(అరేబియన్ పోస్ట్ సహకారంతో)

(ఐపిఎ సర్వీస్)

సమస్యల పరిష్కారానికి
ఆత్మహత్యలే శరణ్యమా?

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటిలో స్వాతిప్రియ అనే విద్యార్థిని సోమవారం (నవంబర్ 11) ఆత్మహత్య చేసుకోవడం మరోసారి దేశం ఎదుర్కొంటున్న అత్యంత ప్రధాన సమస్యను తెరపైకి తెచ్చింది. దేశంలో విద్యార్థుల ఆత్మహత్యల రేటు దేశ జనాభా పెరుగుదల రేటును అధిగమించిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ఇదివరకే విద్యార్థుల ఆత్మహత్యలపై నివేదికను వెల్లడించింది. విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటు న్న కేసుల పెరుగుదలను సూచిస్తున్న గణాంకా లు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఆత్మహత్యల రేటు ఏటా రెండు శాతం చొప్పున పెరుగుతుండగా, విద్యార్థుల ఆత్మహత్య కేసులు 4శాతం పెరిగాయి. గత రెండు దశాబ్దాలుగా విద్యార్థుల ఆత్మహత్యలు జాతీయ సగటు రేటు కంటే ఎక్కువ స్థాయిలో నమోదు అవుతున్నాయి. చదువు ఒత్తిళ్ల కారణంగా కొందరు... ప్రేమ పేరు తో ఎదురవుతున్న బెదిరింపులకు భయపడి మరి కొందరు.. ప్రేమ విఫలమైందని ఇంకొందరు.. కారణం ఏదైతేనేం, తీసుకుంటున్న నిర్ణయం మాత్రం ఒకటే. సమస్య పరిష్కారానికి ఆత్మహత్యే శరణ్యమనే భావనే. గత దశాబ్దకాలంలో 0 నుంచి 24 సంవత్సరాల మధ్య వయసు గలవారి జనాభా 582 మిలియన్ల నుంచి 581 మిలియన్లకు తగ్గితే, విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య మాత్రం 6,654 నుండి 13,044కి పెరిగింది.

మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థు లు ఎక్కువగా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు ఐసి3 ఇన్‌స్టిట్యూట్ అనే స్వచ్ఛంద సంస్థ నివేదిక వివరిస్తున్నది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న కేసుల్లో, ఈ మూడు రాష్ట్రాల వాటా మూడింట ఒక వంతు. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కలిపినా ఇంతకంటే తక్కువ (29శాతం) వాటా ఉంది. కాగా, విద్యాపరమైన ఒత్తిళ్లు ఎక్కువగా ఉన్న రాజస్థాన్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నారు. ప్రత్యేకించి కోటా వంటి కోచింగ్ హబ్

లలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఇలావుంటే, విద్యార్థుల ఆత్మహత్యలపై పూర్తి సమాచారం అందడం లేదన్న వాద న ఉంది. ఎన్‌సిఆర్‌బి సైతం ఈ విషయాన్ని అంగీకరిస్తున్నది. సమాజంలో గౌరవ ప్రతిష్టల నుంచి చట్టబద్ధమైన చిక్కుల వరకూ అనేకానేక కారణాల తో విద్యార్థుల ఆత్మహత్యలను సహజ మరణాలు గా చూపిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. స్వాతిప్రియ బలవంతపు మరణాన్ని వేలాది కేసుల్లో ఒకటిగా పరిగణించవచ్చు... జాబితాలో మరో పేరుగా భావించవచ్చు. కానీ, ఆ విద్యార్థిని కలలు అర్ధాంతరంగా ఆగిపోవడానికి, లక్ష్యాలు ఎన్నటికీ చేరలేనివిగా మారిపోవడానికి కారణం ఎవరు? ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితు లు, సన్నిహితులు ఎదుర్కొనే మానసిక క్షోభకు ఓదార్పు ఎక్కడ? విద్యార్థుల బలవన్మరణాలకు కారణాలను బహిరంగంగా చర్చించకపోతే, చిన్నచిన్న సమస్యలనే పరిష్కారం లేనివిగా అనుమానించి, భయపడి ప్రాణాలు తీసుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతునే ఉంటుంది. యువత మానసి క పరిస్థితులను అర్థం చేసుకొని, వారిపై ఒత్తిడి పెంచకుండా ఉండడం వల్ల ఆత్మహత్యలను కొంతవరకూ తగ్గించవచ్చు. వారి ఆశయాలను, ఆకాంక్షలను తెలుసుకోవాలి... గౌరవించాలి... ప్రోత్సహించాలి. సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలి. అన్ని రకాలుగా మేమున్నామనే భరోసా కల్పించాలి. ఈ బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు, అధికారులతోపాటు సమాజంలో ఒక భాగమైన ప్రతి ఒక్కరిపై నా ఉంది. తక్షణమే స్పందించకపోతే, భారీగా నష్టపోతాం. దేశ ఉజ్వల భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకున్నవాళ్లమవుతాం. యువత కూ డా ఆత్మహత్యతోనే సమస్యకు పరిష్కారమనుకునే భావన నుంచి బయటపడాలి. తొందరపాటు నిర్ణయాలు కుటుంబాలను ఎంతటి ఆవేదనకు గురిచేస్తాయో ఆలోచించుకోవాలి. సమస్యలను సన్నిహితులతో పంచుకోవాలి. పరిష్కరించుకోవాలి. ఆత్మస్థైర్యమే సమస్యలకు సమాధానమన్నది నిజం.

వెంకగారి భూమయ్య,
9848559863

అత్యల్ప నిరుద్యోగితా రేటులో మధ్యప్రదేశ్ టాప్

దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్న విషయం తెలిసిందే. ఏడాదికి కోటి ఉద్యోగాలంటూ పదేళ్ల క్రితం ఇచ్చిన హామీని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అటకెక్కించింది. మితిమీరిన ప్రైవేటీకరణ ఉద్యోగావకాశాలను తగ్గిస్తున్నది. ఈ రెండు అంశాలే నిరుద్యోగ సమస్య పెరగడానికి ప్రధాన కారణాలు. దేశంలో నిరుద్యోగం ఒక ముఖ్యమైన సమస్యగా మారింది. ఆర్థిక వృద్ధి, సామాజిక స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తుంది.

అనేక రాష్ట్రాలు అధిక నిరుద్యోగిత రేటుతో పోరాడుతున్నాయి. కాగా, ఈ ఏడాది, ఇప్పటి వరకూ అందుబాటులో ఉన్న గణాంకాలను అనుసరించి, దేశంలో నిరుద్యోగ సమస్య తక్కువగా ఉన్న లేదా అత్యల్ప నిరుద్యోగిత రేటులో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. అక్కడ నిరుద్యోగిత రేటు పురుషుల్లో 2.8 శాతం, మహిళల్లో 2.1 శాతం చొప్పున, మొత్తం 2.6 శాతంగా నమోదైంది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వ్యవసాయ కార్యక్రమాలు, పారిశ్రామిక వృద్ధిపై దృష్టి సారించడం, పురుషులు, మహిళలు ఇద్దరికీ ఉద్యోగ అవకాశాలను అందించడం ఈ విజయానికి కారణమని చెప్పవచ్చు. అత్యల్ప నిరుద్యోగిత రేటు కలిగిన 'టాప్10' రాష్ట్రాల వివరాలు (పురుషులు, మహిళలు, మొత్తం చొప్పున వరుస శాతాలు)

1.మధ్యప్రదేశ్ (2.6 శాతం/ పురుషుల్లో 2.8, మహిళల్లో 2.1శాతం),2.గుజరాత్(3.1శాతం, పురుషుల్లో 3.3,మహిళల్లో 2.7శాతం), 3. జార్ఖండ్ (3.6శాతం, పురుషుల్లో 4.8, మహిళల్లో 1.5శాతం), 4. ఢిల్లీ (4.6శాతం/పురుషుల్లో 4.8,మహిళల్లో 4.6 శాతం), 5. ఛత్తీస్‌గఢ్ (6.3శాతం, పురుషుల్లో 6.6, మహిళల్లో 5.8 శాతం), 6. దాద్రా నగర్ హవేలీ (6.6శాతం, పురుషుల్లో7.8, మహిళల్లో 3.7 శాతం), 7. (6.8 శాతం, పురుషుల్లో 6.7, మహిళల్లో 6.8 శాతం), 8. సిక్కిం (7.7శాతం/పురుషుల్లో 8.3, మహిళల్లో 6.8 శాతం),9. పశ్చిమ బెంగాల్ (9శాతం/పురుషుల్లో 8.5, మహిళల్లో 10శాతం), 10. ఉత్తరప్రదేశ్ (9.8 శాతం, పురుషులు 9.3, మహిళలు 12.3 శాతం).

కీలకాంశాలు..

ఆర్థిక వృద్ధి తగ్గినప్పుడు నిరుద్యోగిత పెరుగుతుంది. పరిశ్రమల కొరత ఉద్యోగ సృష్టిని అడ్డుకుంటుంది. ఉద్యోగ అవసరాలు, శ్రామిక శక్తిలో అందుబాటులో ఉన్న నైపుణ్యాల మధ్య ఉన్న అంతరం నిరుద్యోగ సమస్య పెరగడాని కి ఒక కారణం. జనాభా పెరుగుదల ఉద్యోగార్థుల సంఖ్యను పెంచుతుంది. విద్య, శిక్షణ రంగాల్లో నిర్లక్ష్యం లేదా కొత్తతనం లేకపోవడం కూడా మారుతున్న ప్రపంచ తీరుతెన్నులకు అనుగుణంగా ఉద్యోగాలు సంపాదించడానికి అడ్డుపడుతున్నది. ప్రభుత్వాలు అనుసరించే అసమర్థమైన కార్మిక విధానాలు ఉద్యోగితా శాతాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. వ్యవసాయంపై ఆధారపడడం కాలానుగుణ నిరుద్యోగానికి దారితీస్తున్నది. ఈ సమస్యలు రాకుం డా పటిష్టమైన చర్యలు చేపడితేనే నిరుద్యోగ సమస్యకు తెరపడుతుంది.

అశ్రద్ధ చేస్తే 'ఊపిరి' తీస్తుంది!

న్యుమోనియా వ్యాధితో ప్రపంచవ్యాప్తంగా ఏటా 25లక్షల మంది పిల్లలు మరణిస్తున్నారు. ఐదేండ్లు నిండని చిన్నారుల మరణాలలో 16 శాతం దీని వల్లనే. న్యుమోనియా చ

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది తమ హాజరు వివరాల నివేదికను పంపాలని, హాజరు శాతం సరిగ్గా లేన ఇవారి పనితీరును పరిరక్షించాలన్నారు. న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం పై కమిటీలను ఏర్పాటు చేసి మండలాలు, మున్సిపాలిటిగా వారిగా లిట్రసి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో చదువురాని గుర్తించి మొదటి దశగా 27,840 మందికి వాలంటీర్స్ ద్వారా చదువు నేర్పించడం జరిగిందన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు వేగవంతంగా నిర్వహించి ఏలాంటి తప్పులు లేకుండా వివరాలను సేకరించాలన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 54వేల 626 గృహాలను సర్వే చేసినట్లు తెలిపారు. ప్రజలు సర్వే అధికారులకు సహకరించాలని, తమను అధికారులు ఏలాంటి ఓటిపి అడగరని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి రాంబాబు, వివిధ శాఖల అధికారులు జగదీష్ రెడ్డి, సతీష్ కుమార వి అప్పారావు, డాక్టర్ కోటాచలం, ఎల్ కిషన్, శంకర్, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, సీతారాం నాయక్, శ్రీనివాస్ నాయక్, నరసింహా పాల్గొన్నారు.

సర్వే మార్గదర్శకాలతో ముందుకు

ప్రజాపక్షం/యాదాద్రి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రభుత్వం మార్గదర్శకాలను పాటిస్తూ ముందుకు కొనసాగించాలని, ప్రజలంతా సర్వేకి సహకరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ, బొమ్మలారామరం మండలంలోని చీకటి మామిడి గ్రామాలలో సర్వే తీరును కలెక్టర్ పర్యవేక్షించారు. ఎన్యూమరేటర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సర్వే విధానాన్ని పరిశీలించారు. ఎన్యూమరేటర్ సేకరించిన కుటుంబ వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సర్వేలో ఏ ఒక్క కుటుంబాన్ని విడిచిపెట్టవద్దని, అన్ని కుటుంబాలను సమగ్రంగా వివరాల సేకరణ చేయాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఇంటి యజమానుల నుండి సమాచారాన్ని సేకరించి ఫారంలో ప్రశ్నలకు అనుగుణంగా తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఇంటి యజమానులు ఎన్యుమరేటర్లు వచ్చిన సమయంలో ఒరిజినల్ ధృవ పత్రాలు అందుబాటులో ఉంచుకొని ఎన్యుమరేటర్లకు సహకరించాలని అన్నారు. ఎన్యుమరేటర్లకు కేటాయించిన ఇళ్లను సమగ్ర కుటుంబ సర్వే నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేష్, తుర్కపల్లి తాసిల్దార్ దేశ్యా, భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామానుజ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి క్రీడలపై శ్రద్ధ

ప్రజాపక్షం/సూర్యాపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అడిషనల్ ఎస్‌పి నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌జిఎం క్రికెట్ అకాడమిలో నారాయణ ప్రీమియం లీగ్ నల్లగొండ జోన్, ఎన్‌పిఎల్ జోన్ స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు మానసిక ధృడత్వానికి దోహదపడుతాయని చెప్పారు. గెలుపు, ఓటమిని విద్యార్థులు సమానంగా స్వీకరించి సాధన చేసి ఉన్నత స్థాయిలో నిలిచేలా కృషి చేయాలని సూచించారు. క్రీడలు మానసిక, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం రమణారెడ్డి, ఎజిఎం రమేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ పుష్పలత, నరేష్, హరిత, సైదులు, దివ్య, కోహిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి ఆజాద్ కృషి

ప్రజాపక్షం/ఉండవెల్లి: మైనార్టీల అభివృద్ధి కోసం మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఫలితంగా విద్య, వైద్యం రంగాలకు ఎనలేని సేవలు చేశారని స్థానిక ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆజాద్ యొక్క జయంతి వేడుకలను విద్యార్థిని ఉపాధ్యాయులు ఘనంగా వేడుకలు చేపట్టారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మైనార్టీ గురుకుల పాఠశాలను సమస్యలను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల సమస్యలను పరిష్కారం కోసం ప్రత్యేక నిధుల ద్వారా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సువాసిని, మండల విద్యాధికారి అల్లంపూరు మానవపాడు అశోక్‌కుమార్, శివప్రసాద్, మాజీ ఎంపిటిసిలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాపక్షం / అలంపూర్ : అలంపూర్ చౌరాస్తాలోని ప్రకృతి నగర్ వెంచర్‌పై అవకతవకలకు పాల్పడ్డాడని పుల్లూరు పంచాయతి సెక్రటరీ ప్రవేణ్ కుమార్ రెడ్డిపై , పుల్లూరు జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్‌కు ఎంఆర్‌పిఎస్ నాయకులు ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం సమర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఉండవెల్లి మండలం పుల్లూరు శివారులో అలంపూర్ చౌరస్తాలో డిటిసిపి అప్రూవల్ వెంచర్‌గా 275,276,2 77,278, 279,280 సర్వే నెంబర్లలో 70 ఎకరాలు వెంచర్ వేశారు. పంచాయతి రాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతికి 10 శాతం ల్యాండ్ 15 శాతం ప్లాట్స్ గ్రామ పంచాయతికి మార్టుగేజ్ చేయాలి వెంచర్ ఓనర్లు డెవలప్మెంట్ చేయకపోతే పంచాయతి ప్లాట్స్ అమ్మివెంచర్‌లో ఉన్న ప్లాట్స్ కొని ఇళ్ళు కట్టిన వారికి డెవలప్‌మెంట్ చేసి ఇవ్వచ్చని చట్టం చెపుతుంది.అలాగే రోడ్లు, డ్రైనేజి,విద్యుత్,వాటర్‌ట్యాంకు,సౌకర్యాలు అనేక అభివృద్ధి చేయాలి ఇలా చేస్తేనే వెంచర్లకు అనుమతి ఇవ్వాలి కానీ ఇవన్నీ పట్టించుకోకుండ ఏకంగా 5 వెంచర్లకు అనుమతి ఇచ్చారు.

కార్తీక సోమవారం నదీ హారతి

ప్రజాపక్షం/ఎర్రవల్లి: కార్తీక సోమవారం నదీ హారతి పవిత్ర కృష్ణా నది తీరాన వెలిసిన శ్రీ బీచుపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో కృష్ణమ్మ నదీ తీరాన రెండవ కార్తీక సోమవారం సందర్భంగా కృష్ణా నదికి హారతులు ఇచ్చారు. గంగమ్మ పూజ నిర్వహించి అనంతరం హారతులు అర్చకులు ప్రహ్లాద ఆచారి సందీప్ ఇఒ రామన్ గౌడ్ ఆధ్వర్యంలో దీపోత్సవ కార్యక్రమం నిర్వహించి నది మాతల్లికి హారతులు సమర్పించారు.

సిపిఐది వందేళ్ల పోరాట చరిత్ర

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/సూర్యాపేట: నిత్యం ప్రజా, కార్మిక, కర్షక సమస్యల సిపిఐ పార్టీ వందేళ్ల పోరాట చరిత్రను కలిగి ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మ భిక్షం భవన్‌లో సూర్యాపేట పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమితి పిలుపులో భాగంగా సంవత్సర కాలం పాటు పల్లె పల్లెన ఎర్రజెండా ఎగురవేసి కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్రను భావితరాలకు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఈ దేశం నుండి తరమిమసేందుకు సాగిన స్వాతంత్ర సమరశీల పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ అశేష త్యాగాలను చేసిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు అంతమొందించేందుకు సమరశీల పోరాటాలు చేసింది సిపిఐ పార్టీనే అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించి 4వేల గ్రామాలకు విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘతన పార్టీకే దక్కిందన్నారు. 2025 సభ్యత్వం చేర్పింపు, పునరుద్ధరణ లక్ష్యాలను పూర్తి చేసి గ్రామ స్థాయి నుండి మండల స్థాయి, ప్రజా సంఘాల మహాసభలను నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. డిసెంబర్ 30న నల్లగొండలో జరిగే శత జయంతి ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. గుగులోతు రాజారాం నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు ఖమ్మంపాటి రాము, పట్టణ కౌన్సిల్ సభ్యులు నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్య, శ్రీకాంత్, సైదులు, పెంద్రా కృష్ణ, గాలి కృష్ణ పాల్గొన్నారు.

సిపిఐది గొప్ప త్యాగాల చరిత్ర

ప్రజా పక్షం/(నల్లగొండ)కేతేపల్లి : సిపిఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయండి దేశ స్వాతంత్ర సాధనలో, తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐ విరోచితంగా ఉద్యమించి ప్రాణ త్యాగాలు చేసి చరిత్ర లో నిలిచిపోయిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ పిలుపు నిచ్చారు. సిపిఐ కేతేపల్లి మండల సమావేశం గోలి ఆంజనేయులు అధ్యక్షతన కేతేపల్లిలోని ఐబీ గెస్ట్ హౌస్ ఆవరణలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై శ్రవణ్ కుమార్ భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మండల, గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలన్నారు. నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో గల వరి కొనుగోలు కేంద్రాలలో ఎగుమతి, దిగుమతులను అధికారులు వేగవంతం చేసి ధాన్యాన్ని మద్దతు ధర కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహారాజు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు గౌను లక్ష్మీ నరసయ్య, మండల కౌన్సిల్ సభ్యులు బోడ వెంకన్న ,ఊటుకూరు సాయికుమార్, మాధగోని ప్రేమ్ కుమార్, ఎస్ అంబేద్కర్, పి సైదులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ఎఇఒలదే చురుకైన పాత్ర

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: వానకాలం ధాన్యం సేకరణలో వ్యవసాయ విస్తరణ అధికారులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.సోమవారం ఉదయాదిత్య భవన్ లో ధాన్యం సేకరణ పై నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై వ్యవసాయ విస్తరణ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏఈఓలు తప్పనిసరిగా వారి పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. దాన్యం కొనుగోలును ప్రతిరోజు పర్యవేక్షించాలని, ప్రభుత్వం ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులకు సహకరించాలని, నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే సరైన తేమ శాతంతో కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ఇటు రైతులను, అటు కేంద్రం నిర్వాహకులను అప్రమత్తం చేయడమే కాకుండా ,టార్పాలిన్లు, తూకం యంత్రాలు, అన్ని సిద్ధంగా ఉండేలా చూడాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, ధాన్యం సేకరణ పట్ల ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యంగా ఉండవద్దని ఆమె తెలిపారు.సన్న రకం ధాన్యాన్ని నిర్ధారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన క్యాలిపర్స్ పై వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ సందర్భంగా శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ సమావేశంలో అదరపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్,ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే మిల్లులను సీజ్ చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర 2320/ కన్నా తక్కువగా రైస్ మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో కోరారు. ఒకవేళ ఎవరైనా రైస్ మిల్లరు మద్దతు ధర కన్నా తక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను మోసం చేసినట్లయితే అట్టి రైస్ మిల్లును సీజ్ చేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. రైస్ మిల్లును సీజ్ చేయడంతో పాటు, ఆ మిల్లుకు సంబంధించిన అన్ని రకాల లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందని, ముఖ్యంగా మార్కెటింగ్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ ,పొల్యూషన్ లైసెన్స్, విద్యుత్ లైసెన్స్ వంటివి రద్దు చేస్తామని తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2320 /రూపాయలకు తక్కువ కాకుండా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆమె కోరారు. రైతులు ధాన్యాన్ని అమ్మేందుకు రైస్ మిల్లులకు వెళ్లకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరతో పాటు, బోనస్ ను కూడా పొందాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణింపు

జోనల్ స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాపక్షం/డిండి : డిండి మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడల పోటీలను దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీలు, ప్రిన్సిపాల శిరీష ఘన స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన ఎంఎల్ఏ బాలునాయక్ క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి సమాజంలో గౌరవం పొందాలని సూచించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం అని సానుకూల దృక్పదంతో స్వీకరించాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు యూత్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటిని ఏర్పాటు చేయడంతో పాటు క్రీడా రంగ అభివృద్ధిపై విధి విధానాలను రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ పాఠశాలలో హైమాస్ట్ లైట్లు, డ్రైనేజి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఏ అందుకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, మత్స్యశాఖ సొసైటి చైర్మన్ కాశన్న, పిఏసిఎస్ చైర్మన్ నాగార్జునరెడ్డి, శ్రీను, గోవర్ధన్, లక్పతి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంకిరణ్, వెంకటేష్, ఖలీం, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, డిసివోఅర్జున్‌ప్రసాద్, ఎంఈవో గోప్యనాయక్, ఎంపిడివో వెంకన్న తహశీల్దార్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శిరీష, రాంసింగ్, హరికృష్ణ, వివిధ పాఠశాలల పిఈటిలు, పిడిలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వేకు అందరూ సహకరించాలి : జాజుల

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: సమగ్ర కులగణన సర్వేకు అందరూ సహకరించాలని . దీనిపైన ఎటువంటి అపోహాలు పెట్టుకోకూడదని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి సమగ్ర కుల గణన పై బిసిలను చైతన్యం చేయడం కొరకు సోమవారం పట్టణంలోని గౌడ సంఘం హాస్టల్ లో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చక్రహరి రామరాజు అధ్యక్షతన బిసిల చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సర్వేలో పేర్కొన్న అంశాలను తప్పనిసరి అయినవి మాత్రమే చెప్పాలని మీకు అవసరం లేనివి చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. బిసి కులాలు అందరూ సమగ్ర సర్వేకు సహకరించి తమ కులాల ఆర్థిక పరిస్థితుల గురించి చెప్పాలని వారు అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని కోరినారు. సోషల్ మీడియాలో వస్తున్నటువంటి అసత్య ప్రసారాలు నమ్మవద్దని కోరారు. బిసి కులగణన ద్వారా వారి జనాభా ప్రకారం రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా ఉద్యోగాలలో సమాన న్యాయం జరుగుతుందని చెప్పారు. కుటుంబ సభ్యుల వివరాలను చెప్పాలని. ప్రభుత్వం దీనిపై విస్తృతంగా ప్రచారం చేసి అందరూ పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు, ఈ సమావేశంలో శంకర్ ముదిరాజ్, నల్ల సోమ మల్లన్న, నేలపట్ల సత్యనారాయణ, కాశయ్య గౌడ్, నల్లసోమ మల్లన్న,కంది సూర్యనారాయణ,కేశబోయిన శంకర్ ముదిరాజ్,చిక్కుళ్ల రాములు, గంజి భిక్షమయ్య ,వెంకటేశ్వర్లు, వడపల్లి సాయిబాబా, నోముల రవితదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పరిస్థితులన్నీ తారుమారు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీ సంవత్సర పాలనలో పరిస్థితితులు తారుమారయ్యాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్ని శాఖల్లో అభివృద్ధి ఆగిపోయి శాఖలన్నీ పడకేశాయన్నారు. శాఖలను సమన్వయం చేసి ముందుకు నడిపించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం లేక ఆసుపత్రుల పాలవుతున్నారని, ఆసుపత్రులకు వెళ్తే సరైన మందులు అందుబాటులో లేని పరిస్థితి నెలకొందన్నారు. సాగునీరు, రైతులకు మద్దతు ధర అందకపోవడంతో రైతులు రోడ్లెక్కి ప్రభుత్వంపై తిరిగుబాటు చేస్తున్నారని చెప్పారు. వికారాబాద్ ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా స్థానికులు అధికారులపై ప్రతిఘటిస్తున్నారన్నారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను నామమాత్రంగా ప్రారంభిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు దళారుల చేతుల్లో మోసపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయమంటే బాంబాలు వేస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. త్వరలోనే నల్లగొండ మంత్రితో పాటు సిఎం వరకు అందరి బండారం బయటపెడుతామన్నారు. మూసీ కంటే దుర్గంధమైన నోరుతో కెసిఆర్‌ను దూషిస్తున్నారన్నారు. తెలంగాణలో మీ నిర్వాకం చాలదని పక్క రాష్ట్రాల్లో ప్రచారం చేసి అక్కడ ఎసరు పెడుతున్నారని, సిఎం రేవంత్ వ్యవహారంతో కాంగ్రెస్ పార్టీకి ఇక చివరి రోజులే అన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, నెమ్మాది భిక్షం, గోపగాని వెంకటనారాయణ ఉన్నారు.

సిబ్బంది సంక్షేమానికి మెగా హెల్త్ క్యాంప్

ప్రజాపక్షం /నల్లగొండ టౌన్: పోలీస్ సిబ్బంది, అదికారులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదేవిదంగా వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవార్ అన్నారు.జిల్లా పోలీస్ శాఖ,అపోలో,ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సురక్ష వివిధ హస్పటల్ డాక్టర్ల సహకారంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలంయలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్ పి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి విది నిర్వహణలో ఒత్తిడి కారణంగా సమయానికి ఆహారం,నిద్ర లేకపోవడం వలన అనేక రకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంటుందనీ అన్నారు. ముఖ్యంగా సిబ్బంది విధులతో పాటు ఆరోగ్య దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటించాలనీ అన్నారు. ఈ యొక్క హెల్త్ క్యాంపుకు సహకరించిన మెడికల్ హాస్పిటల్ వైద్యులకు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్ పి రాములు నాయక్,ఎస్‌బి డిఎస్‌పి రమేష్,నల్లగొండ డిఎస్‌పి శివ రాం రెడ్డి,సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మినారాయణ,ఏ.ఆర్ డిఎస్‌పి శ్రీనివాస్, మెడికవర్ కార్డియాలిస్ట్ డాక్టర్ శ్రీధర్, అపోలో డాక్టర్ సల్మాన్, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్,ఐయంఎ ప్రెసిడెంట్ డాక్టర్ పుల్లారావు, సురక్ష హాస్పిటల్ డాక్టర్ రమేష్, డిసిహెచ్‌యస్ డాక్టర్ మాతృ, విశ్వ హృదయ హస్పటల్ డాక్టర్ నరహరి,డ్రగ్ అండ్ కెమిస్ట్రీ ప్రెసిడెంట్ పరమాత్మ సిఐలు రాఘవరావు, డానియల్, సైదులు, రాజశేఖర్, కొండల్ రెడ్డి, రాజు,ఆర్ఐలు సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి..

నడిగూడెంలో రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు కృషి

పదవ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ పద్మావతిరెడ్డి

ప్రజాపక్షం/కోదాడ(నడిగూడెం): గురుకుల పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ క్రీడా కుసుమాలుగా తయారవుతున్నారని, వారు జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలలకు, గ్రామాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు, ప్రఖ్యాతలు తీసుకరావాలని కోదాడ ఎంఎల్ఏ పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం నడిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌ను స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి పూలే, బిఆర్ అంబేద్కర్, ఎన్ఆర్ శంకరన్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సహిస్తుందని అన్నారు. నడిగూడెం గురుకుల పాఠశాలకు కావాల్సిన సౌకర్యాలను మెరుగుపరుస్తామని హామి ఇచ్చారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, జనగాం జిల్లాల నుండి 9 టీంలు స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొనేందుకు రావడంతో వారిని ఎంఎల్ఏ పరిచయం చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బూత్కురి వెంకటరెడ్డి, డిసివో విద్యాసాగర్, ప్రిన్సిపాల్ పద్మ, వెంకటేశ్వర్లు, అరుణకుమారి, విజయలక్ష్మి , ఎంఇవో ఉపేందర్‌రావు, మాజీ జడ్పిటిసి బాణాల కవిత నాగరాజు, రాజేష్, పుల్లారెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'108' అంబులెన్స్‌లో టెక్నీషియన్ పైలెట్ ఉద్యోగాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్

కస్తూర్బా గాంధీ విద్యార్థులకు మళ్లీ అస్వస్థత !

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. సోమవారం మళ్లీ ఆరుగురు విద్యార్థులకు తీవ్రమైన దగ్గు రావడంతో వెనువెంటనే ఉపాధ్యాయులు స్థానిక ప్రాథమిక వైద్యుడు అమరేందర్ రావుకి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో కస్తూర్బాగాంధీ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వాతావరణం చలిగా ఉండటం వల్ల విద్యార్థులకు స్వల్పంగా దగ్గు ఉందని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. ఇప్పటికే మూడు సార్లు విద్యార్థులు అస్వస్థత గురి కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

రాజన్న సన్నిధిలో మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు

ప్రజా పక్షం /వేములవాడ : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, వేములవాడ శాసనసభ్యులు, రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు సోమవారం రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని వారు దర్శించుకొని ప్రత్యేక పూజలతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలయ ప్రాంగణంలోకి రాగానే పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం మహా మంటపంలో ప్రముఖులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించి స్వామివారి చిత్రపటం మహా ప్రసాదాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. వారి వెంట ఆలయ అర్చకులు, అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చలి మంటలు

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండలం వ్యాప్తంగా చలి ప్రభావం రోజురోజుకీ పెరుగుతోంది. గత వారం రోజుల నుండి ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో చలి తీవ్రత పెరుగుతుంది. దీంతో సాయంత్రం కాగానే వృద్ధులు, చిన్నారులతోపాటు అంతేకాకుండా వయసుతో నిమిత్తం లేకుండా పలువురు స్వెట్టర్లు ధరించి చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. మానేరు పరివాహ గ్రామాల్లో నైతే ఇంకా చలి వనికిస్తుంది. రాత్రివేళ, తెల్లవారుజామున చెలి నుండి ఉపశమనం కోసం చలిమంటలు కాగుతూ చల్లటి వాతావరణంలో వేడిని చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఏడు నుండి ఎనిమిది గంటల వరకు వరకూ పొగమంచు తెరలు వీడటంలేదు. దీంతో రహదారులు కానరాక వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పొగమంచు సమయంలో ప్రయాణం చేయకుండా ఉండడమే మేలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కార్మికుడి మృతికి ఆర్‌జీవన్ జిఎం ,ఎఐటియుసి నాయకుల సంతాపం

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: ఆదివారం రోజున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒసిపి 5 ఇపి ఆపరేటర్ సుద్దాల రామచందర్ పార్థివ దేహాన్ని ఆర్జీ వన్ జిఎం, ఎఐటియుసి నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, అడిషనల్ సి.ఎం.ఒ డాక్టర్ కిరణ్ రాజ్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, వెల్ఫేర్ ఆఫీసర్, గుర్తింపు సంఘం ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్, బిఎంఎస్ నాయకులు యాదగిరి సత్తయ్య లు సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సర్వేను పరిశీలించిన ప్రత్యేకాధికారి కరుణాకర్‌రెడ్డి

ప్రజాపక్షం/ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని చిన్న కోమటిపల్లి గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే సోమవారం మండల ప్రత్యేక అధికారి కరుణాకర్‌రెడ్డి ఎంపిడిఒ పుల్లయ్యలు పరిశీలించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గడ్డివానిపల్లి, సిరిసేడు గ్రామాలలో సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నమోదు చేసుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కుటుంబ సర్వేకు సహకరించాలని కోరారు. ఎంపిఓ, పంచాయతీ సెక్రటరీతో పాటు గ్రామస్తులున్నారు.

సిఎం సహాయనిధితో నిరుపేదలకు ఆర్థిక భరోసా..

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: సీఎం సహాయనిధితో నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని అలాగే ఆరోగ్యశ్రీ సేవలను పొందడం ప్రజలు హక్కుగా భావించాలని మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పట్టభద్రుల ఎంఎల్సి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం రాయికల్ మండలం 102 మందికి రూ.48.21 లక్షలు చెక్కులు, సారంగపూర్ బీర్‌పూర్ మండలాలకు చెందిన 104 మందికి రూ.57.18 లక్షలు మొత్తం రూ.1 కోటి 5 లక్షల విలువైన సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు జీవన్‌రెడ్డి పంపిణీ చేశారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా కార్పోరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు మసర్థి రమేష్, జితేంధర్ యాదవ్, కొండ్ర రామచంద్రారెడ్డి, గోపు రాజిరెడ్డి, ఎన్నం మధుకర్‌రెడ్డి తదిపాల్గొన్నారు.

సత్వరమే అర్జీల పరిష్కారం

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : అర్జీలు పరిష్కారం సత్వరమే చేయాలనీ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలోనూ పెండింగ్‌లో ఉంచకుండా, సత్వరమే పరిష్కరించాలని వీటిలో రెవెన్యూ (16), ఇతర దరఖాస్తు లు(19) మొత్తం(35) స్వీకరించామని అన్నారు. పెద్దపల్లి పట్టణం తెనుగువాడ ప్రాంతానికి చెందిన ఈర్ల రమ తనకు ఈర్ల సాగర్‌కు వివాహం జరిగిందని, తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, కొడుకు కావాలని భర్త, అత్త నిత్యం వేదించేవారని, తనను కాపాడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారి కు రాస్తూ సఖీ కేంద్రం ద్వారా పరిష్కారించాలని కలెక్టర్ సూచించారు. మంథని మండలం సూర్య పల్లి గ్రామానికి చెందిన సురేష్ వారధి సొసైటీ ద్వారా ఉద్యోగ అవకాసం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారిది సొసైటీకు రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని విఠల్ నగర్‌కు చెందిన వీరారెడ్డి తనకు కంటి చూపు లేదని, సదరం క్యాంప్ నుంచి 100% కంటి చూపు లేనట్లు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే ద్వారా జిల్లాలోని కుటుంబాల వివరాలను పకడ్బందీగా సేకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సో మవారం కలెక్టర్ పెద్దపల్లి మం డలంలో విస్తృతంగా పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, కాసులపల్లి, పాలితం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే ను కలెక్టర్ తనిఖీ చేశారు. మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ పక్కగా చేయాలని, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించాలని, ఏ ఒక్క కుటుంబం కూడా మిస్ కావడానికి వీల్లేదని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి రోజు 15 కుటుంబాల వివరాలు సేకరించాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద వచ్చిన ధాన్యాన్ని ప్యాడి క్లీనర్ల ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. నాణ్యత ప్రమాణాలను పరీక్షించి నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేరగన్ని బ్యాగులు అందుబాటులో పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. మానిటరింగ్ అధికారి ఎం. శివ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు అహ్మద్ బాషా,లక్ష్మ ణ్‌బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచకుంటే మార్కెట్‌ను నిర్బంధిస్తాం

ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు ఎల్లాగౌడ్ డిమాండ్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచకుంటే ఎఐటియుసి ఆధ్వర్యంలో మార్కెట్‌ను నిర్బంధిస్తామని హమాలీ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో జరిగిన హమాలీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని గత కొన్ని నెలల క్రితం హోల్ సేల్ వ్యాపారులకు, లేబర్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా, ఇంత వరకు హమాలీలకు కూలీ రేట్లు పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం పెంచిన కూలీ రేట్లు అమలు చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి వారికి ఇచ్చే కూలీ రేట్ల డబ్బులు సరిపోవడం లేదని, అనేక అవస్తలు పడుతున్నారని ఆయన అన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచి హమాలీ వర్కర్స్ కు న్యాయం చేయాలని ఆయన హోల్ సేల్ వ్యాపారులను కోరారు. లేనిచో ఎఐటియుసి ఆధ్వర్యంలో మార్కెట్ ను నిర్బంధిస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎగౌస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మ య్య, రాంచందర్, సతీష్, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ తీరు అస్తవ్యస్తం

ప్రజాపక్షం/ముత్తారం : ప్రతి వారం ఫ్రైడే అంటూ.. అంతేకాకుండా ప్రతి ఇంటింటికీ తిరుగుతూ పారిశుద్ధ్య నిర్వహణ పాటించాలని గొప్పలు చెప్పే అధికారులు తమ సొంత గ్రామపంచాయతీ కార్యాలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా అని గ్రామస్తులు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ నూతన గ్రామపంచాయతీ కార్యాలయం పక్కనే నిర్మించిన మరుగుదొడ్లు కంపుకొట్టడంతో దుర్వాసన గ్రామపంచాయతీ కార్యాలయంలోకి వచ్చే ప్రజలు కప్పు భరించలేక అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని గ్రామస్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీ కార్యాలయం పరిసరాల్లో మద్యం సీసాలు పగలగొట్టి చెత్తాచెదారం ఉండగా కార్యలోనికి వచ్చే వారు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గ్రామపంచాయతీ కార్యాలయం ఇలా అస్తవ్యస్తంగా ఉంటే ఎలా అని అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ కార్యాలయం పక్కనే నిర్మించిన మరుగుదొడ్లను మరమ్మతులు చేయించి,వాటర్ సదుపాయం కల్పించాలని, గ్రామపంచాయతీ పరిసరాల్లో మద్యం సేవించకుండా సీసాలు పగలగొట్టకుండా ఉండేవిధంగా చూడాలని అలాగే గ్రామపంచాయతీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'సూపర్' వైద్య సేవలు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పవర్‌ఫుల్ వైద్య సేవలు అందుతున్నాయి. కరోనా తర్వాత ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవ కృషితో ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరిగాయి. కలెక్టర్ మార్గదర్శకత్వంలో డిఎంహెచ్‌హెచ్‌వో వెంకటరమణ, అడిషినల్ డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఈ మేరకు దవాఖానల్లో గర్భిణీలకు ప్రసవాలు చేసేలా సౌకర్యాల కల్పనకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించారు. ఆయా చోట్ల ఆహ్లాదకర వాతావరణంతో పాటు పచ్చదనం పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. దీంతో పాటు వైద్యాధికారులు, సిబ్బందికి తగిన సూచలను సలహాలు అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు గణనీయంగా పెరిగాయి. ఇందుకు చొప్పదండిలోని పిహెచ్‌సి దవాఖాన ఆదర్శంగా నిలుస్తున్నది. శనివారం ఒక్కరోజే ఇక్కడ రెండు సాధారణ ప్రసవాలు చేశారు. గత రెండేళ్లుగా ఇక్కడ ఎటువంటి ప్రసవాలు జరగలేదు. గతంలో నామమాత్రంగా సౌకర్యాలు ఉండడంతో చొప్పదండి పిహెచ్‌సిలో కావాల్సిన మౌలిక వసతులను కలెక్టర్ కల్పించారు. దీంతో వైద్య అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించడంతో గర్భిణులు ముందుకొచ్చి ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు చేయించుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. శనివారం ఒక్క రోజే వైద్యాధికారులు సిబ్బంది రెండు సాధారణ ప్రసవాలు చేయడంతో జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నది.

చొప్పదండి దవాఖాన సేవలు ఆదర్శం: చొప్పదండిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నది. ఇక్కడి వైద్య అధికారులు సిబ్బంది శనివారం ఒక్కరోజే రెండు సాధారణ ప్రసవాలు చేశారు. ఒకేరోజు రెండు సాధారణ ప్రసవాలు చేసి రికార్డు సృష్టించారు. గతంలో ఇక్కడి ఆసుపత్రిలో సరైన వసతులు ఉండేవి కావు. కలెక్టర్ తనిఖీకి వెళ్లినప్పుడు ఈ విషయాన్ని గమనించారు. ఆస్పత్రిని సమూలంగా మార్చవేశారు.

దవాఖానల్లో పెరిగిన సాధారణ ప్రసవాలు: జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణుల సాధారణ ప్రసవాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జనవరి నుంచి అక్టోబర్ వరకు దాదాపు 20 సాధారణ ప్రసవాలు జరిగాయి. కోవిడ్ తర్వాత రికార్డు స్థాయిలో జిల్లాలో సాధారణ ప్రసవాలు నమోదయ్యాయి. గత రెండు సంవత్సరాల వరకు ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు అంతంత మాత్రమే జరిగాయి. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ వైద్య సేవలపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రభుత్వాసుపత్రులను సమూలంగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. ఆస్పత్రులో ఆహ్లాదక వాతావరణంతో పాటు పచ్చదనం పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. చామనపల్లి పిహెచ్‌సిలో ఒకటి, చెల్పూర్‌లో ఒకటి, చొప్పదండిలో రెండు, గంగాధరలో 9, రామడుగులో మూడు, శంకరపట్నంలో ఒకటి, తిమ్మాపూర్‌లో మూడు సాధారణ ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు మరింత పెరిగేలా వైద్య సిబ్బంది నిరంతరం కష్టపడాలని కలెక్టర్ సూచించారు. శనివారం ఒక్కరోజే రెండు సాధారణ ప్రసవాలను చేసిన చొప్పదండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందిని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఘనంగా సన్మానించారు. జిల్లా వైద్యాధికారి వెంకటరమన, అదనపు వైద్యాధికారి డాక్టర్ సుజాత, డిసిహెచ్ చంద్రశేఖర్, ఎంసిహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా, వైద్యాధికారులు ప్రణవ్, రమేష్, మధుకర్, శ్వేత ప్రియపాల్గొన్నారు.

రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రారంభించిన ప్రభుత్వవిప్

ప్రజాపక్షం /వేములవాడ టౌన్: రంగవల్లి జ్ఞాపకార్థంగా వేములవాడ పట్టణంలోని నంది కమాన్ వద్ద నిర్మించిన రంగవల్లి విజ్ఞాన కేంద్రంను సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, పలువురు రచయితలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, ఇతర ప్రముఖులతో కలసి రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మట్లాడుతూ రంగవల్లి నిజం కాలం నుండి పోరాటం చేసిన గొప్ప మహిళ. రంగవల్లి పెరు మీద ఒక విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనియం. రంగవల్లి విజ్ఞాన కేంద్రంను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. రంగవల్లి దొరల పాలనకి వ్యతిరేఖంగా పోరాటం చేశారు. పేద ప్రజల కోసం భూస్వాములకు, దొరలకు వ్యతిరేకం గా అనేక పోరాటలు చేసారు. సమాజంలో ఉన్న అసమానతలకు వ్యతిరేఖంగా పోరాటం చేస్తూ, అదివాసి బిడ్డలకు అండగా నిలబడ్డారు. రంగవల్లి విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమాలలో పని చేశారు. ప్రగతి శీల సంఘంలో, విప్లవ పార్టీలో కొనసాగుతూ పేద ప్రజల కోసం అనేక పోరాటం చేసి గొప్ప వ్యక్తి. పార్టీలు వేరైనా, భావాలు వేరైనా అందరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ రామ తీర్థపు మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేష్, కార్యక్రమం నిర్వాహకులు మున్సిపల్ పాలకమండలి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి

జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం జగిత్యాల పట్టణంలో హౌసింగ్ బోర్డు, రవీంద్రనాథ్ ఠాగుర్ కాలనీలో సారంగపూర్ మండలంలోని లక్ష్మీ దేవిపల్లి, రాయికల్ మండలంలోని ఆలూర్ గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో జిల్లా కలెక్టర్ పాల్గొని పరిశీలించారు. కలెక్టర్ సర్వే చేస్తున్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నారా అని కలెక్టర్ పరిశీలించారు. స్వయంగా సర్వే ప్రశ్నపత్రాన్ని వివరాలను నమోదు చేశారు. ప్రతి ఇంటి గోడ పైన ఖచ్చితంగా స్టిక్కర్ అంటించాలని తెలిపారు. పత్రంలో ఉన్న ప్రశ్నలను సరిగ్గా నింపుతున్నారా లేదా అని ఫామ్ ను తీసుకొని కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఇంటిలో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తు ఓపికతో ప్రతి కుటుంబం నుండి స్పష్టత కలిగిన సమాధానాలను సేకరించాలని, సర్వే జరుగుతన్న సమయంలో కుటుంబ యజమాని కి వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని వారికి అర్థ అయ్యే విధంగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, డిఆర్డీవో రఘువరుణ్, తహసీల్దార్, ఎంపీడివో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

బార్ అండ్ రెస్టారెంట్‌పై చర్యలు

ఎఐవైఎఫ్ వినతి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ఇన్‌చార్జ్ కమిషనర్‌ని కోరిన ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య రామగుండం కార్పొరేషన్ పరిధిలో అక్రమంగా ప్రధాన నాలను కుదించి దానిపై భవన నిర్మాణాన్ని చేపట్టిన సాయి లీల బార్ అండ్ రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు ఆ నిర్మాణాన్ని తొలగించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) పక్షాన రామగుండం నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ అరుణశ్రీకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎఫ్‌సిఐ, ప్రజల అవసరాల రీత్యా వ్యర్థాలను వదలడానికి పారిశ్రామిక ప్రాంతంలో ప్రవహిస్తున్న ప్రధాన నాలా 30 నుండి 40 ఫీట్లు వెడల్పు ఉండేదని అయితే ఈ ప్రధాన నాలను సాయిలీల బార్ అండ్ రెస్టారెంట్ నిర్మించడానికి ఐదు నుండి 10 ఫీట్లకు కుదించి ఎలాంటి సెట్ బాక్ వదలకుండా సాయి లీల బార్ అండ్ రెస్టారెంట్ వారు భవనాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. రామగుండం కార్పొరేషన్ల ప్రవహిస్తున్న నాలా ఎక్కడి నుండి ఎక్కడి వరకు ప్రవహిస్తుంది అనే సమాచారం కూడా మున్సిపల్ కార్యాలయంలో లేకపోవడం దురదృష్టకరమని వారన్నారు. సాయి లీల బార్ అండ్ రెస్టారెంట్ వారు 10 ఫీట్లకు నాలను కుదించడం మూలంగా నాలా పూర్తిగా జామ్ కావడంతోపాటు సాయి లీల ఎదురుగా హోండా షోరూం పక్కన కాలువ నీరుజమై పూర్తిగా బురదమయంగా మారిపోయిందని తెలిపారు. నూతన మున్సిపల్ చట్టం ప్రకారం నాళాలపై నిర్మాణం కానీ నాలాను కబ్జా గాని చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఉన్నప్పటికీ గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదని వారన్నారు. రామగుండంలో నాలాపై అనేక నిర్మాణాలు ఉన్నప్పటికీ ఒక్కో దానికి ఒక్కో రకమైన నిబంధనలు పాటించడం సరైన విధానం కాదని విమర్శించారు. ఇప్పటివరకు నాళాల పై ఉన్న నిర్మాణాలను ఏ విధంగా అయితే కూల్చివేశారో అదే విధంగా వెంటనే సాయి లీల భవనాన్ని కూడా కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రామగుండం నగరపాలక సంస్థ అధికారులు ఇంచార్జ్ కమిషనర్ గారు స్పందించి వెంటనే సాయి లీల పక్కన ఉన్న నాలను వెడల్పు చేయడంతో పాటు నాలాపై నిర్మించిన భవనాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎఐవైఎఫ్ నగరఅధ్యక్ష కార్యదర్శులు సాదుల శివకుమార్ ,ఆసాల నవీన్ మరియు రాణవేణి సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం

ఎంఎల్ఎ డా.కవ్వంపల్లి సత్యనారాయణ

ప్రజాపక్షం/బెజ్జంకి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎంఎల్ఎ డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముత్తన్నపేట గ్రామ శివారులోని సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సంద

ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు

రైతులకు ఇబ్బందులు రానివ్వం

రూ.66కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకం : మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మూడు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ ఖమ్మం నగరం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని అల్లిపురం వద్ద దేవరపల్లి జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఉగాది నాటికి ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తి కానుందని తెలిపారు. ఖమ్మంలో ఆర్‌వోబి నిర్మాణం మినహా రహదారి నిర్మాణం మొత్తం పూర్తి అవుతుందని తెలిపారు. ఆర్‌ఒబిని కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఖమ్మం చుట్టూ వెళ్తున్న జాతీయ రహదారులు ఖమ్మం దేవరపల్లి, కోదాడ కురవి, ఖమ్మం అమరావతి జాతీయ రహదారులను అనుసంధానిస్తూ ఖమ్మం నగరం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కురవి జాతీయ రహదారి, అమరావతి జాతీయ రహదారి మధ్య సుమారు ఏడు కిలోమీటర్ల రోడ్డును నిర్మిస్తే ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి అవుతుందని దాని కోసం రూ.122 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. ఖమ్మం చుట్టూ జాతీయ రహదారులు వెళ్తున్న నేపథ్యంలో ప్రజల కోరిక మేరకు సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలకు సాగునీటి సౌకర్యం కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలంకు సాగునీటిని అందించేందుకు రూ.66 కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామని నిధులు కూడా మంజూరయ్యాయని తెలిపారు. వి.వెంకటాయపాలెం సాగర్ డిప్ కట్ వద్ద ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా మండలంలోని 30చెరువులకు కృష్ణా జలాలు అందిస్తామని తెలిపారు. చెరువులతో పాటు మధ్యలో ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వంలో రైతుబంధు, రుణమాఫీ సగం మంది రైతులకు ఇవ్వలేదని తెలిపారు. రెండు లక్షల రుణానికి సంబంధించి 22 లక్షల మందికి రుణమాఫీ చేసినట్లు మంత్రి తెలిపారు. తెల్లరేషన్ కార్డు నిర్ధారణ కాని నాలుగు లక్షల మంది రైతులకు కుటుంబ నిర్ధారణ పూర్తయిందని త్వరలోనే రుణమాఫీని అమలు చేస్తామని తెలిపారు. రెండు లక్షల పైన ఉన్న రుణాలకు సంబంధించి షెడ్యూల్ ఇచ్చి మాఫీ చేస్తామని మంత్రి తెలిపారు. షెడ్యూల్ ఇచ్చిన తర్వాత దానికి అనుగుణంగా రెండు లక్షలపైన రుణం ఉన్న రైతులు మిగిలిన మొత్తాన్ని కట్టాలని తెలిపారు. సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు ఆయిల్ పాం, ఉద్యానవన పంటలు సాగు చేయాలని మంత్రి కోరారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, రావూరి సైదబాబు, అధికారులు పాల్గొన్నారు.

నూతనోత్తేజంతో సభ్యత్వ నమోదు

సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు

ప్రజాపక్షం/చింతకాని : నూతనోత్తేజంతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం చింతకాని మండలం బస్వాపురం గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ సిపిఐ ముందుంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి పార్టీ శ్రేణులు తీసుకెళ్ళాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సభ్యులు మార్గం శ్రీనివాసరావు, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, నాయకులు బుర్రా అంజయ్య, ఆవుల పెద్ద వేలాద్రి, ఆవుల వెంకయ్య పాల్గొన్నారు.

'స్థానికం'లో సత్తా చాటాలి

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

ప్రజాపక్షం/కరకగూడెం : కరకగూడెం మండలంలో సిపిఐ జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి వంగర సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీని నమ్ముకున్న వారికి తగిన ఫలితం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అయోధ్య చారి, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, మండల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు మెరుగుపరచండి

ప్రజావాణిలో సిపిఐ వినతి

ప్రజాపక్షం/బోనకల్ : మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు మెరుగుపరచాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి ఆకెన పవన్‌లు ప్రజావాణిలో ప్రత్యేక అధికారులను సోమవారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. టిజిఎంసి దాదులతో గ్రామీణ వైద్యులు భయాభ్రాంతులకు గురువుతాన్నరని, అత్యవసర పరిస్థితులలో ప్రథమ చికిత్స అందించేందుకు భయపడతున్నారని, ఎమెర్జెన్సీ వైద్యసేవలు అందించేందుకు వెనుకడంతో గ్రామీణ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, పిహెచ్‌సి నుంచి ప్రత్యామ్నాయ వైద్యసేవలు అందేందుకు కృషి చేయాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చే అంత వరకు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 10 గంటలకు వరకు ఒక మెడికల్ ఆఫీసర్, ఒక నర్సింగ్ ఆఫీసర్, సహాయక సిబ్బందిగా ఒక ఇఎంటి, ఒక ఎఎన్‌ఎంలను నియమించి మండల ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. పేషంట్లకు చేసే రక్తపరీక్షల ఫలితాలను ఆ రోజే అందజేయాలని కోరారు. 60 సంవత్సరాలు పైబడి బిపి, షుగర్‌లతో బాధపడే వారికి ప్రతి నెల ఇంటి వద్దనే బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి టిబి మందులు మాదిరిగానే ఇంటివద్దకే మందులను అందజేయాలని కోరారు.

అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

ప్రజాపక్షం/తల్లాడ : అమరవీరుల త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకమని సిపిఐ జిల్లా నేత మద్దోజు శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అండగా నిలబడి 1925లో స్థాపించిన భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు ప్రజల కోసం నిర్వహించిన ఘనమైన చరిత్ర కలిగి ఉందన్నారు. ఈ చరిత్రను నేటి యువతకు, ప్రజలకు తెలిపి విధంగా గడపగడపకు సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సిపిఐని బలోపేతం చేసే విధంగా భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, రమేష్, భరత్, సతీష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సిపిఐ కార్యకర్త మృతి

నాయకుల సంతాపం

ప్రజాపక్షం/మణుగూరు రూరల్ : మండల పరిధిలోని సాంబయ్యగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త చిమ్ముల లక్ష్మీ నారాయణ (70) ఆదివారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, మాజీఎంపీటీసీ కామిశెట్టి రామారావు, మాజీ సర్పంచ్ బాడిష సతీష్, నాయకులు భీమరాజు కృష్ణ, రాజు, పులిగిల్ల రమేష్ తదితరులు హాజరై మృతదేహంపై ఎర్రజెండా కప్పి, పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం బి.అయోధ్య చారి మాట్లాడుతూ గతంలో సిపిఐ పార్టీలో చురుకైన కార్యకర్తగా పని చేశాడని తెలిపారు. లక్ష్మీ నారాయణ పార్టీ అంటే ప్రాణం అని, లక్ష్మీ నారాయణ ఆకస్మిక మరణం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఎక్కడున్నా వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

ప్రజాపక్షం/కల్లూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి రైతులను కోరారు. సోమవారం కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండిలో ఐకెపి, మరో కేంద్రంలో డిసిఎంఎస్ లింగాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రైతుకు మద్దతు ధర లభించే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజా దేవి, ఆర్‌డిఒ రాజేంద్ర, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపిడిఒ చంద్రశేఖర్, ఎంపిఒ ఏనుగు సురేష్ బాబు, ఎఒ రూప, ఎపిఎం వెంకట రామారావు, సిసి ఎస్తేరు, ఆనంద కుమారి, నాగమణి, కాంగ్రెస్ నాయకులు తోటకూర శేషగిరిరావు, మరుసకట్ల బాలరాజు, మాదిరాజు అన్నమరాజు, మచ్చ వెంకటేశ్వరరావు, ఏనుగు సత్యం బాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి పాల్గొన్నారు.

పెనుబల్లి : మండల పరిధిలోని లంకపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. కార్యక్రమంలో కల్లూరు ఎఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, వ్యవసాయ అధికారి ప్రసాదరాజు, వెలుగు ఎపిఎం పుల్లారావు, నీలాద్రి చైర్మన్ చీకటి నరసింహారావు, డైరెక్టర్లు, పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/వైరా : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడారంగానికి, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర రెవిన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024 జోనల్ క్రీడలు సోమవారం ప్రారంభమయ్యాయి. క్రీడలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజామిల్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. తొలుత మంత్రి పొంగులేటికి విద్యార్థులు రిహాల్స్ చేస్తూ స్వాగతం పలికారు. మంత్రి పొంగులేటి జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్ముల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో జోనల్ మీట్ మూడు రోజులు క్రీడలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 14పాఠశాలల నుండి సుమారు 1140మంది విద్యార్థులతో ఘనంగా ప్రారంభించుకున్నామన్నారు. క్రీడారంగంపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన, ముఖ్యమంత్రి శ్రద్ధ ఎలా ఉందో ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చి 11 నెలలు పూర్తయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం విద్యకి, వైద్యానికి పెద్ద పీఠ వేస్తుందన్నారు. విద్య పట్ల ప్రత్యేకమైన శ్రద్ధతో అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా సుమారు రూ.657కోట్లు ఖర్చు పెట్టి మౌలిక పాఠశాలలో మౌలిక వసతులు తీర్చిదిద్దడం జరిగిందన్నారు. సుమారు 40,000 మంది టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వండి, ట్రాన్స్ ఫర్లు ఈ ప్రభుత్వం పారదర్శకంగా చేసిందన్నారు. అంతే కాకుండా మెగా డిఎస్‌సి చేపట్టి సుమారు 1156 మంతి కొత్త ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిందన్నారు. ఈ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా 1వ తారీఖున ఉద్యోగస్తులకి జీతాలు అందిస్తుందన్నారు. నిరుపేదలు వ్యవసాయాన్ని నమ్ముకున్న వారి పిల్లలు గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి పిల్లలు కార్పొరేట్ విద్యకు ధీటుగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.. ప్రతి నియోజకవర్గానికి రూ.125 నుంచి రూ.150కోట్లు ఖర్చు పెట్టి 20 నుంచి 25 ఎకరాల్లో అద్భుతమైన ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇటీవల 28 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శంకుస్థాపన చేసుకున్నామని, సుమారు 60 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శంకుస్థాపన చేసుకోబుతున్నామన్నారు. హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి చక్కగా చదువుకొని ఉన్నతస్థాయిలో ఉండాలని ఉద్దేశ్యంతో మెస్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలోఆర్‌డిఒ గరిడి నర్సింహారావు, గురుకుల సెక్రటరీ శారద, జోనల్ అధికారి సరస్వతి, కళాశాల ప్రిన్సిపాల్ సమత, మార్క్ ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపాల్ కమీషనర్ వేణు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, కోసూరు శ్రీనివాసరావు, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/బూర్గంపాడు: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తుందని, గిట్టుబాటు ధర వచ్చే లా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోని తీసుకురావాలన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలన్నారు. దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కేంద్రంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యానికి ఓపీఎంఎస్ చేసి డబ్బులు వచ్చే విధంగా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎడిఎ తాతారావు, తహసీల్ధార్ ముజాహిద్, ఎంపిడిఒ జమలారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఆర్.శంకర్, సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్సి స్కూల్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వేడుకలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్ధార్ ముజాహిద్, ఎంపిడిఒ జమలారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్ : రామానుజవరం పంచాయతీ భగత్ సింగ్ క్రీడామైదానంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగులు చేయాలన్నారు. భగత్ సింగ్ క్రీడా మైదానంలో మౌలిక వసతులు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు రామంజవరం మాజీ సర్పంచ్ బాడిషా సతీష్ వివరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యచారి, మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, కుర్రి నాగేశ్వరావు, ఎండిఒ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఎడి తాతారావు, సొసైటీ సభ్యులు, డైరెక్టర్లు అధికారులు, నోములు రవి, తమ్మిశెట్టి సాంబ, పోతనబోయిన కోటయ్య, మామిళ్లపల్లి శ్రీను పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ప్రజాపక్షం/వైరా : వైరా వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. పంటను దళారులకు అమ్ముకోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లోరైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైరా వ్యవసాయ సంచాలకులు కరుణశ్రీ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పొదిలి హరినాథ్, బోళ్ళ గంగారావు, మిట్టపల్లి నాగి, వీరంశెట్టి సీతారాములు, దార్న రాజశేఖర్, పమ్మి అశోక్, ఫణితి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగునీరు విడుదలపై తక్షణమే నిర్ణయం చేయాలని వినతి

వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో సాగు భూములకు రబీ సీజన్‌లో రెండో పంటకు సాగు నీరు విడుదలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సోమవారం వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శీలం నర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, మచ్చా వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు మచ్చా మణి, పైడిపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

భద్రాచలం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రజాపక్షం/భద్రాచలం : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతీ దరఖాస్తు పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హైజరై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులపై ఉన్న ఎంతో నమ్మకంతో ప్రజలు వ్యయ, ప్రయాసలకు ఓర్చి ఇంతదూరం వచ్చి వినతి సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు అందజేస్తున్నారని చెప్పారు. వాటిని నిర్లక్ష్యం చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర వివరణతో నివేదిక సమర్పించాలని సూచించారు.

గిరిజన దర్బారులో... ఐటిడిఎ సమావేశ మందిరంలోని నిర్వహించిన గిరిజన దర్బారు పలు ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఐటిడిఎ పిఓ బి రాహుల్ వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలోఅన్ని శాఖల యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం అర్బన్ : అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ అందించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలోను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. తొలుత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదిన సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సోవ వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ రాజేశ్వరి, డిఆర్‌డిఒ సన్యాసయ్య పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్

ప్రజావాణి దరఖాస్తులు, వరద బాధితుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వారి సందేహాలను నివృత్తి చేసేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్, ఇంచార్జి ఖమ్మం మున్సిపల్ కమిషనర్ డా.పి.శ్రీజ తెలిపారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో శ్రీజ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తం

వరంగల్ మల్టీ జోన్ -1 ఐజి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాపక్షం/పినపాక : నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, గోదావరి తీర ప్రాంతాల్లో మరింత నిఘా పెంచాలని, ఏజెన్సీ ప్రాంత పోలీస్ స్టేషన్ల పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను ప్రోత్సహించాలని వరంగల్ మల్టీ జోన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. సోమవారం ఏడూళ్ళ బయ్యారం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన, స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజకుమార్‌లను ఐజి. చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను ప్రోత్సహిస్తూ ఏజెన్సీ గ్రామాల్లోని యువతను అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకుండా, గ్రామాలలో యువతకు వారి అభిరుచుల మేరకు విద్య, ఉపాధి మార్గాల వైపు నడపాలని సూచించారు.

ఎనుమాముల మార్కెట్లో నిలిచిపోయిన పత్తి కొనుగోళ్లు

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్ ఏనుమాముల మార్కెట్లో పత్తి కొనుగోళ్లు సోమవారం ఉదయం ఒక్కసారిగా నిలిచిపోయాయి. తెలంగాణ వ్యాప్తంగా సిసిఐ వైఖరికి నిరసనగావ్యాపారులు కొనుగోలు నిలిపివేశారు.ఇటీవల వరుస సెలవుల అనంతరం పెద్ద ఎత్తున రైతులు మార్కెట్‌కు పత్తిని తరలించగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఇబ్బంది పడ్డారు. కాగా ఎల్1, ఎల్2, ఎల్3 నిబంధనల పేరుతో సిసిఐ మిల్లులను, కఠినమైన నిబంధనలతో వ్యాపారులను ఇబ్బందులు పెడుతున్నగంటూ కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో కొనుగోలుదారుల కోసం రైతులు, అధికారులు వేచి చూశారు. ఈ క్రమంలో మార్కెట్లో ఎటువంటి గొడవ తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా అధికారులు పోలీసులను మోహరించారు.అనంతరం రాష్ట్ర ఉన్నతాధికారులు సిసిఐ అధికారులతో చర్చలు జరిపి రాష్ట్ర వ్యాప్తంగా నిలిచి పోయిన పత్తి కొనుగోళ్లను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

ప్రజావాణిలో సత్వరమే పరిష్కారం

జయశంకర్ కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజావాణిలో వచ్చిన సమస్యల దరఖాస్తులు పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో సమస్య రిష్కారానికి వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులు ఎండార్స్మెంట్ చేశామని తెలిపారు. మొత్తం 7 దరఖాస్తులు వచ్చినట్లు తెలియజేశారు. వీటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ మంగిలాల్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపై సందేహాలొద్దు..

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ కులగణన సర్వేపై సందేహాలు, అపోహలు అవసరం లేదని, ప్రజలు సర్వే ప్రక్రియలో భాగస్వాములై తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు. సోమవారం వరంగల్ నగరం జిడబ్ల్యూ ఎంసీ లోని 24వ డివిజన్ ఫాటక్ మోహల్లా, ఎల్లంబజార్ లలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును క్షేత్ర స్థాయిలోకలెక్టర్ పరిశీలించారు.ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఇంటింటి కుటుంబ సర్వేలో సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. జెడ్పి సీఈఓ రామిరెడ్డి, సిపిఓ గోవిందరాజన్, ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, ఆర్ ఓ షాజా దిబేగం, ఆర్ ఐ సోహైల్, గణకులు తదితరులుఉన్నారు.

పురాతనమైన నాపాక ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : జిఎస్ఆర్

ప్రజాపక్షం/చిట్యాల: పురాతనమైన సర్వతోభద్ర ఏకశిలా ఆలయానికి విశిష్టత ఉందని నాపాక ఆలయ అభివృద్ధికి ప్రజల, ప్రభుత్వ సహకారంతో ఆలయాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చి దేవతామూర్తుల కృపాకటాక్షాలు ప్రజలకు అందే విధంగా చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని నైన్ పాక గ్రామంలో గల నాపాక ఆలయాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే జిఎస్ఆర్ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై దేవతా మూర్తుల మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకరచార్యులు అర్చన చేసి హారతి ఇచ్చారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతనమైన నాపాక ఆలయం 3 వేల సంవత్సరాల ప్రత్యేక విశిష్టత కలిగిన ఆలయమని ఈ ఆలయానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించే విధంగా కృషి చేస్తామని అన్నారు. గ్రామస్తులు ఆలయ భూమి అన్యక్రాంతానికి గురవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సర్వే చేయించి ఆలయ భూమిని ఆలయానికి చెందే విధంగా ప్రజలు సహకరించాలని కోరారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆలయ కమిటీ చైర్మన్గ యాదండ్ల రాజయ్య యాదవ్, డైరెక్టర్లు చెరుకూరి రాజయ్య, తొట్ల ఎర్రయ్య యాదవ్, ముద్దంగుల ఐలయ్య, కాశి పాక కమల తిరుపతి, ఆలయ ప్రధాన అర్చకులు పెండ్యాల ప్రభాకరచార్యులు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ పరకాల డివిజన్ ఇన్స్పెక్టర్ నందనం కవిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, జిల్లా నాయకులు చిలుకల రాయకొంరు, నక్క భాస్కర్, మాజీ జెడ్పిటిసి ఓరం సమ్మయ్య,బావు గట్టయ్య యాదవ్, కంకణాల శంకర్, తోట గట్టయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి

మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : ప్రజా సంక్షేమమే పరమావధి అని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజల నుండి వచ్చిన వినతులను పరిశీలించి, అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో సాధ్యమైనంత త్వరలో వారి సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. సోమవారం వరంగల్ ఓ సిటిలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి సురేఖ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఉదయం క్యాంప్ ఆఫీసుకు చేరుకున్న మంత్రి ఒక్కొక్కరిగా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. పలు డివిజన్‌లకు చెందిన ప్రజలు, పార్టీ శ్రేణులు తమ సమస్యలను మంత్రికి వివరించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చాలా వరకు సమస్యలను మంత్రి అక్కడికక్కడే పరిష్కరించారు. గతంలో అధికారులకు నివేదించి, పరిష్కారానికి నోచుకొని విజ్ఞప్తులపై ఆరా తీసిన మంత్రి, సంభందిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. మంత్రి సురేఖ ఓపిగ్గా సమస్యలను విని పరిష్కారం చూపినందుకు ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ప్రజలే ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. వరంగల్ తూర్పులోనూ, హైదరాబాద్‌లోనూ ప్రజలకు ప్రతి నిత్యం అందుబాటులోఉంటానని స్పష్టం చేశారు.

ఖిలా వరంగల్: ప్రజల నుంచి వచ్చిన ప్రతీ ఒక్క సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ ఓ సిటీలోని క్యాంపు కార్యాలయం లో ప్రజల నుంచి వచ్చిన వినతులను మంత్రి పరిశీలించి అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సాధ్యమైనంత త్వరలో సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. గతంలో అధికారులకు నివేదించి పరిష్కారానికి నోచుకోని విజ్ఞప్తులపై ఆరా తీసిన మంత్రి, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. వరంగల్ తూర్పు, హైదరాబాద్‌లోను ప్రజలకు ప్రతీ నిత్యం అందుబాటులో ఉంటానని మంత్రి స్పష్టం చేశారు.

కొనుగోళ్లల్లో అవకతవకలు సహించను..

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లిప్రతినిధి : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కొనుగోలుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, సహకార శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పిఏసిఎస్, ఐకెపికి కేటాయించిన అన్ని సెంటర్లను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రంలో సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని సూచించే విధంగా అలాగే విడి విడిగా కేంద్రాలు ఏర్పాటుతో పాటు గుర్తించడానికి వీలుగా బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో నీడ కొరకు షామియానా, తాగునీరు, ప్యాడి క్లీనర్, మాయిశ్చర్స్, తూకపు యంత్రాలు, టార్పాలిన్లు ఉండేలా మార్కెటింగ్ శాఖ అధికారిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాములు ఉన్నారు.

రాజ్యాంగ విలువల గురించి మాట్లాడే హక్కులేదు

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ

ప్రజాపక్షం/కెయుక్యాంపస్:బీసీసామాజిక వర్గాలకు స్థానిక సంస్థలలో 42 శాతం అవకాశాలు కల్పించాలని కెటిఆర్ డిమాండ్ చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకట నారాయణఅభిప్రాయపడ్డారు.సోమవారం హనుమకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు అనేక త్యాగాలు చేసి 1200 మంది ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణలో తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు మీ కుటుంబ, వారసత్వ, ఆధిపత్య, నిరంకుశ పాలన సాగించిన మీకు, మీ కుటుంబానికి వెనుకబడిన కులాల గురించి, ప్రజాస్వామ్యం గురించి, రాజ్యాంగ విలువల గురించి గానీ మాట్లాడే నైతిక హక్కు లేదని కేటిఆర్ నుద్దేశించి అన్నారు.73 వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలలో బీసీలకు సంక్రమించిన 33శాతం కేటాయించిన రిజర్వేషన్లను కల్వకుంట్ల పాలన సందర్భంగానే 22 శాతానికి తగ్గించిది నిజము కాదా అని ప్రశ్నించారు?పోలీసు, ఆర్థిక, గనులు, నీటిపారుదల మొదలగు వివిధ ప్రభుత్వ అధికార పదవులలో దగ్గర బంధువులను కూర్చుండబెట్టి బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులను మేధావులను అవమాన పరిచింది మీ పాలన కాదా అని ఎద్దేవా చేశారు. రెండు దశాబ్దాల పాటు పోరాటం చేసి టిఆర్ఎస్ ఆవిర్భావానికి దాని ఎదుగుదలకు కృషిచేసి పత్రికలను, మీడియాను పెంచి పోషించి రాష్ట్రాన్ని సాధించిన తర్వాత పార్టీ తమ సొంత ఆస్తిగా మార్చుకొని దానిని ప్రశ్నించిన ఈటల రాజేందర్‌ను పార్టీ నుండి బర్తరఫ్ చేసి అనేక అవమానాలు చేసింది మీ కుటుంబం కాదా? అని ప్రశ్నించారు. బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయ్యాల సుధాకర్, లీగల్ సెల్, వైస్ చైర్మన్ రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ గునిగంటి శ్రీనివాస్ గౌడ్, వరంగల్ ఉమ్మడి జిల్లా న్యాయవాదుల కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ చెన్నూరి రమేష్, జాతీయ బిసి సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బగ్గిరాజు పాల్గొన్నారు.

అంబి సాంబయ్య మృతి సిపిఐకి తీరనిలోటు

ప్రజాపక్షం/హనుమకొండ(ఆత్మకూరు): అతికొద్ది కాలంలో సిపిఐ పార్టీలో గుర్తింపు పొందిన నాయకులు, దామెర మండల కార్యదర్శి అంబి సాంబయ్య అకాల మృతి ఈ ప్రాంత ప్రజలకు తీరనిలోటు అని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సోమవారం అంబి సాంబయ్య స్వగ్రామం ఆత్మకూరు మం డలం పెద్దాపూర్‌లో సంతాప సభకు సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొట్టేపాక రవి అధ్యక్షత వహించగా కర్రె బిక్షపతి మాట్లాడారు. భూ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించి పేదలకు ఇళ్ల స్థలాలు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిరంతరంఉద్యమించిన నాయకులు అంబి సాంబయ్య అని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మానవులు పుడుతూ చనిపోతూ ఉంటారని, అతికొద్ది మంది మాత్రమే ప్రజల బాధలు, ఆవేదనలు పట్టించుకొని తన బాధగా తీసుకొని పరిష్కారం కోసం ప్రజా సమస్యలపై పోరాడుతారన్నారు. అందులో అంబి సాంబయ్య ఒకరని అన్నారు. ఆయన లేని లోటు బాధాకరం అని, ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని అన్నారు. గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరెల్లి రవి, దాడి రవి, భరత్, రమేష్, గడ్డం నాగవెల్లి రామన్న, రమేష్, పల్లె రమ, సాంబయ్య పిల్లలు విద్యాసాగర్, రాజ శేఖర్, సంధ్య, భార్య సర్వజన పాల్గొన్నారు.

పంచలింగాల ఆలయ అభివృద్ధికి సహకారం

ప్రజాపక్షం/ఆత్మకూరు: కాకతీయుల కాలంలో నిర్మించిన పంచలింగాల శివాలయాన్ని అద్భుతంగా పునర్ నిర్మించారని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ కాళీప్రసాద్ అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని పంచలింగాల శివాలయంలో సోమవారం డాక్టర్ కాళీప్రసాద్, బీజేపీ మండలాధ్యక్షుడు బలవంతుల రాజు, ప్రధాన కార్యదర్శులు ఉప్పుగల్ శ్రీకాంత్‌రెడ్డి, బయ్య పైడి కల్యాణ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గట్టు వేణుగౌడ్, సీబీఎస్ఈ కమిటీ ఛర్మన్ వంగాల బుచ్చిరెడ్డి, బీజేపీ జిఆల్ల నాయకులు రవ్వ శివప్రసాద్, బయ్యా రాజ్, ఆలయ కమిటీ బృందం పంచలింగాల శివాలయంలో విశేష పూజలు పూజారి రవీంద్ర శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. దేవాలయాన్ని పరిశీలించి నిర్మాణ శైలిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంత అద్భుతమైన దేవాలయానికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని శాశ్వత కట్టడమైన ఆర్చి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తానన్నారు. ఇక్కడ పూజలు చేయడం నా జన్మ ధన్యమైందని, దేవాలయాభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

బ్యాంకు ఖాతా అడిగితే ఫిర్యాదు చేయండి

జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాష షేక్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: సర్వే సందర్భంగా ఎవరైనా బ్యాంక్ అకౌంట్, ఓటిపి అడిగితే పోలీస్‌లకు ఫిర్యాదు చేయండి, మౌకికంగా మాత్రమే వివరాల సేకరణ, అందుకు ప్రజలందరు సహకరించి వివరాలు అందజేయాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. జిల్లాలో జరుగుతున్న సర్వేనే ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ధేశించిన ఫారంలో అడిగిన ప్రజలకు మాత్రమే ఎన్యుమరేటర్లు సమాదానాలు మాత్రమే నమేదు చేస్తారని, ఎలాంటి జీరాక్స్‌లు, బ్యాంక్ అకౌంట్స్, ధరణి తదితర జిరాక్స్‌లు ఎవీ ఇవ్వొదన్నారు. ఈ మద్యకాలంలో జరగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రతి ఎన్యుమరేటర్‌కు గుర్తింపు కార్డు జారీ చేశామన్నారు. అలాగే సర్వేను ఎలా చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే తదితర అంశాల మీద ఎన్యుమరేటర్‌కు జిల్లా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు దీనిని దృష్టిలో పెట్టుకొని అడిగిన సమాచారం మాత్రమే ఇవ్వాలన్నారు. ఎలాంటి జీరాక్స్‌లు, ఓటిపి ఇవ్వొదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు సోమవారం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నందు ఘనంగా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో పాటు ఇతర శాఖల జిల్లా అధికారులు అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అబుల్ కలాం ఆజాద్ 11 ఏండ్ల పాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేశాడన్నారు. రచయితగా, కవిగా, తత్వవెత్తగా, విద్యావెత్తగా రాజకీయవెత్తగా అనేక సేవలందించిన బహుముఖ ప్రజ్ఞశాల మౌలానా అబుల్ కలాం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ మన్సూర్, బిసి సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

డబ్బులివ్వడంలో తాత్సారం తగదు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని తేమ, తాలు, తూర్పాల పట్టాలనే కారణాలతో ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి సకాలంలో డబ్బులు ఇవ్వాలని మాల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఈటెల రాజేందర్ జనగామ వ్యవసాయ మార్కెట్‌ను అకస్మికంగా తనఖీ చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో ఐకెపి ద్వారా జరిగే కొనుగోళ్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. సన్న ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం లేదని కొందరు రైతులు తెలపగా విక్రయించిన 20 రోజులకు సైతం డబ్బులు ఇవ్వడం లేదని, హామాలీ చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారని కొందరు రైతులు తెలిపారు. మార్కెట్‌లో కొనుగోళ్లను పరిశీలించిన తరువాత రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినా సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు జరుగుతుండగా జిన్నింగ్ మిల్లు యజమానులు కొనుగోళ్లు ఆపడంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే చర్చించి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో సోమవారం కొనుగోలు జరిగాయన్నారు.

ఛైర్మన్ చైర్‌లో ఈటెల?

ఎంపి ఈటెల రాజేందర్ కొనుగోళ్లను పరిశీలించిన తరువాత మార్కెట్ కార్యదర్శి కోరిక మేరకు కార్యాలయానికి వెళ్లారు. ఛైర్మన్ కుర్చీలోనే ఈటెల కూర్చున్నారు. ప్రోటోకాల్ ఎలా ఉన్నా ఛైర్మన్ లేకుండా ఆయన కుర్చీలో కూర్చోవచ్చా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

సత్తా చాటిన ఇండియన్ హైస్కూలు

ప్రజాపక్షం/హనన్‌పర్తి: ఈనెల 9, 10 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో రెండో సబ్ జూనియర్ అండర్. 14 రాష్ట్రస్థాయి వుషు క్రీడలు నిర్వహించారు. ఈ వుషూ క్రీడల్లో ఇండియన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతీక్, లుక్మాన్, సాయిచరణ్, అక్షిత్, హర్షిత్ పాల్గొని వెండి, రజత పథకాలను సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఇండియన్ హైస్కూల్ కరస్పాండెంట్ అజ్మీర రమేశ్, ప్రిన్సిపాల్ ప్రియాంక, ఏఓ కార్తీక్, ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, పీఈటీలు నరసింహారావు, నాగేంద్ర బాబు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

బాలగోపాల్ రోల్‌మోడల్

ప్రజపక్షం/కెయుక్యాంపస్ : "చదువు తో విజ్ఞత పెరగాలి" అని విశాఖపట్నం ప్రముఖ న్యాయవాది జహ అరాఅన్నారు.విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన, విశ్వవిద్యాలయ సెనెట్ హాల్ లో నిర్వహించిన "14 వ డాక్టర్ కే. బాలగోపాల్ స్మారక ఉపన్యాస కార్యక్రమం" లో "స్త్రీల హక్కులు : రోల్ అఫ్ జుడిషియరీ" అనే అంశం పై స్మారక ఉపన్యాసం చేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరివాడు బాలగోపాల్ అన్నారు. విద్యార్థులు అయనను రోల్‌మోడల్‌గా విద్యార్థులు చేసుకోవాలి, విద్యార్థి క్లాసు రూమ్ కు పరిమితం కావద్దు అన్నారు. 1991 ఆర్థిక సంస్కరణల తరువాత భారత దేశంలో విస్తృత మార్పులు చోటు చేసుకున్నాయి అన్నారు. మహిళా సాధికారిత పెరగాలి అని, స్వాతంత్రానికి ముందు దేశంలో చాల మహిళా చట్టాలు ఉన్నాయని, మహిళా హక్కులు అంటే మానవ హక్కులు అన్నారు. ఎన్ని మహిళా చట్టాలు వచ్చిన అమలుకు నోచుకోవట్లేదు అన్నారు.న్యాక్ పూర్వపు సంచాలకులు ఆచార్య వి. ఎస్. ప్రసాద్, సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు ఆచార్య జి హరగోపాల్, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డితో పాటు బాలగోపాల్ కుటుంబ సభ్యులు, పరస్పెక్టివ్ సంస్థ సభ్యులు, విశ్రాంత ఆచార్యులు, బోధనా, బోధనేతరసిబ్బంది,పరిశోధకులు, విద్యార్థులున్నారు.

కెయులో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, రామ్ బాబు నాయక్, రేనుకుంట్ల ప్రవీణ్, ఇతర కమిషన్ సభ్యులతో కలిసి విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు.వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి,రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, ఇతర అధికారుల తో కలిసి శాలువా, జ్ఞాపిక, బోకే సన్మానించారు, చైర్మన్ బక్కి వెంకటయ్య వివిధ అంశాలు చర్చించారు.

నియంతృత్వ పాలనపై పోరాటం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్

ప్రజాపక్షం/ నర్సంపేట : మతతత్వ నియంతృత్వ పాలనపై సిపిఐ పోరాటాలు చేస్తోందని, సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలను పురస్కరించుకోని పల్లె పల్లెలో ఎర్రజెండాలు ఎగురవేయాలి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అన్నారు. సోమవారం నర్సంపేట సిపిఐ మండల సమితి సమావేశం వడ్లకొండ స్వామి అధ్యక్షతన జరిగింది.పంజాల రమేష్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం మతాన్ని అడ్డుపెట్టుకొని మత ఉన్మాదాన్ని ప్రేరేపించి అధికార దాహాన్ని తీర్చుకుటు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ, దేశ సంపదను దోచిపెడుతూ, సామాన్య మధ్యతరగతి ప్రజల సమస్యలను విస్మరించి పాలను సాగిస్తూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఇలాంటి ప్రభుత్వంపై సిపిఐ ఎప్పటికప్పుడు ప్రజా పోరాటాల నిర్వహిస్తూ ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. డిసెంబర్ 26 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కి 100 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తూ పల్లె పల్లెలో ఎర్రజెండాలు ఎగురవేయాలన్నారు. పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేస్తూ దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతుందనే విషయాన్ని వివరిస్తూ, సంవత్సర కాలం పాటు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే బాష్మియా, పనస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వర్, జిల్లా నాయకులు గడ్డం యాకయ్య, పాలక కవిత, ఐతయాకుబ్, గడ్డం నాగరాజు, బాధర పోయిన యాదగిరి, పిట్టల సతీష్, హంస మంజుల, పెట్టే మమత, సింగారపు శైలజ, గుంటి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి

ప్రజాపక్షం/ములుగుప్రతినిధి: మారుమూలవెను కబడిన ప్రాంతాల నిరుపేదల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, 2028 సంవత్సరం నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్ మూడవ స్థానంలో ఉండే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం ములుగు జిల్లా పర్యటనలో భాగగా ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో కేంద్ర హోంవ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఎస్‌పి శబరీష్, ఐటిడిఏ

సమగ్ర కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలి

ప్రజాపక్షం/బిచ్కుందః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సర్వే బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కొరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇది ఎవరిని ఇబ్బంది పెట్టేందుకు కాదని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక దిక్సూచి అవసరాల కొరకు తీసుకుంటున్న సమాచారమే అని, ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని ఎమ్మెల్యే వివరించారు. సైబర్ నేరగాళ్ళతో జాగ్రత్త వహించి ఎలాంటి బ్యాంకు వివరాలు, ఓటీపీ వివరాలు, ఇతరులతో పంచుకోవద్దని ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు సోమవారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

పథకాలు ప్రతి ఇంటికి అందేందుకే సమగ్ర సర్వే:ఎమ్మెల్యే

ప్రజాపక్షం/ఎడపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేందుకే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ, కుల గణన సర్వే చేపడుతుందని, ప్రజలు ఎన్యుమలేటర్లకు సహకరించి సమాచారం అందించాలని మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం నవీపేట్ మండలంలో పర్యటించారు. ముందుగా మొకన్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను డీఈవో అశోక్‌తో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని ఉపాధ్యాయినులకు ఆదేశించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 85కల్యాణ లక్ష్మీ , షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అంఇంచారు. నవీపేట్ మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సమగ్ర సర్వేపై ప్రజలు అపోహలు పెట్టుకోవద్దని, వాస్తవ సమాచారం ఇచ్చి సర్వే సిబ్బందికి సహకరించాలని తెలిపారు. గత పదేళ్ల కేసీఆర్ సర్కారు చేయని పనులను 11నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి అమలు చేసి చూపారని తెలిపారు. బీఆర్ఎస్ సర్కారు పదేళ్లలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం 50వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, మండల రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్ సహా తహసీల్దార్ ఇతర అధికారులపై దాడిని ఖండిస్తూ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో రెవెన్యూ ఉద్యోగులు సోమవారం సాయంత్రం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమణ్‌రెడ్డి మాట్లాడుతూ వికారబాద్ జిల్లా కలెక్టర్ తహసీల్దార్, ఇతర ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్లిన అధికారులపై క్రిమినల్స్ తరహాలో మూకుమ్మడిగా దాడి చేయడం శోచనీయమని ఆక్షేపించారు. ఈ దాడికి పాల్పడిన వాళ్లందరిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేంత వరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని తమ నిరసనను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కలెక్టర్ సీసీ మహేష్, ఆయా విభాగాల పర్యవేక్షకులు శ్రీనివాస్, భాస్కర పాల్గొన్నారు.

ఈతకు వెళ్ళి .. యువకుడి మృతి

ప్రజాపక్షం/నిజాంసాగర్: సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్ళిన యువకుడు మృత్యువాతపడిన ఘటన జుక్కల్ నియోజకవర్గంలోని మహ్మద్‌నగర్ మండలం కొమలంచ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొమలంచ గ్రామానికి చెందిన గున్కుల్ పోచయ్య కుమారుడు శివానంద్(18) బాన్సువాడలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్నాడు. మల్లూరు గ్రామంలో తమ బంధువుల ఇంటికి వెళ్ళగా తన అత్తమ్మ కుమారుడు సందీప్, మరికొంత మంది మిత్రులతో కలిసి మాంజీరా నదిలో స్నానం చేయడానికి వెళ్ళారు. ఈ క్రమంలో శివానంద్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయినట్లు ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వెళ్ళడించారు.

ఎమ్మెస్సీ ఫారం వద్ద రైలు ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాపక్షం/ఎడపలి: ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామంలో సోమవారం ఉదయం రైలు ఢీకొన్న ఘటనలో ఎమ్మెస్సీ ఫారం గ్రామానికి చెందిన మహమ్మద్ కాశీం(71) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన మహమ్మద్ కాశీం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిజామాబాద్ రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని మృతదేమాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాలకృత్యాలు తీర్చుకొనేందుకు రైలు పట్టాలు దాటి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు.

విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణింపు

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్: విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోను రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోనీ సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో క్రీడ పోటీలలో గెలిచిన విద్యార్థులకు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఏకాగ్రతతో చదువులోను రాణించాలని అన్నారు. ఈ నెల 6,7,8 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి గిరిజన సంక్షస్తమ బాలికల క్రీడా పోటీలలో జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలలకు చెందిన 14 నుండి 17 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్, కరీంనగ జిల్లాలోని హుస్నాబాద్‌లో నిర్వహించిన హ్యాండ్ బాల్ పోటీలు, ఉట్నూర్‌లో నిర్వహించిన ఖోఖో పోటీలలో పాల్గొని బంగారు పథకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలని, సమాజంలో మంచి గుర్తింపును సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, గిరిజన సంక్షస్తమ అధికారి మీనారెడ్డి, ఎసిడబ్ల్యూఓ ఉద్దవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు, శిక్షకులు విద్యాసాగర్, రవీందర్, పాల్గొన్నారు.

తరలి వచ్చి... సమస్యలు విన్నవించి

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజన్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. దహేగాం మంలం దేవాజి గూడెం గ్రామానికి చెందిన సిద్దం శ్రీహరి తన పేరిట ఉన్న భూమి తన ఆధీనంలో ఉండగా ఆన్‌లైన్‌లో ఇట్టి భూమిని తనకు విక్రయించిన వారి పేరిట చూపిస్తుందని, సవరించాలని, ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన హివారే సాయికుమార్ నిరుపేద అయిన తనకు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలని, చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన ఖోబ్రగడే గంతిదాస్ మండలంలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కెరమెరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి గోపాల్ తనకు పెండింగ్ వేతనం ఇప్పించాలని కోరుతూ పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో కొసాగుతున్న సామాజిక, ఆర్థిక, వైద్య, ఆరోగ్య, రాజకీయ, కుల సర్వేలో అధికారులు సమన్వయంతో పని చేసి సర్వే ప్రక్రియకు ఇబ్బందులు లేకుండా చూడాలని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గురుకులాలను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజావాణికి 70 ఫిర్యాదులు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఇన్‌చార్జి డీపీఓ శ్రీనివాస్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి సర్వే దోహదం

కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : సమగ్రాభివృద్ధికి తొలి మెట్టు వలె సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం పెద్ద శంకరంపేట్ మండల కేంద్రంలో కుటుంబ సమాచార సేకరణ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రగతి ప్రణాళికల రూపకల్పనకు జరుగుతున్న సర్వేలో ఎన్యూమరేటర్లు సేకరించిన డేటా ఎంట్రీ పగడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే మెటీరియల్ పటిష్ఠ భద్రతకై ట్రంక్ పెట్టెల్లో భద్రపరచాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ నమోదు చాలా సీక్రెట్ గా జరగాలని, నమోదు చేసే సమయంలో ఇతరులను అనుమతించొద్దని పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. సర్వే టైం బాండ్ ప్రోగ్రామని వేగం పెంచాలని స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాటుకు తావులేకుండా కుటుంబం యొక్క సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమగ్రాభివృద్ధికి తొలి మెట్టు అని, దీని ద్వారా ఆరులైన ప్రజలకు ఏది అవసరమో, ఎలా అమలు చేయాలనే అంశాలపై ప్రణాళికలు రూపకల్పన జరుగుతుందని అన్నారు. ప్రణాళికలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని ప్రజలు సర్వే సిబ్బందికి కుటుంబ సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో కుటుంబాల వారీగా ప్రజల ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలన్నింటినీ సమగ్రంగా సేకరించే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎంతో ఆలోచన చేసి ప్రతిష్టాత్మకంగా సర్వే చేపట్టినట్లు తెలిపారు. జిల్లా తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఈ సర్వే ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో ముమ్మరంగా సర్వే జరుగుతున్నట్లు తెలిపారు. సర్వే నిర్వహణ తీరును సూపర్ వైజర్లు, మండల నోడల్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జిల్లా నోడల్ అధికారి పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు పది ఇళ్లను సర్వే చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

పత్తి పంటకు రూ.12 వేలు ధర కల్పించాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్: పత్తి పంటకు రూ. 12 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని, తేమ పరీక్ష లేకుండా సిసిఐ, ప్రైవేటు జిన్నింగ్ మిల్లుల ద్వారా కొనుగోలు చేయాలని బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక శాతం ప్రజలు కేవలం వర్షాధార వ్యవసాయాన్ని నమ్ముకొని రైతులు జీవనం కొనసాగిస్తున్నారని, అందులో ముఖ్యంగా గత సంవత్సరంలో పత్తి క్వింటాలుకు పదివేలపై చిలుకు ధర ఉండటము మూలంగా ఈ ఏడాది సైతం రైతులు అధిక శాతం పత్తి పంట పండించడం జరుగుతుందని అన్నారు. ఈ పంట కాలంలో జిల్లాలో అత్యధిక వర్షాలు కురవడం, చీడపీడల బెడద ఎక్కువ అవడం వల్ల పత్తి పంట దిగుబడి పూర్తి కనిష్ట స్థాయికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పురుగు మందు ధరలు ఇత రాత్ర ఖర్చులు అధికమై రైతులకు మిగులు బాటు లేమూలిగే నక్కపై తాటి పండు పడ్డ విధంగా రైతుల పరిస్థితి తయారైందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ రైతుల పక్షాన ప్రభుత్వానికి తేమ పరీక్ష లేకుండా పత్తి కొనుగోలు చేసేలా సిఫారసు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసి సంఘం నాయకులు పురుషోత్తం, బాలేష్, ప్రశాంత్, సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా పత్తి కొనుగోలు ప్రక్రియ

కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : పత్తి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తో కలిసి ఆమె వ్యవసాయ మార్కెటింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ,జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో కొనుగోలు చేసిన పత్తికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంటను అమ్మిన వెంటనే నిర్దేశించిన సమయంలోపు రైతుల ఖాతాలలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి తేమ శాతంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించి అధిక లాభాలు పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోజువారీగా సేకరించిన పత్తికి సంబంధించిన వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. పత్తి పంటను విక్రయించడానికి వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మార్కెట్ యార్డులలో మెరగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ కార్యదర్శులు అజాం అలి, దుండా నాయక్, పుద్యానాయక్, గంగన్న, చంద్రశేఖర్ నాయక్,వెంకటేశ్వర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్‌లో ప్రారంభమైన గురుకుల స్పోర్ట్స్ మీట్

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి డిస్‌పి ప్రసన్న కుమార్

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం 10వ రాష్ట్ర స్థాయి జోనల్ స్పోర్ట్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన 13 గురుకుల పాఠశాలల క్రీడాకారులు 1105 మంది హాజరయ్యారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో లాంగ్‌జంప్, హై జంప్, షార్ట్‌పుట్, అథ్లెటిక్స్, రన్నింగ్, బాల్ బ్యాడ్మింటన్, డిస్కస్ త్రో, చెస్ , క్యారమ్, హ్యాండ్ బాల్ పోటీలు జరుగనుండగా తొలిరోజు మెదక్ డిస్‌పి ప్రసన్న కుమార్, కో ఆర్డినేటర్ సువర్ణ లత ప్రారంభించారు. ఈ నెల 14 వరకు పోటీలు కొనసాగనుండగా విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. 2024, 2025కు సంబంధించి 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీలను డిస్‌పి ప్రసన్న కుమార్, కో ఆర్డినేటర్ సువర్ణ లత క్రీడా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జాతీయ, ఒలంపిక్స్, సొసైటీ జెండాలను ఓవరాల్ డిస్‌పి, సీఐ నాగరాజు, తహశీల్దార్ లక్ష్మణ్ బాబు ఎగురవేశారు. ముందుగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. మెదక్ విద్యార్థినుల నృత్యం ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన డిస్‌పి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగంలోనూ రాణించినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడా పోటీలను స్ఫూర్తిగా తీసుకొని, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ.. మనం శారీరకంగా, మానసికంగా బలపడాలంటే క్రీడలు చాలా ఉపయోగపడతాయన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ మెదక్ ప్రిన్సిపాల్ సువర్ణ లత మాట్లాడుతూ నిరంతర సాధనతోనే విద్యార్థుల్లో అన్ని రంగాల్లో రాణించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రామక్కపేట్, చిన్నబోనాల, బద్దెనపల్లి, ఇల్లంతకుంట, వేములవాడ, చొప్పదండి, హుజూరాబాద్, నర్మల, వర్గల్, గజ్వేల్, కొల్చారం, తూప్రాన్, రామాయంపేట ప్రిన్సిపాలు, విద్యార్థులు హాజరయ్యారు. జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్ 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్, సీనియర్ వైస్ ప్రిన్సిపల్ తెలియజేశారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో జూనియర్ వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం, ఉపాధ్యాయేతర బృందం, పిడి, పిఈటిలు ఉన్నారు.

అన్ని రిజిస్ట్రేషన్లు నిలిపివేత

ఆందోళనలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : అన్ని బరాబర్ తీసుకుంటూ రిజిస్ట్రేషన్లు మాత్రం నిలిపివేస్తున్నారని జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌పై రియలెస్టేట్ ఏజెంట్లు ఆందోళన చేపట్టామని రియలెస్టేట్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి రఘువీర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ల విషయంలో లేనిపోని కొర్రిలు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని నినాదాలు చేశారు. అనంతరం రియలెస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్స్ షాపులను మూసివేయించారు. ఈ సందర్భంగా రియలెస్టేట్ వ్యాపారులు డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ విషయంలో సబ్‌రిజిస్ట్రర్ కాలయాపన చేస్తూ సమయాన్ని వృధా చేస్తున్నారని, పాత ఇళ్ల లింక్ డాక్యుమెంట్లు వగైరా డాక్యుమెంట్లు తెస్తే తప్ప రిజిస్ట్రేషన్ చేయడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో అనవసరంగా ఇబ్బందులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఇటీవల రియలెస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ దృష్టికి తీసుకెళ్లగా రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రమేష్‌రెడ్డితో సమస్యలు సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రియలెస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

క్రీడాకారులుగా ప్రపంచ దేశాలకు పోటీనివ్వాలి...

ప్రజాపక్షం/ముధోల్:క్రీడాకారులు రానున్న రోజుల్లో ప్రపంచ దేశాలకు భావి క్రీడాకారులుగా పోటీనివ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో 10వ జోనల్ క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభానికి ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్రీడలు మానసికంగానే కాకుండా ఎన్నో విధాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.క్రీడలు ఒడిదుడుకుల్లో తలబడకుండా నిలదొక్కుకోవడం నేర్పుతాయన్నారు.ప్రతి ఒక్కరిలో సోదరభావం పెంపొందించేది కేవలం క్రీడలనే పేర్కొన్నారు. క్రీడల నిర్వహణకు చేసిన ఏర్పాట్ల పట్ల అధికారులను అభినందించారు. జోనల్ స్థాయి క్రీడలకు ముధోల్ వేదికగా నిలవడం గర్వించదగ్గ విషయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా నరిసంహారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి ఫ్లోరెన్స్ రాణి, డీసీవో ప్రశాంతి, మాజీ జడ్పీటీసీ నర్సాగౌడ్, దత్తాత్రి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ సాయిరాం, పిఈటిలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల మొరను, ఆలకించేది ఎవరు?

ప్రజాపక్షం/నర్సాపూర్: తెలంగాణ రాష్ట్రం రైతంగం నివ్వెరబోతోంది. నర్సాపూర్ జి మండలంలో పండించిన పంటను సకాలంలో అమ్ముకోలేక రైతులు నానా తంటాలు పడుతున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేలు వరికొనుగోలు కేంద్రలను ఏర్పాటు చేస్తూ రైతులను ఆపాటికే సంతోష పెడుతూ చేతులు దులుపుకుంటుంన్నారే తప్ప గింజామాత్రం కొనుగోలు కేంద్రం నుండి కదలడంలేదు. గిట్లేందుకని వరి కొనుగోలు కేంద్రం నిర్వహకులను రైతులు ప్రశ్నిస్తే పై అధికారుల నుండి సమాచారం రాలేదని నిర్లక్ష్యపు మాటలు చెబుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ఒకవైపు రభి పంట సాగుకు పనులు ప్రారంభం కావడంతో రైతులు. అటు మరోపంటవేయుటకు భూమిని సాగుచేయుటకు వెళ్లాలా లేక చేతికోచ్చిన పంటను అమ్ముకోవడానికి రోజుల తరబడి కొనుగోలు కేంద్రలవద్ద రోజుల తరబడి ఇక్కడే పడి ఉండాలాన్న విషయంపై రైతులు తీవ్ర ఆందోళనకు గురైతున్నారు.

క్రీడ

అందుకే లక్నో సూపర్ జెయింట్స్‌ను వీడాను: కెఎల్ రాహుల్

స్వేచ్ఛగా ఆడటంతో పాటు ఫ్రెష్‌గా కెరీర్‌ను రీస్టార్ట్ చేయాలనే లక్ష్యంతో లక్నో సూపర్ జెయింట్స్ జట్టును వీడినట్లు ఆ జట్టు మాజీ కెప్టెన్, టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తెలిపాడు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు లక్నో జట్టు తమ కెప్టెన్ కేఎల్ రాహుల్‌ను వేలంలోకి వదిలేసిన విషయం తెలిసిందే. జట్టులో కొనసాగేందుకు లక్నో సూపర్ జెయింట్స్ కన్విన్స్ చేసిన రాహుల్ ఒప్పుకోలేదని వార్తలు వచ్చాయి. ఆ జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా కూడా పరోక్షంగా రాహుల్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆడేవారు తమకు అవసరం లేదని రాహుల్ పేరు ప్రస్తావించకుండా విమర్శలు గుప్పించాడు. కానీ కేఎల్ రాహుల్ మాత్రం ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. తాజాగా అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో లక్నో జట్టును వీడటానికి గల కారణాలను, తన లక్ష్యాలను వెల్లడించాడు. మరింత స్వేచ్ఛగా ఆడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పాడు. భారత టీ20 జట్టులోకి పునరాగమనం చేయడమే తన లక్ష్యమని, అందుకు ఐపీఎల్ 2025 సీజన్‌ను వారధిగా ఉపయోగించుకోవాలనుకుంటున్నానని స్పష్టం చేశాడు. 'నా టీ20 కెరీర్‌ను మళ్లీ ఫ్రెష్‌గా ప్రారంభించాలనుకుంటున్నాను. అందుకు గల అవకాశాలను అన్వేషిస్తున్నాను. స్వేచ్ఛగా ఆడే పరిస్థితులున్న జట్టులోకి వెళ్లాలనుకుంటున్నా. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడగలిగే పరిస్థితులున్న జట్టు కోసం ఎదురు చూస్తున్నా. మనకు మంచి జరగాలంటే కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిందే. నేను కొంతకాలంగా భారత టీ20 జట్టుకు దూరంగా ఉన్నాను. ఆటగాడిగా నేను ఎక్కడ ఉన్నానో నాకు బాగా తెలుసు. పూర్వవైభవం రావడానికి ఏం చేయాలో కూడా తెలుసు. కాబట్టి అప్‌కమింగ్ ఐపీఎల్ సీజన్‌ను అందుకు వేదికగా వాడుకోవాలనుకుంటున్నాను. నా ఆటను ఆస్వాదించాలనుకుంటున్నాను. భారత టీ20 జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడమే నా ప్రధాన లక్ష్యం.'అని కేఎల్ రాహుల్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2022 సీజన్‌లో కొత్తగా వచ్చిన లక్నో సూపర్ జెయింట్స్‌కు కెప్టెన్‌గా ఎంపికైన రాహుల్.. వరుసగా మూడు సీజన్లలో ఆ జట్టును నడిపించాడు. గత సీజన్ మినహా ఆ జట్టు రెండు సార్లు ప్లే ఆఫ్స్ చేరింది. గత సీజన్‌లో అటు బ్యాటర్‌గా.. ఇటు సారథిగా రాహుల్ విఫలమయ్యాడు. నిలకడలేమి ఆటతో పాటు జిడ్డు బ్యాటింగ్‌తో రాహుల్ తీవ్ర విమర్శలపాలయ్యాడు. ఈ ప్రదర్శనతో భారత టీ20 జట్టుకు దూరమయ్యాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో కేఎల్ రాహుల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) కొనుగోలు చేసే అవకాశం ఉంది. అప్‌కమింగ్ సీజన్‌లో అతను కెప్టెన్‌గా కాకుండా సాధారణ ఆటగాడిగా కొనసాగవచ్చు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ నికోలస్ పూరన్(రూ. 21 కోట్లు)తో పాటు రవి బిష్ణోయ్(రూ. 11 కోట్లు), మయాంక్ యాదవ్(రూ. 11 కోట్లు), మోహ్‌సిన్ ఖాన్(రూ. 4 కోట్లు), ఆయుష్ బదోని(రూ. 4 కోట్లు)లను రిటైన్ చేసుకుంది.

భారత్ లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించే దమ్ము లేదు: ఆకాశ్ చోప్రా

భారత జట్టు లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించడం సాధ్యం కాదని మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. భారత జట్టు ఆడకపోతే టోర్నీ నిర్వహణకు ఆర్థిక సమస్యలు ఏర్పడుతాయని తెలిపాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ)కే ఉన్నాయి. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పాకిస్థాన్ వేదికగా ఈ టోర్నీ జరగాల్సి ఉంది. ఇప్పటికే ఈ టోర్నీ కోసం పీసీబీ వందల కోట్లు ఖర్చు చేస్తోంది. స్టేడియాలను పునరుద్ధరించడంపై ఫోకస్ పెట్టింది.

భారత్ లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ..?

అయితే పాకిస్థాన్‌లో పర్యటించేందుకు టీమిండియా ససేమిరా అంటుంది. భద్రతా కారణాలు చూపుతూ పాకిస్థాన్‌లో పర్యటించలేమని, హైబ్రిడ్ మోడల్‌లో ఈ టోర్నీ నిర్వహించాలని ఐసీసీని కోరింది. తమ మ్యాచ్‌లను తటస్థ వేదికైన దుబాయ్‌లో నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. అయితే ఈ ప్రతిపాదనకు పీసీబీ అంగీకరించడం లేదు. భారత్ తమ దేశానికి రాకపోతే వారి స్థానంలో మరో జట్టుకు అవకాశం ఇవ్వాలని పీసీబీ ఐసీసీని డిమాండ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ టీమిండియా వాదనకు ఐసీసీ కట్టుబడి ఉంటే.. ఈ టోర్నీ నుంచి తప్పుకుంటామని, న్యాయ పోరాటం చేస్తామని కూడా పీసీబీ హెచ్చరించినట్లు ప్రచారం జరుగుతోంది.

అంత సీన్ లేదు..

ఈ క్రమంలోనే తన యూట్యూబ్ చానెల్ వేదికగా ఈ వ్యవహారంపై స్పందించిన ఆకాశ్ చోప్రా.. భారత్ లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించే దమ్ము ఐసీసీకి లేదన్నాడు. 'ఇది ఐసీసీ టోర్నీ. ఈ మెగా టోర్నీ కోసం బ్రాడ్‌కాస్టర్స్ బాగా డబ్బులు ఖర్చు చేస్తారు. భారత్ ఆడుతుందని ఐసీసీ హామీ ఇవ్వకపోతే ప్రసారకర్తలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రారు. భారత్ ఆడకపోతే టోర్నీ నిర్వహణకు ఆర్థిక సమస్యలు ఏర్పడుతాయి. ఆదాయం భారీగా తగ్గిపోతుంది. 2023 వన్డే ప్రపంచకప్ సమయంలోనూ గత పీసీబీ అధ్యక్షుడు శత్రు దేశ భూభాగంలో అడుగుపెడుతున్నామని వ్యాఖ్యానించాడు. ఒక వేళ భవిష్యత్‌లోనూ పాకిస్థాన్.. భారత్‌తో ఆడకూడదని నిర్ణయం తీసుకుంటే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది.

బిసిసిఐ పవర్ ఫుల్..

క్రికెట్ బోర్డుల్లో బిసిసిఐ ఆర్థికంగా ఎంతో బంగా ఉంది. పీసీబీకి మాత్రం అలాంటి పరపతి లేదు. ఇది అందరికి తెలిసిన విషయమే. బిసిసిఐ వ్యతిరేకంగా ఏ క్రికెట్ బోర్డు నడుచుకోదు. భారత్ లేకుండా ఛాంపియన్స్ ట్రోఫీ జరగదు. ఈ విషయం పాకిస్థాన్‌తో సహా అన్ని జట్లకు తెలుసు. భారత ప్రభుత్వం అనుమతి లేకుండా బిసిసిఐ.. పాక్‌లో పర్యటించలేదు. భారత్ లేకుండా ఈ టోర్నీని నిర్వహించలేరు. కాబట్టి హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ జరుగుతుంది. భారత్ మ్యాచ్‌లు యూఏఈలో నిర్వహించే అవకాశం ఉంది.'అని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు.

రీల్

సాలిడ్ పోస్టర్‌తో 'పుష్ప-2' ట్రైలర్ డేట్ లాక్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'పుష్ప2' కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ సినిమా నుండి ఎలాంటి అప్డేట్ వచ్చినా ప్రేక్షకులు, అభిమానులు అందరూ ఫాలో అవుతున్నారు. ఇక ఈ సినిమాను డిసెంబర్ 5న గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతుండగా.. ఈ చిత్ర ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఈ చిత్ర ట్రైలర్ డేట్ అండ్ టైమ్‌ను 'పుష్ప2' మేకర్స్ తాజాగా వెల్లడించారు.ఇండియన్ బిగ్గెస్ట్ మూవీగా తెరకెక్కిన 'పుష్ప2' ట్రైలర్‌ను నవంబర్ 17న సాయంత్రం 6:03 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు ఓ సాలిడ్ పోస్టర్ ద్వారా అనౌన్స్ చేశారు. ఈ పోస్టర్‌లో అల్లు అర్జున్ తనదైన స్వాగ్‌తో భుజంపై తుపాకీ పెట్టుకుని నడుచుకుంటూ వస్తున్నాడు. ఇక ఈ అనౌన్స్‌మెంట్‌తో సోషల్ మీడియాలో 'పుష్ప2' రచ్చ చేస్తున్నాడు. ఈ ట్రైలర్‌ను సుకుమార్ అండ్ టీమ్ ఎలా కట్ చేశారా.. అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఈ సినిమాలో అందాల భామ రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

ప్రభాస్ 'స్పిరిట్' పై కొత్త రూమర్ ?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్టార్ లైనప్‌లో భారీ అంచనాలు ఉన్న సినిమా 'స్పిరిట్'.సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా రాబోతుంది.ప్రస్తుతం 'స్పిరిట్' చిత్రానికి సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్‌జరుగుతున్నాయి. ఇందులో భాగం గా సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ తో కలిసి సందీప్ రెడ్డి వంగా జర్నీ కూడా చేస్తున్నారు. సినిమాలో సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యత ఉండటం తో హర్షవర్ధన్ రామేశ్వర్ షూటింగ్ కి ముందు నుంచే దర్శకుడితో ట్రావెల్ అవుతున్నాడు.ఐతే, ఈ సినిమా షూటింగ్ డిసెంబర్ నుంచి స్టార్ట్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని.. కాకపోతే మొదటి రెండు షెడ్యూల్స్ లో ప్రభాస్ జాయిన్ కాదు అని, మార్చిలో మొదలయ్యే మూడో షెడ్యూల్ నుంచి ప్రభాస్ షూట్ లో జాయిన్ అవుతాడని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని టిసిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. అన్నట్టు 'స్పిరిట్' మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. సందీప్ రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమా రాబోతుందని తెలుస్తోంది.

'ఒజి' రిలీజ్ పై ఇంట్రెస్టింగ్ రూమర్స్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సుజీత్ తో చేస్తున్న అవైటెడ్ యాక్షన్ డ్రామా ఓజి కూడా ఒకటి. మరి దీనిపై ఉన్న అంచనాలు కానీ హైప్ కానీ ఏ లెవెల్లో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కానీ సినిమా ఎంతైతే వేగంగా స్టార్ట్ అయ్యి షూటింగ్ జరిగిందో అంతే నెమ్మదించిపోయింది అని చెప్పాలి.అయితే ఈ సినిమా కాకుండా పవన్ ఆల్రెడీ మరో బిగ్ ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు కూడా చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా కూడా లాస్ట్ స్టేజ్ లో ఉంది. మరి ఈ సినిమా రిలీజ్ డేట్ ని కూడా ఫిక్స్ చేసుకుంది. కానీ లేటెస్ట్ గా మాత్రం ఈ సినిమా కంటే ముందే ఓజి రిలీజ్ ఉంటుంది అని ఫ్రెష్ రూమర్స్ స్టార్ట్ అయ్యాయి. అంటే మళ్ళీ వీరమల్లు వెనక్కి వెళ్ళినట్టేనా అన్నట్టు టాక్ మొదలైంది. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది వేచి చూడాలి.

పదేళ్లలో నిరుద్యోగులను పట్టించుకోని బిఆర్ఎస్

పదినెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చాం
తెలంగాణ ఏమీ కోల్పోలేదు...
పెద్దాయన(కెసిఆర్) ఇంట్లో నలుగురు
ఉద్యోగాలు కోల్పోయారు
ఎఎంవిఐలకు ఉద్యోగ నియామక పత్రాల
పంపిణీలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు అప్పట్లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం బాట పట్టారని, కానీ గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో చిక్కుముడి విప్పుతూ, పది నెలల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పారు. నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించడం తనకు సంతృప్తిని చ్చిందన్నారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 99 మంది అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎఎంవిఐ)లకు ఉద్యోగ నియామకపత్రాలను సిఎం అందజేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 10 నెలల్లో ఏమి కోల్పోయిందో ప్రజలు తెలుసుకున్నారని, ఒక పెద్దాయన అంటున్నారని, తెలంగాణ ఏం కోల్పోలేదని పెద్దాయన (కెసిఆర్) ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని అన్నారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ ఒక్కటైనా కట్టిందా అని సిఎం ప్రశ్నించారు. రెసిడెన్షియల్ స్కూల్ కట్టలేదు కానీ ఆయన మాత్రం 10 ఎకరాల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని అన్నారు. దాదాపు 13 ఏళ్ల కింద 2011లో రాష్ట్రంలో చివరిసారిగా గ్రూప్1 నిర్వహించారన్నారు. ఎన్ని ఆటంకాలు పెట్టినా పట్టుబట్టి గ్రూప్1 పరీక్షలు నిర్వహించామని చెప్పారు. త్వరలో గ్రూప్1 నియామకపత్రాలు అందజేస్తాని తెలిపారు.

తెలంగాణ సమాజం (కెసిఆర్)ను మరిచిపోయింది

''మీరు (కెసిఆర్) లేకపోయినా ఏం బాధలేదు, మీతో ప్రజలకేమి పనిలేదు, తెలంగాణ సమాజం నిన్ను మరిచిపోయింది'' అని కెసిఆర్‌ను ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యనే తెలంగాణ సమాజాన్ని నిర్మిస్తుందని నిరూపిస్తున్నామన్నారు. పది నెలల్లో రైతులు, నిరుద్యోగులను ఆదుకున్నామని, విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామని, తెలంగాణ పునర్నిర్మాణంలో ఇవన్నీ చేశామని సిఎం వివరించారు.

కొందరు చిచ్చుబుడ్లకు బదులు సారాబుడ్లతో దీపావళి జరుపుకుంటున్నారు

'కొందరు చిచ్చుబుడ్లకు బదులు సారా బుడ్లతో దీపావళి జరుపుకుంటున్నారు' అని సిఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకుంటూ దొరికినా మమ్మల్ని పట్టుకోవద్దని దబాయిస్తున్నారన్నారు. దీపావళి పండుగ రోజున డ్రగ్స్ తీసుకుని గృహప్రవేశం అని కొందరు బుకాయించే ప్రయత్నం చేశారన్నారు. లీడర్ అంటే లీడ్ చేసేవాడని, అందరికీ రోల్ మోడల్‌గా నిలిచేలా ఉండాలన్నారు. కానీ పండగ వస్తే డ్రగ్స్, సారా బుడ్లతో దావత్ చేసుకునే వారు కాదని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అలాంటి వారిని సామజిక బహిష్కరణ చేయాలని యువతను కోరుతున్నానని అన్నారు. ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారిని రోల్ మోడల్‌గా తీసుకోవాలో, డ్రగ్స్, సారా బుడ్లతో దావత్ చేసుకునే వారిని స్ఫూర్తిగా తీసుకోవాలో యువత ఆలోచించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ రాష్ట్రంలోకి రాకుండా సరిహద్దుల్లో ఉక్కు పాదం మోపాలన్నారు. ఇది ఉద్యోగం కాదు, ఇది భావోద్వేగం అన్నారు. కాలుష్యం నుంచి హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాలంటే రవాణా శాఖ సంపూర్ణ సహకారం ఉండాలన్నారు. త్వరలోనే ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఒక పాలసీ తీసుకొస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

రెండవ సారి అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులకు రెండో దశ ఇండ్ల స్థలాలు

'మీడియా మిత్రులరా సమాజంలో మీ బాధ్యతను కూడా నెరవేర్చాలి, మీ ఇళ్ల పట్టాలు ఎన్ని రోజులు పెడింగ్‌లో ఉండే, ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలంగాణ వరకు కూడా ఉద్యమాల్లో పాల్గొన్నా... స్థలం రాలేకదా?' అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాల మొదటి విడత అయితే క్లియర్ చేశాం కదా, రెండవ విడతకు మీరు సహకరించాలి. రెండవ సారి ప్రభుత్వం రాగానే ముందు మీ సమస్యనే పరిష్కరిస్తాం. జర్నలిస్టుల ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశాం. మీకు కూడా సోషల్ రెస్పాన్సిబిలిటీ ఉండాలి కదా. కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించాలి' అని సిఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టులను కోరారు.

విద్య ద్వారా పేదరికం నుంచి విముక్తి

విధ్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్య ద్వారానే పేదరికం నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి తెలంగాణ మైనార్టీ బాలికలు 2 పాఠశాల, కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ పి. సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మైనార్టీ వర్గాలలో ఆడపిల్లలను బడికి పంపించాలంటే ఇబ్బందిపడే రోజుల నుంచి మన పిల్లలను చదివిస్తే తప్ప భవిష్యత్తు ఉండదు అని భావించే వరకు వచ్చిందన్నారు. అన్ని కుల మతాల వారు కలిసి విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటి ప్రధాని నెహ్రూ నాయకత్వంలో కెబినెట్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని ఆయన పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇండియా సమీకృత విద్యాలయాలను నిర్మించేందుకు కలెక్టర్ అనువైన స్థలాన్ని అందించారని దీనిని వేగంగా నిర్మించుకుని పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందిస్తామన్నారు. మనకు కేటాయించిన స్థలంలో లెవలింగ్ పనులు త్వరగా ప్రారంభించాలని రాష్ట్రంలోనే మొట్టమొదటిగా ఖమ్మం యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలోనే మంచి స్కూల్ రఘునాథపాలెంలో ఉందనే కీర్తి మనకు రావాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచిందని మంత్రి తెలిపారు. పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చినందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి ని మంత్రి అభినందించి శాలువతో సన్మానించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జ్ఞాపకార్థం మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మతం, కులం పేరుతో విడగొట్టాలని ప్రయత్నం చేశారని మతం పేరుతో విడదీయవద్దని చెప్పిన మహనీయులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, ఆర్డీవో నర్సింహారావు, కార్పొరేటర్లు , ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియలేదు. ఏది ఏమైనా వర్సిటీలో ఇలా వరుసగా ఆత్మహత్యలు జరగడం ఆందోళన కలిగించే విషయమే. ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు ఇలాంటి వార్తతో బిక్కుబిక్కుమంటున్నారు.

పోలీసుల దాడిలో ఎబివిపి నాయకునికి తీవ్ర గాయాలు : విద్యార్థిని ఆత్మహత్యతో వర్సిటీ ప్రాంగణ ద్వారం వద్ద విద్యార్థి సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. నిరసనలో భాగంగా విద్యార్థి సంఘాలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో పోలీసుల అత్యుత్సాహంతో ఎబివిపి విద్యార్థి సంఘ నాయకుడైన సాయికి తలపై తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన అతనిని చికిత్స హుటాహుటిన బైంసా ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

కార్యదర్శిగా ఇ.శ్రీధర్

(మొదటి పేజీ తరువాయి)

శాఖ కమిషనర్‌గా కె.సురేంద్ర మోహన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా సిహెచ్.హరికిరణ్, ట్రాన్స్‌కో సిఎండిగా కృష్ణ భాస్కర్ నియమితులయ్యారు. డిప్యూటీ సిఎం ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కూడా కృష్ణ భాస్కర్ కొనసాగనున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సిఈఓగా శివశంకర్, పంచాయతీరాజ్, గ్రా మీణాభివృద్ధి డైరెక్టర్‌గా సృజన నియామకం అయ్యారు.

నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పడంతో, దర్యాప్తు అధికారులు ఆయనను విచారిం చేందుకు సిద్ధమయ్యారు. అయితే అనారోగ్య కారణంగా తాను విచారణకు హాజరుకావడం లేదని లింగయ్య విచారణ సమయానికి గంట ముందు దర్యాప్తు బృందానికి సమాచారం ఇచ్చారు. ఈ నెల 14న తప్పకుండా విచారణకు హాజరవుతానని ఆయన చెప్పినట్టు తెలిసింది.అదనపు ఎస్‌పి తిరుపతయ్యకు మాజీ ఎంఎల్ఎ లింగయ్యకు ఉన్న సంబంధాలపై దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే అరెస్టు అయిన డి.ఎస్.పి ప్రణీతరావు, అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్ ఫోర్స్ డిసిపి రాధా కిషన్ ఫోన్ డేటాను దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారు. వీరికి ఫోన్లు చేసిన రాజకీయ నేతలు,బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, మాజీ ఎంపిలు, మాజీ మంత్రులకు కూడా త్వరలో నోటీసులు జారీ చేసే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

కాలుష్యాన్ని... ఏ మతమూ ప్రోత్సహించదు

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించే ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించదని ధర్మాసనం వెల్లడించింది. బాణసంచాలు కాల్చడం అనేది ఫ్యాషన్ గా భావిస్తే, పౌరుల ఆరోగ్య రక్షణకు ఉద్దేశించిన ప్రాథమిక హక్కుకు విఘాతం కలిగించినట్లేనని ప్రత్యేకంగా ఉటంకించింది. ఢిల్లీ ప్రభుత్వం అందజేసిన నోట్ పై మాట్లాడుతూ అన్నివర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత బాణసంచాలు కాల్చడం ఏడాది అంతా అమలు చేయాలని, నవంబరు 25నాటికల్లా ఆదేశాలు అమలులోకి రావాలని ఆదేశించింది. ఢిల్లీకి సమీప రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వారి ప్రాంతాలలో బాణాసంచాల తయారీ, అమ్మకం, నిల్వ, బాణసంచాలను కాల్చడం నిషేధించే విషయమై స్పందించాలని ధర్మాసనం కోరింది. దేశ రాజధాని ఢిల్లీలో బాణసంచా నిషేధం అమలు విషయంలో ఢిల్లీ పోలీస్ వైఫల్యం చెందిందని విచారణ సందర్భంగా బెంచ్ తీవ్రస్థాయిలో మందలించింది. ఢిల్లీ పోలీసుల చర్యలు చూసీ చూడనట్లుగా ఉందని వ్యాఖ్యానించింది. ఢిల్లీ పోలీసులు బాణసంచా కాల్చడం, తయారీ, నిల్వపై ఢిల్లీలో నిషేధం ఉందన్న ఆదేశాలను సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించలేదన్నది తమ పరిశీలనలో వెల్లడైందని, మొట్టమొదట వారు చేయాల్సిన పని ఇదేనని బెంచ్ తెలియజేసింది. ఢిల్లీ పోలీస్ కమిషనర్ వెంటనే ఈ నిషేధ ఆదేశాలను సంబంధిత వ్యక్తులకు పంపించి నిలిపివేయాలని అందరికీ తెలియజేయాలని ఆదేశించింది. కాగా ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ధర్మాసనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ ప్రభుత్వం దసరా పండుగ తర్వాత అంటే అక్టోబరు 14 వరకు కేవలం రెండు రోజుల పాటు బాణసంచా వినియోగంపై నిషేధం ఉందనే ఆదేశాలను జారీచేసిందని పేర్కొన్నారు. కాగా దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యానికి అడ్డుకట్టవేసేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థిస్తూ 1985లో ఎంసి. మెహ్‌తా అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం నాడు వాదనలు విన్న నేపథ్యంలో ఈ నిషేధ ఆదేశాలు జారీ అయ్యాయి.

తెలంగాణ స్పెసీ కిచెన్‌ను పరిశీలించిన.. హైడ్రా కమిషనర్ ఎ వి రంగనాథ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర